అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 23-3-2018 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 84 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు వెల : 5.00



వెల్‌నెస్ మూతే!

మరో 'మూణ్నాళ్ల ముచ్చట'

- 'యథావిధి' ప్రకటన పెద్ద డ్రామా
- పెన్షనర్లు.. ఉద్యోగులకు ఇక చుక్కలే
- దీర్ఘకాలిక రోగులకిక నరకమే
- ఆందోళనలో వందలాది 'వెల్‌నెస్ ఉద్యోగులు'



ఏడాదిన్నర కిందట టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులు.. పెన్షనర్లు.. జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన 'వెల్‌నెస్' సెంటర్లను త్వరలో మూసివేయనుందా? ఇక ఆ వర్గాల్లో ఎవరైనా ధర్మాసుపత్రులపైనే మున్ముందు కాలంలో ఆధారపడక తప్పదా? జిల్లాకు ఒక వెల్‌నెస్ సెంటర్ అని నిన్నటిదాకా ఊదరగొట్టిన ప్రభుత్వం.. తొలి దశలోనే చేతులెత్తేసిందా? ఎందుకు?

శంభాజీ

సుమారు ఏడాదిన్నర కిందట ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉద్యోగులు, పెన్షనర్లు, పాత్రికేయుల కోసం ఒక ప్రత్యేక పథకం ప్రారంభించింది. అంతకు ముందు 'ఆరోగ్య శ్రీ' పథకంలో భాగంగా వారు సేవలు పొందే వారు. సేవల విషయంలో 'కొంత మొత్తం' వరకు మాత్రమే వారికి వెసులుబాటు ఉండేది. దాదాపు తెల్ల రేషన్‌కార్డు వారికి సమానంగా పాత్రికేయ వర్గాలకు.. రీ ఎంబర్స్‌మెంట్ నిబంధనల మేరకు ఉద్యోగ, పెన్షనర్లకు వైద్య సదుపాయాలు వర్తించేవి. అటు ఉద్యోగ ఇటు పాత్రికేయ సంఘాల చొరవ మేరకు వారికి ప్రత్యేక వసతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులకు జీతాలను భారీగా పెంచిన రీతిలోనే పాత్రికేయుల చికిత్స వ్యయ పరిమితిని సైతం పెంచింది. ఆ మేరకు రాష్ట్ర రాజధానిలో ఖైరతాబాద్, వనస్థలిపురంలో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. భారీ స్పందన వ్యక్తమైన నేపథ్యంలో నగరంలో కూకట్‌పల్లితో పాటు సిద్ధిపేట, వరంగల్ జిల్లా కేంద్రాల్లోనూ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఒక్కో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులోకి తెస్తామని మొన్నటికి మొన్న ప్రభుత్వం ప్రకటించింది కూడా!

అందని మందులకు వారం వాయిదా

అంతర్గతంగా ఏం జరిగిందో తెలియదు కానీ.. మూడు నెలలుగా వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణలో మార్పులు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ఉచితంగా అందించే ప్రత్యేక మందులు, అంటే.. ఒకింత ఖరీదైన మందుల సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. హృద్రోగ, కాలేయ, కాన్సర్, మెదడు సంబంధిత ...9లో

భాగ్యనగరంలో...బడా స్కాం

- 8 బ్యాంకులు.. రూ.1,394 కోట్ల టోకరా
- టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై సీబీఐ కేసు
- రంగంలోకి బృందాలు



హైదరాబాద్: దేశంలో బ్యాంకులను మోసం చేసిన కంపెనీల చిట్టా రోజు రోజుకూ పెరుగుతున్నది. చెన్నైలో 14 బ్యాంకులకు వెయ్యి కోట్ల మేర ఎగ్గొట్టిన కనిష్క్ గోల్డ్ సంస్థ వ్యవహారం బుధవారం వెలుగులోకి రాగా.. మరుసటి రోజైన గురువారం మరో కుంభకోణం బయటపడింది. వివిధ బ్యాంకులకు రూ.1,394 కోట్లు ఎగవేసిన టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయివేట్ లిమిటెడ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) గురువారం కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఈ కంపెనీ.. 8 బ్యాంకుల్లో రుణాలు తీసుకొని తిరిగి చెల్లించడం లేదని సీబీఐకి ఫిర్యాదులొచ్చాయి. తమ బ్యాంకు వద్ద టోటెం రూ.303.84 కోట్ల రుణం తీసుకొని మోసం చేసిందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) తొలుత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టోటెం ప్రమోటర్లు, డైరెక్టర్లు టోటెంపూడి సలాలిత్,



ఆయన భార్య కవితపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేసు నమోదు చేసిన తర్వాత సీబీఐ అధికారులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. టోటెం సంస్థ రోడ్డు ప్రాజెక్టులు, వాటర్ వర్క్స్, భవన నిర్మాణ పనులు చేపడుతోంది.

రుణం తీసుకున్నాక.. చెల్లింపులకు నో..

2012 జూన్ 30న బ్యాంకుల నుంచి రుణం పొందింది. ఆ తర్వాత చెల్లింపులు సక్రమంగా లేకపోవటంతో డిఫాల్టర్‌గా గుర్తించి, ఎన్పీఏగా ప్రకటించింది. దేశంలో గుర్తింపు పొందిన ఎల్అండ్‌టీ, ఆర్‌టీఎస్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ ...9లో



నేడు 'రాజ్యసభ' ఎన్నికలు

ఆరు రాష్ట్రాల్లో జరుగనున్న పోలింగ్

వివరాలు 2లో

'అమ్మ' ఆస్పత్రిలో ఉండగా..

సీసీటీవీలు ఆఫ్ చేశాం

అపోలో ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వివరాలు 2లో

ఆధార్ నిరాధారం..

బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా



వివరాలు 2లో

గీతకు తీపి కబురు..

- చెట్ల పన్ను బకాయిలు పూర్తిగా మాఫీ : శాసనసభలో సీఎం కేసీఆర్ ప్రకటన
- పన్ను విధానాన్నే రద్దు చేస్తున్నామని వెల్లడి



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ మాక్‌పోల్...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇప్పటి వరకూ గీత కార్మికులకు ఉన్న చెట్ల పన్ను బకాయిలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభలో ప్రకటించారు. ఇక నుంచి ఈ పన్ను వేసే విధానాన్నే రద్దు చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.16 కోట్ల భారం పడుతున్నదని చెప్పారు. అయినప్పటికీ గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని.. పన్నును రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అసెంబ్లీలో ప్రకటన చేశారు. హైదరాబాద్ నగరంలో గౌడ కులస్తుల అస్తిత్వాన్ని సమున్నతంగా చాటేందుకు వీలుగా 'రాష్ట్ర స్థాయి గౌడ భవనం' నిర్మిస్తామని అన్నారు. ఇందుకోసం ఐదెకరాల భూమిని కేటాయిస్తామని, రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. ఆ భవనం గౌడ కులస్తుల సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస కేంద్రంగా వెలుగొందాలని ...9లో

వాట్సాప్‌లో టెన్త్ లెక్కల పేపర్-2

- మాల్ ప్రాక్టీస్ నిర్వహిస్తుండగా పట్టుకున్న ఎస్ఐ
- ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్
- అదుపులో ఇద్దరు, పరారీలో నలుగురు..
- ఎంఈవో సహా పదిమందిపై కేసు

వివరాలు 3లో

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఎమ్మెల్యే సున్నం రాజయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ కార్మికులకు కనీసం వేతనం అమలు చేయాలనేదానిపై సీపీఐ(ఎం) వాయిదా తీర్మానం ఇచ్చినా అధికార పార్టీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ పథకాల్లో 3లక్షల మందికిపైగా పని చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న ...9లో

బీజేపీకి నాగం గుడ్ బై

- అధిష్టానానికి రాజీనామా లేఖ
- త్వరలోనే కాంగ్రెస్ తీర్థం



నవతెలంగాణ- మహబూబ్‌నగర్‌ప్రతినిధి

టీడీపీ హయాంలో ఉమ్మడి ఏపీ మంత్రిగా, తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకున్న బీజేపీ జాతీయ నేత నాగం జనార్ధన్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. గురువారమే అధిష్టానానికి రాజీనామా లేఖ అందించినట్టు ఆయన తెలిపారు. నాగం సుదీర్ఘ కాలం రాజకీయ నేతగా పనిచేసి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో మంత్రి పదవులు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీకి రాజీనామా చేసిన నాగం తెలంగాణ నగారా సమితి పార్టీని స్థాపించారు. అనంతరం బీజేపీలో చేరిన నాగం ఆ పార్టీలో ...9లో

హైవేలపై హోదా హోరు



- దిగ్విజయంగా ఏపీ దిగ్బంధం
- రాష్ట్ర వ్యాప్తంగా కదిలిన ప్రజలు
- ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్
- దప్పుకొట్టిన మధు, రామకృష్ణ, శివాజి
- గుంటూరులో జగన్ మద్దతు
- ప్రత్యేకంగా టీడీపీ నిరసన

వివరాలు 9లో



ఈ ఏడాదీ ప్రకృతి ప్రకోపం

కార్బన్ డై ఆక్సైడ్ అణువులతో భావితరాలకు ముప్పు

- 2017లో ప్రపంచ వ్యాప్తంగా విలయాల నష్టం ఖరీదు రూ. 20 లక్షల కోట్లు : ఐక్యరాజ్యసమితి వరల్డ్ మెటియోరాలాజికల్ ఆర్గనైజేషన్



(ఫైల్)

న్యూయార్క్ : ప్రపంచం మొత్తం మీద 2017 సంవత్సర కాలంలో వరదలు, తదితర వాతావరణ మార్పుల కారణంగా కనీసం రూ. 20,83,330 కోట్ల నష్టం వచ్చినట్టు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఏది ఏమైనా, గడిచిన మూడేండ్లలో ఆస్ట్రేలియాలో అత్యధిక ఉష్ణోగ్రతలతో అసాధారణమైన వేడి గాలులతో వాతావరణం భయానకంగా సాగిందని వార్షిక నివేదికలో ఐక్యరాజ్యసమితి అనుబంధ వరల్డ్ మెటియొరాలాజికల్ ఆర్గనైజేషన్ తెలియచేసింది. ఈ 2017 సంవత్సర కాలంలో ఇండియాలో కూడా వరదలు, ఇంకా ఇతర వాతావరణ తీవ్రతలు భారీ నష్టాలు కలిగించాయని, ఆ సంవత్సర కాలంలో పరిస్థితే ఇప్పటికీ 2018లో కూడా కొనసాగుతోందని ఈ సంస్థ సెక్రెటరీ జనరల్ పెటెరీ తాలాస్ ఆ నివేదికలో పేర్కొన్నారు. 19వ శతాబ్దం నుంచి సేకరించిన రికార్డులన్నిటిలో 2016 సంవత్సరం అత్యధిక ఉష్ణ వాతావరణం నమోదైన సంవత్సరం కాగా, 2015, 2017 సంవత్సరాలు ఆ తరువాతి స్థానాలను ఆక్రమించాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా గత ఏడాది పసిఫిక్ సముద్ర తీరం నుంచి ఉష్ణ గాలులు అన్ని దేశాలను ప్రభావితం చేసాయి. 2018లో యూరోప్, ఉత్తర అమెరికాల్లో అతిశీతల వాయువులు, ఇతర ప్రదేశాల్లో వేడి గాలులు ఈ వాస్తవ స్థితిని ప్రతిబింబిస్తున్నాయని అందులో వ్యాఖ్యానించారు. దాదాపు 8,00,000 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా వాతావరణంలో మిలియన్ (పది లక్షలు) అణువుల్లో 400 పార్టులు కార్బన్ డై ఆక్సైడ్ అణువులున్నట్టు లెక్కకడుతూ, రానున్న తరాలు మరింత ప్రమాదకరమైనకార్బన్ డై ఆక్సైడ్ అణువులతో సహజీవనం సాగించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీనికి 2015లో 200 దేశాలు పారిస్‌లో సమావేశమై కుదుర్చుకున్న ఒడంబడిక మాత్రమే పరిష్కారమని గుర్తుచేసింది.

మాదాపూర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 150కు పైగా బూడిదైన గుడిసెలు
- భారీగా ఆస్తినష్టం



వివరాలు 9లో

ఆధార్ నిరాధారం..

బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా



పాట్నా: మోడీ సర్కారుపై బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. నిరాధారమైన ఆధార్ కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరమేముందంటూ కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఆధార్ వ్యవస్థను వ్యర్థ కసరత్తుగా అభివర్ణిస్తూ గురువారం ట్వీట్ చేశారు. 'నిరాధారమైన ఆధార్‌తో ఏం జరుగుతుంది ? దాని కోసం పెద్ద ఎత్తున డబ్బు, మానవ వనరులను ఎందుకు ఖర్చు చేస్తున్నారు. ఆధార్‌పై చేస్తున్నదంతా వృథా ప్రయాసే అన్న సంగతి తెలియదా ?' అంటూ సొంత ప్రభుత్వాన్నే నిలదీశారు. డిజిటల్ గోప్యత ప్రతీ పౌరుని హక్కు అని ఆయన తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా సైట్లలో ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం అపహరణకు గురి కాకుండా కేంద్రం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో విదేశీ సంస్థలతో రాజీ పడవద్దని సూచించారు. ఫేస్‌బుక్ వినియోగదారుల డేటా లీకేజీ వ్యవహారంపై ప్రస్తుతం పెద్ద ఎత్తున చర్చ నడుస్తోన్న సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ తరఫున పని చేసిన కేంబ్రిడ్జి అనాలిటికాకు దాదాపు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని ఆ సంస్థ చేరవేసిందనిఇటీవల వార్తలు వెలుగులోకొచ్చాయి. దీనిపై కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బుధవారం స్పందిస్తూ.. ఫేస్‌బుక్‌ను వినియోగిస్తున్న భారతీయుల డేటా అపహరణకు గురైతే సహించేది లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఫేస్‌బుక్ సీఈఓకు సమన్లు జారీ చేసే అధికారమూ తమకున్నదని స్పష్టం చేశారు.

గాంధీ విగ్రహం విధ్వంసం

రాజస్థాన్‌లో ఒకరి అరెస్టు

జైపూర్ : త్రిపురలో లెనిన్ విగ్రహ విధ్వంసంతో మొదలైన హిందూత్వమూకల అరాచకం కొనసాగుతూనే ఉన్నది. తాజాగా రాజస్థాన్‌లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. జైసల్మేర్‌లో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకుగాను పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఇదేనా అధికారుల తీరు...

రాజస్థాన్ అడిషినల్ సీఎస్‌పై 'సుప్రీం' సీరియస్

జైపూర్: ఓ కేసులో హాజరయ్యేందుకు సుప్రీంకోర్టుకు వచ్చిన రాజస్థాన్ అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అడిషినల్ సీఎస్ మన్‌జీత్ సింగ్ ధరించిన డ్రెస్‌పై అత్యున్నత న్యాయస్థానం సీరియస్ అయ్యింది. 'మీరు ఎలాంటి దుస్తులు ధరించి కోర్టుకు వచ్చారు. ఉన్నతాధికారులకు ఓ డ్రెస్‌కోడ్ ఉన్నదని మీకు తెలియదా..? మీరు రూల్స్‌ను పాటించరా..? మీకు నిబంధనలు తెలియకపోతే తెలుసుకోండి. ఒక అత్యున్నత స్థానంలో ఉండి మీరు ఇలా రావడం సమంజసం కాదు. మీ కార్యాలయంలోకి ఎవరైనా ధోతి కట్టుకుని, సాధారణ చెప్పులు వేసుకుని వస్తే మీరు రాణిస్తారా?' అంటూ జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మన్‌జీత్‌సింగ్ సాధారణ షర్టు, ప్యాంటు ధరించి కోర్టుకు హాజరయ్యారు. ఆయనకు కోర్టు నిబంధనలు, ప్రభుత్వాధికారుల నియమాలు తెలియజేయాలని రాష్ట్రప్రభుత్వం తరపు అడిషినల్ సొలిసిటరీ జనరల్ ఎ.ఎన్.ఎస్. నద్కర్ణికి సూచించింది.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ పరీక్ష గురువారం విజయవంతంగా పూర్తయింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ కేంద్రం నుంచి భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) గురువారం ఉదయం 8:42 గంటలకు ఈ క్షిపణిని పరీక్షించింది. 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్దేశిత లక్ష్యాలను ఖచ్చితత్వంతో చేరుకునే సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంటుందని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. బ్రహ్మోస్‌ను డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్‌పీవో మషినోస్ట్రోయేనియాలు సంయుక్తంగా తయారు చేశాయి. గతేడాది నవంబర్‌లో తొలిసారిగా బ్రహ్మోస్‌ను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానం సుఖోయ్-30ఎంకేఐ నుంచి ప్రయోగించారు. క్షిపణి పరీక్ష విజయవంతంగా పూర్తి చేసిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభినందనలు తెలిపారు.

లైంగికదాడికి.. పాల్పడి ఇటుకతో బాది హత్య

- మృతదేహాన్ని సంచిలో కుక్కేసిన దుండగుడు

చండీగఢ్: ఇంట్లో ఒంటరిగా ఉన్న 16ఏండ్ల బాలికపై ఓ ట్రక్ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలి తలపై ఇటుకతో మోది చంపి.. ఓ సంచిలో కుక్కాడు. అప్పుడే ఇంటికి చేరుకున్న బాధితురాలి సోదరి.. సహాయం కోసం కేకలు వేయగా స్థానికులు అప్రమత్తమై ఆ దుండగుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన హర్యానాలో గురుగ్రాం నగరంలోని సిద్రావలి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలైన బాధితురాలి తల్లిదండ్రులు, ఆమె సోదరుడు పొలం పనికి వెళ్లగా ఆమె అక్క అప్పుడే బయటకెళ్లింది. దీంతో ఎన్‌హెచ్8కు సమీపంలోని ఆ ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై ట్రక్ డ్రైవర్ గజేందర్ లైంగికదాడికి పాల్పడి హత్య చేశాడు.

వేలు కత్తిరించి.. చెవి కోసి..


అహ్మదాబాద్: ఒంటరిగా కాలేజీకి వెళ్తున్న దళిత విద్యార్థిని (23)ని అపహరించి ఆమె వేలును కత్తిరించి, చెవిని కోసిన దారుణ ఘటన గుజరాత్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... భావ్‌నగర్ జిల్లాకు చెందిన దళిత మహిళ బొటాడ్‌లోని కళాశాలలో బీ.ఎడ్ చదువుతోంది. ఒంటరిగా కళాశాలకు వెళ్తున్న ఆమెను నలుగురు దుండగులు అడ్డగించారు. ఆమె జుట్టు పట్టి ఈడ్చుకుంటూ వారు తీసుకొచ్చిన వాహనంలోకి ఎక్కించారు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అతి కిరాతకంగా ఆమె వేలును కత్తిరించి, చెవిని కోసేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి అహ్మదాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. మెడికల్ పరీక్షలు నిర్వహించిన తరువాత ఆమెపై లైంగికదాడికి పాల్పడిన విషయం వెల్లడవుతుందని వైద్యులు తెలిపారు.

మైనర్లను నగ్నంగా నడిపించారు...

జైపూర్: పొలంలో పనిచేసేందుకు నిరాకరించిన మైనర్లు నగ్నంగా నడిపించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేస్తున్నది. పొలంలో పనిచేసేందుకు నిరాకరించినందుకు మైనర్లను సుమారు రెండు కిలోమీటర్లు నడిపించిన ఘటన స్థానికంగా పెద్ద దుమారమే లేపుతోంది. బికనీర్ సమీపంలోని మోతావ్తా గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఎవరైతే పిల్లలను నడిపించారో.. వాళ్లే వీడియో కూడా తీసినట్టు తెలుస్తోంది. దీనిపై స్పందించిన పోలీసులు.. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. మైనర్లను దారుణంగా వేధించారన్న పోలీసులు.. దీనిపై మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉందని చెప్పారు.

అంబేద్కర్‌పై పాండ్యా అవమానకర ట్వీట్

- ఎఫ్ఐఆర్ నమోదుకు జోధ్‌పూర్ కోర్టు ఆదేశం



జైపూర్: క్రికెటర్ హార్దిక్ పాండ్యా వివాదంలో చిక్కుకున్నాడు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ ట్వీట్ చేసిన కారణంగా పాండ్యాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాజస్థాన్ పోలీసులకు జోధ్‌పూర్ కోర్టు బుధవారం ఆదేశాలు జారీచేసింది. అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడంటూ డిఆర్ మేఘ్‌వాల్ అనే న్యాయవాది... ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం... పాండ్యాపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. కోర్టులో పిటిషన్ దాఖలు చేయకముందు మేఘ్‌వాల్ లూనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించారు. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. దేశంలో రిజర్వేషన్లు అనే వ్యాధిని వ్యాప్తి చేసిన వ్యక్తిగా అంబేద్కర్‌ను అభివర్ణిస్తూ పాండ్యా గతేడాది డిసెంబర్ 26న తన ట్వీట్ చేశాడు.

2013 ముజఫర్‌నగర్ అల్లర్లు

131 కేసులు ఉపసంహరణకు నిర్ణయం



లక్నో : 2013లో ముజఫర్‌నగర్, షామిలి జిల్లాలో చెలరేగిన మత ఘర్షణలకు సంబంధించిన 131 కేసులను ఉపసంహరించుకుకోవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో హత్య కేసులు 13, హత్యాయత్నానికి సంబంధించి 11 కేసులు కూడా ఉండటం గమనార్హం. బీజేపీ ఎంపీ సంజీవ్ భల్యాన్, భుదానా ఎమ్మెల్యే ఉమేష్ మాలిక్ నేతృత్వంలో స్థానిక నేతలు ఫిబ్రవరి 5న రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత బీజేపీ నేతృత్వంలోని యూపీ న్యాయ శాఖ కేసుల ఉపసంహరణ ప్రక్రియను ప్రారంభించింది. మత ఘర్షణలకు సంబంధించి 131 కేసులను ఉపసంహరించుకోవాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి ముజఫర్‌నగర్ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ 131 కేసుల్లోనూ నిందితులందరూ హిందువులే. ఇందులో భారతీయ శిక్షాస్మృతి కింద ఏడేండ్ల కఠిన కారాగార శిక్షకు సంబంధించిన సెక్షన్ల కింద కూడా కేసులు నమోదయ్యాయి. 2013 సెప్టెంబరులో ఒక మతానికి చెందిన వారిని లక్ష్యంగా చేసుకొని ముజఫర్‌నగర్, షామిలీ జిల్లాల్లో జరిగిన దాడుల్లో 62 మంది మృతిచెందారు. వేలాది మంది తమ తమ ఇండ్లను వదిలి వెళ్ళిపోయారు. 'అతి పాతవి, తీవ్రమైనవి కానివి' అంటూ ఈ కేసులపై ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఇటీవల వ్యాఖ్యలు కూడా చేశారు.

ఈ అల్లర్లకు సంబంధించి అప్పటి సమాజ్‌వాది పార్టీ ప్రభుత్వం 1,400 మందిపై 500 కేసులను నమోదుచేసింది. ఇప్పుడు నిందితులపై యోగి ప్రభుత్వం కేసులు ఉపసంహరించుకోవడాన్ని ఎస్పీ తీవ్రంగా విమర్శిస్తున్నది. ప్రభుత్వం తన పార్టీ నిందితులపై అల్లర్ల కేసులను ఎత్తివేయాలని ఆదేశిస్తున్నదని, ఇది న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఎస్పీ అధికార ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ ఆరోపించారు.

రాజ్యాంగాన్ని పరిహసించడమే : ఓవైసీ

కేసుల ఉపసంహరణకు ఆదేశించడం భారత రాజ్యాంగాన్నీ, ఇండియన్ పీనల్ కోడ్‌ను పరిహసించడమేనని ఎంఐఎం చీఫ్, పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. 62 మంది అమాయకులపై హత్యాకాండ, 50 వేల మంది ప్రజల శరణార్థులుగా మార్చిన నిందితులపై ప్రభుత్వం చర్యతీసుకోవాల్సిందిపోయి.. వారిని విడుదల చేయడం దుర్మార్గమని అన్నారు. 'బీజేపీ న్యాయబద్ధపాలన కాదు, మత పాలన సాగిస్తున్నది' అని ఓవైసీ ఆరోపించారు.



సోషల్ లచ్చలచ్చ

విపక్షాలకు విపక్షాలే అడ్డు...

ఫలించిన కేంద్ర వ్యూహాత్మక మౌనం

- టీడీపీ, టీఆర్ఎస్ పరస్పర ఆరోపణలు
- మరోసారి అవిశ్వాస తీర్మానాలకు అనుమతి నిరాకరణ
- నిరసనలు ప్రజలు చూడొద్దనే రోజంతా వాయిదా : చైర్మెన్ వెంకయ్యనాయుడు
- ఉభయసభలు శుక్రవారానికి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'విపక్షాలకు విపక్షాలే అడ్డు' అన్నట్టు చిత్రీకరించడంలో మోడీ సర్కారు సఫలీకృతమవుతోంది. పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు చేపడుతున్న నిరసనలపై కేంద్ర సర్కారు అనుసరిస్తున్న వ్యూహాత్మక మౌనం ఫలిస్తోంది. టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఆందోళనల వల్లే టీడీపీ, వైసీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలకు అనుమతించలేకపోతున్నామనే సంకేతాలను కేంద్రం పంపుతోంది. ఫలితంగా టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఆందోళనలపై టీడీపీ, వైసీపీ ఎంపీలు గుర్రుగా ఉన్నారు. 'బీజేపీ రచించిన డ్రామాలో భాగంగానే టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు' అని పార్లమెంట్ ఆవరణలో వైసీపీ, టీడీపీ ఎంపీలు ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఇటు టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమ రాష్ట్ర డిమాండ్లపై పోరాటం చేసే హక్కు తమకు ఉంటుందని పేర్కొన్నాయి. ఈ విధంగా 'విభజించు పాలించు' అన్నట్టుగా విపక్షాల్లో కేంద్రం చీలిక తీసుకొచ్చింది. పైగా అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధమంటున్నప్పటికీ... టీఆర్ఎస్, అన్నాడీఎంకే డిమాండ్లపై ప్రకటన చేసేందుకు కూడా కేంద్రం నిరాకరిస్తోంది.

ఐదోరోజూ అవిశ్వాస తీర్మానాలకు అనుమతి నిరాకరణ

ప్రత్యేక హోదా డిమాండ్‌పై ఏపీ ఎంపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలకు వరుసగా ఐదో రోజూ స్పీకర్ సుమిత్రా మహాజన్ అనుమతించలేదు. విపక్ష పార్టీలు వెల్‌లో ఆందోళన చేపడుతుండటంతో ఈ తీర్మానాలకు మద్దతుగా నిల్చున్న ఎంపీలను లెక్కించడం సాధ్యపడటం లేదని పేర్కొన్నారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు. అంతకముందు ఉదయం సభ ప్రారంభం కాగానే పీఎన్‌బీ కుంభకోణంతో పాటు ప్రత్యేక హోదా, రిజర్వేషన్, కావేరీ జలాల అంశంపై కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్, అన్నాడీఎంకే ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో సభను స్పీకర్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ విపక్షాల నిరసన

రాజ్యసభలోనూ విపక్ష పార్టీల ఎంపీల నిరసన కొనసాగింది. ఫలితంగా చైర్మెన్ వెంకయ్యనాయుడు సభను రోజంతా వాయిదా వేశారు. అంతకముందు ఎలాంటి చర్చ చేపట్టకుండా గ్రాట్యుటీ సవరణ బిల్లును పెద్దల సభ ఆమోదించింది. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే తమ డిమాండ్లపై కేంద్రం నుంచి సానుకూల ప్రకటన



వెలువడకపోవడంతో టీడీపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. విపక్ష ఆందోళనలపై చైర్మెన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సభలో దారుణమైన సన్నివేశాలను ప్రజలు చూడొద్దనే సభను వాయిదా వేస్తున్నాను' అని అన్నారు. 'ఒక్కో రోజు ఒక్కో పార్టీ సభను అడ్డుకుంటే వ్యవస్థ ఏం కావాలి' అని ప్రశ్నించారు. ఈ సమయంలో జైరాం రమేష్ లేచి మాజీ ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన వాగ్దానాలను సభలో గుర్తు చేసే ప్రయత్నం చేశారు. అయితే విపక్ష ఆందోళనలతో చైర్మెన్ సభను వాయిదా వేశారు. అంతకముందు విభజన చట్టంలోని హామీలపై టీడీపీ ఎంపీ సీఎం రమేష్ మాట్లాడారు. అయితే విభజన చట్టం హామీలపై గత సమావేశాల్లోనే సుదీర్ఘ చర్చ జరిగిందని, ఆర్థికమంత్రి సమాధానం కూడా ఇచ్చారని చైర్మెన్ తెలిపారు.

గ్రాట్యుటీ చెల్లింపుల(సవరణ) బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం..

ఈ నెల 15న లోక్‌సభలో ఆమోదం పొందిన గ్రాట్యుటీ చెల్లింపుల(సవరణ) బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఎలాంటి చర్చ చేపట్టకుండా మూజువాణి ఓటుతో పెద్దల సభ ఈ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లును కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చాలా ముఖ్యమైనదని, కాబట్టి ఎలాంటి చర్చ చేపట్టకుండా బిల్లు ఆమోదించేందుకు సహకరించాలని కోరారు. వెంకయ్యనాయుడు సైతం బిల్లు ఆమోదానికి సహకరించాలని విపక్షాలను కోరారు. దీంతో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలి

మంత్రి గెహ్లాట్‌కు డీఎస్ఎంఎం వినతి పత్రం



న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్‌కు దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) ప్రతినిధి బృందం గురువారం వినతిపత్రం సమర్పించింది. సుప్రీం కోర్టు తీర్పుపై ప్రభుత్వం తక్షణమే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డీఎస్ఎంఎం డిమాండ్ చేసింది. ముఖ్యంగా దుర్వినియోగం చేస్తారనే పేరుతో చట్టంలోని సెక్షన్ 18ను తొలగించడం చాలా దురదృష్టమైన నిర్ణయంగా డీఎస్ఎంఎం పేర్కొంది. నిజానికి ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలపై జరిగిన నేరాలకు సంబంధించి పడిన శిక్షల శాతం చాలా తక్కువగా ఉందని, చార్జ్‌షీటు దాఖలు నుంచి కోర్టులో విచారణ వరకూ ప్రతీ దశలోనూ తీవ్ర జాప్యం జరుగుతుందని డీఎస్ఎంఎం ఆందోళన వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రమైన సామాజిక న్యాయంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. దళితులకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 21న న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్‌లో భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రచారం, నిరసనలు నిర్వహిస్తామని డీఎస్ఎంఎం ప్రకటించింది.

పీఎఫ్ఐ, ఆర్ఎస్ఎస్ అక్రమ ఆయుధ శిక్షణ

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



తిరువనంతపురం : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్), ఇస్లామిస్ట్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) గ్రూపులు.. అక్రమంగా ఆయుధాల వాడకంపై శిక్షణనిస్తున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. పలు దేవాలయాల్లోనూ యువకులకు ఆయుధాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చట్ట విరుద్ధంగా శిక్షణను నిర్వహిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయుధాల వాడకంపై అక్రమంగా ఇస్తున్న శిక్షణను నిషేధించేందుకు అవసరమైతే ఓ చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు.

ఆరు వేల కోట్ల అవినీతి కేసులో

ఇండియన్ టెక్నోమాక్ డైరెక్టర్ అరెస్టు

- మూడు రోజులు సీఐడీ కస్టడీకి..

సిమ్లా : దేశంలో బడా వ్యాపారవేత్తల అక్రమాలు ఒకొక్కక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. రూ.6 వేల కోట్ల అవినీతి కేసులో ఇండియన్ టెక్నోమాక్ డైరెక్టర్ వినయ్‌కుమార్ శర్మను క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్(సీఐడీ) గురువారం అరెస్టు చేసింది. ఆయనను హిమాచల్‌ప్రదేశ్‌లోని ఓ స్థానిక కోర్టులో హాజరుపర్చగా మూడు రోజులు సీఐడీ కస్టడీకి అప్పగిస్తూ బెంచ్ తీర్పు వెలువరించింది. వినయ్‌కుమార్ శర్మ మాజీ ఐఏఎస్ అధికారి ఎంఎల్ శర్మ కొడుకు. కాగా.. హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్మూర్ జిల్లా పోంటా సాహిబ్ ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్వహిస్తున్న టెక్నోమాక్ కంపెనీ కార్యకలాపాలను 2014 మార్చిలో చెప్పా పెట్టకుండా నిలిపివేశారు. కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు సైతం చెల్లించలేదు. దాంతో పాటు ఈపీఎఫ్, ఆదాయపు పన్ను, సేల్స్ ట్యాక్స్, విద్యుత్ బిల్లు అన్నీ కలుపుకొని వేల కోట్ల రూపాయలను యాజమాన్యం ఎగవేసింది. ఈ వ్యవహారంపై సీఐడీ రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. కంపెనీ ఎండీ రాకేశ్ శర్మ కోసం సీఐడీ బృందం గాలిస్తున్నది. అతడు దేశంలోనే ఉన్నాడా? విదేశాలకు పారిపోయాడా? అన్నదానిపై అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు.

ప్రయివేటీకరణ చర్యల్లో భాగమే 'స్వయం ప్రతిపత్తి'

ఎస్ఎఫ్ఐ ఆందోళన

న్యూఢిల్లీ : 60 విద్యా సంస్థలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ యూజీసీ తీసుకున్న నిర్ణయాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకించింది. విద్యను ప్రయివేటీకరించే దిశగా నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాల్లో ఇది ఒకటి అని ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్ణయాలు ఉన్నత విద్యా, పరిశోధనా కేంద్రాలు కేవలం ధనవంతులకే పరిమితం అనే ప్రమాదకార సంకేతాలు ఇస్తాయని పేర్కొంది. 5 సెంట్రల్ యూనివర్సిటీలు, 21 రాష్ట్ర యూనివర్సిటీలు, 24 డీమ్డ్ యూనివర్సిటీలు, 2 ప్రయివేటు యూనివర్శిటీలు, 8 స్వతంత్ర కళాశాలలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నట్టు యూజీసీ ప్రకటించింది. స్వయం ప్రతిపత్తి నిర్ణయం ఈ సంస్థలకు ఆర్థికంగా మరింత భారంగా మారుతుందని, దీంతో డిగ్రీ, డిప్లొమా ఫీజులు మరింతగా పెరుగుతాయని ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. యూజీసీ నివేదిక ప్రకారం ఈ స్వయం ప్రతిపత్తి సంస్థలన్నీ నూతన కేంద్రాలు, విభాగాలు, ఆఫ్-క్యాంపస్ కేంద్రాలు ప్రారంభించాల్సి వుంటుందని, అయితే ఈ వ్యయాలకు కేంద్రం ఎలాంటి నిధులను సమకూర్చదని, దీనికి అర్థం భారీగా ఫీజులు పెంచాలన్నదేనని ఎస్ఎఫ్ఐ పేర్కొంది.

ఎన్‌డీఏ ప్రభుత్వ ఒత్తిడితో యూజీసీ తీసుకున్న ఈ నిర్ణయం దేశంలో ఉన్నత విద్యపై దీర్ఘకాలం పాటు తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎస్ఎఫ్ఐ తెలిపింది. మార్కెట్ శక్తులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్ని ప్రజాస్వామ్య శక్తులకు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది.

'అమ్మ' ఆస్పత్రిలో ఉండగా...

సీసీటీవీలు ఆఫ్ చేశాం

అపోలో చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి



చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణించి ఏడాదిన్నర కావస్తోన్నా.. ఆమె మరణం అంతులేని అనుమానాలకు తావిస్తోంది. జయ మరణంపై మీడియాలో వార్తలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తాజాగా అపోలో ఆస్పత్రి చైర్మన్ సి.ప్రతాప్ రెడ్డి 'అమ్మ' మరణంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జయలలిత ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు ఐసీయూలో సీసీటీవీలన్నీ ఆఫ్ చేశామన్నారు. చెన్నైలో బుధవారం జరిగిన ఇంటర్నేషనల్ కొలొరెక్టల్ సింపోసియమ్-2018 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... జయలలిత ఆస్పత్రిలో చేరాక ఐసీయూలో ఆమె ఉంటున్న గదిని తప్ప అందరినీ ఖాళీ చేయించామన్నారు. దాదాపు 75 రోజులు చికిత్స పొందిన ఆమె కోరిక మేరకే సీసీటీవీలు ఆఫ్ చేశామని చెప్పారు. ఆమె చెప్పిన సన్నిహితుల్ని మాత్రమే ఐసీయూలోకి అనుమతించామని తెలిపారు. జయను బతికించడానికి తమ వంతు బాధ్యతగా చేయవలసిందంతా చేశామన్నారు. దురదృష్టవశాత్తూ గతేడాది డిసెంబర్ 4న గుండెపోటుకు గురై ఆమె మరణించడం బాధాకరమన్నారు. జయ మరణంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ అరుముగస్వామి నాయకత్వంలో ఏకసభ్య కమిషన్ విచారణలో హాజరైనప్పుడు దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సమర్పించామన్నారు.

నేడు 'రాజ్యసభ' ఎన్నికలు

ఆరు రాష్ట్రాల్లో జరుగనున్న పోలింగ్

న్యూఢిల్లీ : రాజ్యసభలో ఖాళీ అవుతున్న స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనున్నది. వచ్చేనెల నాటికి పెద్దల సభలో 58 సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ స్థానాల్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి 10, బీహార్, మహారాష్ట్రల నుంచి ఆరేసి స్థానాల చొప్పున ఉన్నాయి. 16 రాష్ట్రాల నుంచి 58 రాజ్యసభ స్థానాలకు ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. అయితే.. 10 రాష్ట్రాల నుంచి 33 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో.. ఆరు రాష్ట్రాల్లోని(ఉత్తరప్రదేశ్ 10, బెంగాల్ 5, కర్నాటక 4, తెలంగాణ 3, జార్ఖండ్ 2, ఛత్తీస్‌గఢ్ 1) 25 స్థానాలకు మాత్రమే పోలింగ్ జరగనున్నది. శుక్రవారం సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేయడంతో పాటు ఫలితాలు కూడా వెల్లడించే అవకాశముంది. ఎమ్మెల్యే ఓట్ల ద్వారా పరోక్ష పద్ధతిలో రాజ్యసభ సభ్యులు ఎన్నికవుతారు. రాజ్యసభ సభ్యుడి పదవీ కాలం 6 సంవత్సరాలు. ప్రతీ రెండేండ్లకోసారి రాజ్యసభలో మూడింట ఒకవంతు ఎంపీలు పదవీ విరమణ పొందుతారు. ప్రస్తుతం రాజ్యసభలో అధికార బీజేపీ నుంచి 58, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి 54 మంది ఎంపీలున్నారు.

87 శాతం మంది కోటీశ్వరులే

రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 87 శాతం అభ్యర్థులు కోటీశ్వరులే అంటూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. ఏడీఆర్ తెలిపిన వివరాల ప్రకారం...

రాజ్యసభ ఎన్నికల్లో పోటీలో ఉన్నవారిలో 63 మంది ఆస్తి కోటి రూపాయల కంటే ఎక్కువగానే ఉన్నది. రూ. 4,078 కోట్లు ఆస్తితో మహేంద్రప్రసాద్ అత్యంత సంపన్నుడిగా నిలిచారు. తరువాతి స్థానంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న జయాబచ్చన్ ఉన్నారు. ఆమె ఆస్తి రూ. 1,001 కోట్లుగా ఉన్నదని నివేదిక పేర్కొంది.

పార్టీల పరంగా చూస్తే బీజేపీ అభ్యర్థుల్లో 29 మందికి గానూ 26 మంది కోటీశ్వరులే (సగటున ఒక్కొక్కరి ఆస్తి రూ. 16 కోట్లు) ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 10 మంది (సగటున రూ.66 కోట్లు), తృణముల్ కాంగ్రెస్, టీఆర్ఎస్ నుంచి ముగ్గురు అభ్యర్థులు, జనతాదళ్(యు) నుంచి ఇద్దరు, సమాజ్‌వాది పార్టీ నుంచి ఒక్కరు కోటీశ్వరులని ఏడీఆర్ తెలిపింది.

పెద్దల సభకు పోటీ చేస్తున్న 63 అభ్యర్థుల్లో 16 మంది(25శాతం) పై క్రిమినల్ కేసులున్నట్టు ఏడీఆర్ పేర్కొంది. ఇందులో 8 మంది అభ్యర్థులపై కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం వంటి తీవ్ర అభియోగాలున్నాయి.

బహుజనుల రాజ్యస్థాపనే లక్ష్యం

119 స్థానాలకు బీఎల్ఎఫ్ పోటీ: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ముదిగొండలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి

తెలంగాణలో బహుజనులంతా ఒక్కటైతే 2019 ఎన్నికల్లోనే బహుజనుల రాజ్యస్థాపన ఖాయమని, రాబోవు ఎన్నికల్లో 119స్థానాలకు బీఎల్ఎఫ్ పోటీ చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి వరప్రసాద్ అధ్యక్షతన గురువారం 'సామాజిక న్యాయం-బీఎల్ఎఫ్ ఆవిర్భావం' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం బీఎల్ఎఫ్ మాత్రమేనని చెప్పారు. రాష్ట్రంలో పాలక పార్టీలన్నీ ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయని అన్నారు. ఓట్లు, సీట్లు లక్ష్యంగా రాజకీయాలు నడిపారే తప్ప పేదల సంక్షేమం కోరి పాలించిన వారులేరన్నారు. అందుకే రాష్ట్రంలో, దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో 93శాతం మంది పేదలుగానే బతుకీడుస్తున్నారని గుర్తుచేశారు. వీరుకాక అగ్రకులంలోని మరో ఐదు శాతం మంది కూడా పేదరికంలోనే మగ్గుతున్నారని అన్నారు. వీరంతా ఏకతాటిపైకొచ్చి హక్కుల సాధన కోసం కలిసి పనిచేస్తే 2019ఎన్నికల్లోనే బహుజనుల రాజ్యం ఏర్పాటవుతుందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు బదలాయించాల్సిన 26రకాల అధికారాలను బదలాయించని సీఎం కేసీఆర్, థర్డ్ ఫ్రంట్ పేరుతో దేశంలో అధికారాలు బద లాయింపు జర గడం లేదని చెప్పడం విడ్డూ రమన్నారు. ఏప్రిల్ లో జరుగ నున్న సీపీఐ (ఎం) జాతీ య మహా సభకు జిల్లా నుంచి కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల లెనిన్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో టెన్త్ లెక్కల పేపర్-2

మాల్ ప్రాక్టీస్ నిర్వహిస్తుండగా పట్టుకున్న ఎస్ఐ

- ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్
- అదుపులో ఇద్దరు, పరారీలో నలుగురు



ఎస్ఐ, ప్రిన్సిపాల్ మధ్య తోపులాట

నవతెలంగాణ-కొడిమ్యాల

ప్రభుత్వ ఉపాధ్యాయులే పదోతరగతి మ్యాథ్స్ పేపర్-2ను వాట్సప్ ద్వారా లీక్ చేసి సమాధాన పత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేశారు. ఈ ఘటనలో ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నలుగురు పరారీలో ఉన్నారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో జరిగింది. కొడిమ్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం మ్యాథ్స్ పేపర్-2 పరీక్షను ప్రారంభించడానికి ముందే వాట్సప్ ద్వారా పరీక్షా పత్రం లీకైంది. వాట్సప్ ద్వారా పశ్నపత్రం పంపించిన ఉపాధ్యాయులు, మండల విద్యాధికారి కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లోనే సమాధానాలు రాసి ఫొటోలు తీసి పరీక్షా కేంద్రాన్ని పంపించడానికి ఏర్పాటు చేసుకున్నారు. పేపర్‌లీక్ విషయంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్ఐ సోమసతీష్ మఫ్టీలో వెళ్లి గమనించారు. కాపీయింగ్ జరుగుతున్నట్టు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఎస్ఐకి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణగౌడ్ మధ్య తోపులాట జరిగింది. ప్రిన్సిపాల్‌తోపాటు రమేశ్ అనే ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలినవారు పరారయ్యారు. విషయం తెలుసుకున్న జగిత్యాల డీఎస్పీ భద్రయ్య, సీఐ నాగేందర్, డీఈవో వెంకటేశ్వర్లు, కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పరారైన మిగతా నలుగురిపై కేసు నమోదు చేశామని, విచారణ చేసి రిమాండ్ చేస్తామని సీఐ తెలిపారు.

మాల్ ప్రాక్టీసులో మరో ఇద్దరు ఉపాధ్యాయులు ..!!

పేపర్ లీకేజీ బృందంలో మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారని, వారి పేర్లు ప్రకటించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ తతంగమంతా మండల విద్యాధికారి కార్యాలయానికి సమీపంలోనే జరగ్గా విషయం ఎంఈవోకు తెలియదా? అని విలేకరులు డీఈవోను ప్రశ్నించగా సమాధానం దాటవేశారు.

ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెండ్ : వెంకటేశ్వర్లు, డీఈవో

పదో తరగతి మ్యాథ్స్ పేపర్‌ను లీక్‌చేసి మాల్ ప్రాక్టీస్‌కు ప్రోత్సహించిన ముగ్గురు కాంట్రాక్టు ఉపాధ్యాయులను, ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యా యులను సస్పెండ్ చేశాం. వీరిలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బత్తిని సత్యనారాయణగౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు వడ్లకొండ రమేష్(కోనాపూర్) శ్రీనివాస్(రాంసాగర్), కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి మంద లింగవ్వ, మోడల్ స్కూల్ కాంట్రాక్టు టీచర్లు పద్మ, రాధ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాల్సిందిగా పోలీసులను కోరాం. పరీక్షా కేంద్రాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేసి మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

పెట్టుబడి పథకానికి పేరు మార్పు

- 'రైతుబంధు' పేరు ఖరారు: వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడి పథకానికి పెట్టిన రైతులక్ష్మి పేరు మార్చారు. ఈ పథకానికి 'రైతుబంధు' పేరు సీఎం ఖరారు చేసినట్టు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి వెల్లడించారు.. పెట్టుపబడి పథకం చెక్కుల పంపిణీపై బ్యాంకు అధికారులతో గురువారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. గతంలో అనుకున్న విధంగా పెట్టుబడి పథకానికి రైతులక్ష్మి కాదని 'రైతుబంధు' గానే సీఎం నామకరణం చేశారని చెప్పారు. చెక్కుల పంపిణీలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై బ్యాంకు అధికారులతో వివరంగా చర్చించారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. గతంలో పహాణిలో ఉన్న అన్ని అంశాలు ఇప్పుడు భూ రికార్డులలో సమగ్రంగా పొందుపరచినట్లు వివరించారు. భూ సమగ్ర సర్వే ద్వారా రూపొందిన భూముల మొత్తం డాటా రెవెన్యూ శాఖ వద్ద అందుబాటులో ఉందని వారి సహకారంతో ప్రతి రైతుకు రైతుబంధు పథకం ద్వారా సహకారం అందాలని అన్నారు. రైతుబంధు పథకానికి సంబంధించిన పోర్టల్‌లో రైతుకు సంబంధించిన సమాచారమంతా అందుబాటులో పెడుతున్నామని అన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ గుర్తించిన మండల స్థాయి నోడల్ బ్యాంకు ద్వారా చెక్కుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ డా. ఎం. జగన్ మోహన్, ఆర్థిక సంయుక్త కార్యదర్శి సిహెచ్. వి.సాయి ప్రసాద్, తో పాటు వ్యవసాయ అధికారులు, ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, కార్పోరేషన్ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, కెనెరా బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్ర బ్యాంకు ప్రతినిధులు, ఎన్.ఐ.సి. కి చెందిన అధికారులు పాల్గొన్నారు.


ఇరాక్‌పై యుద్ధానికి 15ఏండ్లు

ఇరాక్ యుద్ధ 15వ వార్షికాన్ని అమెరికా మీడియా అంతగా పట్టించుకోలేదు. అమెరికా సామ్రాజ్యవాదం పాల్పడుతున్న నేరాలపట్ల మౌనం వహించి ఆ నేరాలలో తానూ భాగస్వామినని అమెరికా మీడియా చెప్పకనే చెబుతున్నది. ఇరాక్‌లో అవలంబించిన బూటకపు సాకులతో రష్యాలాంటి అణ్వస్త్ర దేశాలను కూడా అమెరికా రెచ్చగొడుతున్నది.

పదిహేనేండ్ల క్రితం 2003, మార్చి20 తేదీ అర్థ రాత్రి అమెరికా, బ్రిటన్ సైనిక దళాలు ఎటువంటి హెచ్చరికా లేకుండా చట్టవిరుద్ధంగా ఇరాక్‌పై దాడిచేశాయి. ఇరాక్ నగరాలపై బాంబుల, క్షిపణుల వర్షం కురుస్తుంటే సాయుధ బలగాలు ట్యాంకులు, ఇతర ఆయుధాలతో కువైట్ వైపున్న సరిహద్దు దాటాయి. ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ప్రకటించిన ఆ కిరాతక యుద్ధ పర్యవసానాలు నేటి ప్రపంచ రాజకీయాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి.

ఇరాక్‌లోని ఆధునిక నాగరికతకు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సామ్రాజ్యవాద సైన్యాలు ఉద్దేశపూర్వకంగా సర్వనాశనం చేశాయి. అలాగే బుష్ తరువాత అమెరికా అధ్యక్షుడైన ఒబామా సిరియా, లిబియా, యెమెన్‌లపై ఇటువంటి దురాక్రమణే కొనసాగించాడు. ప్రస్తుతం ట్రంప్ ఈ పట్టికకు ఇరాన్, ఉత్తర కొరియాలను జోడిస్తానని బెదిరిస్తున్నాడు. బ్రౌన్ విశ్వవిద్యాలయానికి చెందిన వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ ఎఫైర్స్ అనే సంస్థ అమెరికా యుద్ధాల ప్రభావాన్ని అధ్యయనం చేసింది. ఈ అధ్యయనం ప్రకారం ఇరాక్, అఫ్ఘనిస్థాన్‌లలో అమెరికా చేసిన యుద్ధాలలో 3,70,000మంది ప్రత్యక్షంగాను, 8లక్షలమంది పరోక్షంగాను హతులయ్యారు. చనిపోయినవారిలో ఎక్కువమంది ఇరాక్‌కు చెందినవారే ఉన్నారు. 4,800మంది అమెరికా సైనికులు ఇరాక్ యుద్ధంలో మరణించారు. ఆ యుద్ధంలో పాల్గొన్న 20లక్షలమంది అమెరికా సైనికులలో 10లక్షలమంది వికలాంగులయ్యారు. ఈ యుద్ధాల్లో చనిపోయిన వారి సంఖ్య 24లక్షల మంది ఉండొచ్చని ఓ అంచనా.

ఘోరమైన అబద్దాల ఆధారంగా బుష్, బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ ఇరాక్‌పై ఉద్దేశపూర్వకంగా యుద్ధాన్ని ప్రకటించారు. ఇరాక్ అధ్యక్షుడైన సద్దాం హుస్సేన్ నిల్వచేసిన 'మానవ హనన ఆయుధాల'తో ప్రపంచ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందనీ, అమెరికాపై టెర్రరిస్టు దాడి చేసిన అల్ ఖైదా ఉద్యమ నాయకుడైన బిన్ లాడెన్‌తో సద్దాం కుమ్మక్కయ్యాడనేది ఆరోపణ. సద్దాం హుస్సేన్ దగ్గర అటువంటి ఆయుధాలు లేవని సామ్రాజ్యవాదులకు తెలుసు. అంతేకాకుండా నిజానికి ఆయన ప్రభుత్వాన్ని కూలదోయ ప్రయత్నించిన అల్ ఖైదాతో ఆయనకు శత్రుత్వం ఉన్నది.



ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పరిమాణం గల చమురు నిల్వలు ఉన్న దేశాలలో ఇరాక్ ఒకటి. అటువంటి చమురు వనరులపై నియంత్రణ సాధించటమే ధ్యేయంగా ఈ యుద్ధం సాగింది. దానితోపాటు చమురు వనరులకు ఆలవాలమైన మధ్య ప్రాచ్యంలో ఒక వ్యూహాత్మక స్థానాన్ని సంపాదించి చమురు సరఫరాపై అమెరికా భల్లూకపు పట్టు సాధించటం కూడా ఇరాక్‌పై యుద్ధ లక్ష్యాలలో భాగమే.

అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం ఇరాక్ సార్వభౌమత్వంపై అమెరికా, బ్రిటన్ చేసిన దాడి ఒక యుద్ధ నేరం. న్యూరెంబర్గ్ ట్రిబ్యునల్ ప్రతిపాదించిన నియమాలనుబట్టి చూసినప్పుడు బుష్, బ్లెయిర్, అమెరికా ఉపాధ్యక్షుడు డిక్ చెనే, సలహాదారులు కోలిన్ పోవెల్, డోనాల్డ్ రమ్స్‌ఫెల్డ్, కొండోలిజా రైస్‌లు యుద్ధ నేరాలకు పాల్పడ్డారని చెప్పవచ్చు. వీరితోపాటు బుష్ ప్రభుత్వ బూటకపు వాదనలతో అమెరికా ప్రజాభిప్రాయాన్ని యుద్ధానికి అనుకూలంగా మలచిన మీడియా కూడా ఈ యుద్ధ నేరంలో పాలుపంచుకున్నది. అలా అమెరికా ప్రజలను యుద్ధానికి అనుకూలంగా మలచిన సమాచార మాధ్యమాలలో న్యూయార్క్ టైమ్స్ ప్రధాన పాత్రను పోషించింది. ఇరాక్‌లో 'మానవ హనన ఆయుధాలు' ఉన్నాయని టైమ్స్ ప్రతినిధి జుడిత్ మిల్లర్, కాలమిస్టు థామస్ ఫ్రీడ్‌మన్ బలంగా వాదించారు. వీరికి వాషింగ్టన్ పోస్ట్ కాలమిస్టు రిచర్డ్ కోహెన్ వంతపాడాడు. ఇరాక్‌పై యుద్ధానికి దిగటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని వీరంతా పుంఖానుపుంఖాలుగా రాశారు.

అమెరికా సమాజంపై ఇరాక్ యుద్ధ ప్రభావం చాలా తీవ్రంగా ఉన్నది. వాట్సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ ఎఫైర్స్ అంచనా ప్రకారం 2018 సెప్టెంబరుకల్లా ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో అమెరికా ఫెడరల్ ప్రభుత్వం 2011 సెప్టెంబరు 9 తేదీన అమెరికాపై జరిగిన టెర్రరిస్టు దాడి తరువాత ప్రకటించిన యుద్ధాలపై చేస్తున్న వ్యయం 5.6ట్రిల్లియన్ డాలర్లు (1ట్రిల్లియన్ డాలర్లు రూ.66లక్షల కోట్లకు సమానం) అవుతుంది. ఈ వ్యయంలో సింహభాగం ఇరాక్ యుద్ధంపై చేసిందే. ఈ యుద్ధ వ్యయం కోసం అవసరమైన మొత్తాన్ని ధనికులపై పన్నులు వేయకుండా బుష్, ఒబామా అప్పు చేసి సేకరించారు. ఈ అప్పుపై కట్టవలసిన వడ్డీ 8ట్రిల్లియన్ డాలర్లు అవుతుంది. ఇది యుద్ధ వ్యయం కంటే ఎక్కువ. అంటే అమెరికా ప్రజలపై రుద్దిన యుద్ధాలతో ఆ దేశంలోని పెట్టుబడిదారులకు లాభాల పంటలు పండుతాయన్నమాట! ఇరాక్ యుద్ధ 15వ వార్షికాన్ని అమెరికా మీడియా అంతగా పట్టించుకోలేదు. అమెరికా సామ్రాజ్యవాదం పాల్పడుతున్న నేరాలపట్ల మౌనం వహించి ఆ నేరాలలో తానూ భాగస్వామినని అమెరికా మీడియా చెప్పకనే చెబుతున్నది. ఇరాక్‌లో అవలంబించిన బూటకపు సాకులతో రష్యాలాంటి అణ్వస్త్ర దేశాలను కూడా అమెరికా రెచ్చగొడుతున్నది. మానవాళి మనుగడకే సవాలుగా మారే ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకోవటానికి ప్రపంచ ప్రజలు సర్వశక్తులనూ సమీకరించగలగాలి.

సంపాదకీయం

భగత్‌సింగ్‌కు లెనిన్‌కు సంబంధమేమిటి?




డాక్టర్ దేవరాజు మహారాజు

భగత్‌సింగ్ వర్ధంతి నాడు ఆయన విగ్రహానికో, పటానికో ఓ పూలదండ వేసి దండం పెట్టడం తప్ప, జనం ఆయన గురించి తెలుసుకునే ప్రయత్నం చేయరు. నాయకులు అసలే చేయరు. భగత్‌సింగ్ చేసిన త్యాగం గురించి, ఆయన ఆలోచనల గురించి, అభిప్రాయాల గురించి ఏ మాత్రం తెలుసుకోరు. ఆయన మనకెందుకు ఆదర్శప్రాయుడో ఆలోచించరు. ఆయనకు లెనిన్ మహాశయుడు ఎలా స్ఫూర్తినిచ్చాడో తెలుసుకోరు. లెనిన్ విగ్రహాలు పడగొట్టడం, విదేశీయుల విగ్రహాలు మనకెందుకనడం, వాళ్లేదో పెద్ద దేశభక్తులైనట్టు మిగతా వారంతా దేశ ద్రోహులన్నట్టు చిత్రమైన భాషణలు నడుస్తున్నాయి. మరి ఈ దేశభక్తులు దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పరు. దేశభక్తి గురించి తమకే పేటెంట్ హక్కున్నట్టు అందరికీ స్పెషల్ క్లాసులు పెడతారు. ఉరికంబమెక్కడానికి ఐదు నిమిషాల ముందు దాకా భగత్‌సింగ్ చేతిలో లెనిన్ రాసిన పుస్తకముంది. దాన్నే ఆయన చదువుతూ ఉన్నాడు. పాపపుణ్యాల గూర్చి, పునర్జన్మల గూర్చి ఆలోచిస్తూ సమయం వృధా చేసుకోలేదు. ఎంతో ఆత్మవిశ్వాసంతో మృత్యువును ఎదుర్కోబోతూ కూడా సోషలిస్ట్ భావాలలో మునిగితేలాడు. దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికంబమెక్కిన షహీద్ భగత్‌సింగ్ ఆలోచనలు ఎలా ఉండేవో చూద్దాం.

> **ఆనాడు లెనిన్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికి ఇచ్చిన స్ఫూర్తి, శాస్త్ర సాంకేతిక సహకారం చాలా గొప్పది. ఆయా రంగాల్లో మనదేశం ఈనాడు ప్రపంచంలో తలెత్తుకు నిలబడగలుగుతున్నదంటే.. అప్పటి స్ఫూర్తి, కూడా ఒక కారణం.**

సర్వశక్తిమంతుడని చెప్పబడుతున్న పరమాత్మ అస్థిత్వాన్ని నేను తృణీకరిస్తున్నాను. నేను అహంకారిని, నిరర్థకుణ్ణి, పాపాత్ముణ్ణి కాదు కాబట్టే నాస్తికుడనయ్యాను. నేను దేవుడిని కాదు, దేవ దూతను కాదు. అలాగని అవతారాన్నీ కాదు. నా జీవితాన్ని ఒక ధ్యేయం కోసం, దేశం కోసం సమర్పించబోతున్న ఒక సామాన్య పౌరుణ్ణి. ఇంత కన్నా గొప్ప ఆశయం ఇక వేరే ఏముంటుందీ? దేవుణ్ణి నమ్మే హిందువుకు పునర్జన్మ మీద నమ్మకముంటుంది. తాను మళ్ళీ ఒక దేశాధినేతగానో, అత్యధిక ధనవంతుడిగానో జన్మించగలనని ఆశపడుతుంటాడు. సంప్రదాయాన్ని ఆచరించే ముస్లిం అయినా, క్రైస్తవుడైనా మరణించిన తర్వాత స్వర్గసౌఖ్యాలు అనుభవించాలన్న కోరిక ఉంటుంది. కోరికల్ని జయించండి అనే నీతి వాక్యం నిత్యం వింటూ బతికే వీరు ఇతరులకు అదే పనిగా బోధించే వీరు తాము మాత్రం స్వర్గ సౌఖ్యాల కోసం, పుణ్యం కోసం తాపత్రయపడుతుంటారు. ఎంత హాస్యాస్పదం? తామేదో ఇక్కడ గొప్ప త్యాగాలు చేసినట్టు వాటికి ఫలితం తమకు పుణ్యలోకాలలో లభించాలన్నట్టూ అంగలారుస్తుంటారు. వీటి మీద నమ్మకం లేని నేను ఏమాశించాలీ? ఉరితాడు నా మెడకు బిగుసుకుంటుండగానే, నా కాళ్ల కింద నుండి పీట పక్కకు తొలగిపోతుంది. అదే నాకు అంతిమ క్షణమని తెలుసు. ఏ స్వార్థభావనా లేకుండా, నా జీవితాన్ని స్వేచ్ఛగా దేశ స్వాతంత్ర్యానికి అర్పిస్తున్నాను. ఇది పాప పుణ్యాలకు, గత జన్మ కర్మలకు, దైవ భక్తికి, భయానికీ అతీతమైంది. ఒక దేశభక్తుడిగా నా స్వభావ సిద్ధమైన ధ్యేయం.



మన పూర్వీకులకు దేవుడి మీద అచంచల విశ్వాసం ఉండేది. దాన్ని వ్యతిరేకిస్తూ ఎవరు ఏం మాట్లాడినా వాణ్ణి పాపాత్ముడు, దుర్మార్గుడు, నీచుడిగా ముద్రవేసేవారు. సమాజమంతా వారిని ఆ విధంగానే పరిగణించేది. అతని వాదనలో ఎంత బలమున్నా, అతని ఆత్మ విశ్వాసమెంత దృఢమైనదైనా, దాన్ని ఎదుర్కోలేక, భగవంతుడికి కోపం వస్తుందని, అతనికి మహిమలుంటాయని, దేవుని పేరుతో దాడులు చేసేవారు. శిక్షలు వేసేవారు. సమాజమంతా అతన్ని హీనుడిగా జమకట్టేది. లేదా అహంకారి అని ముద్రవేసేది. వెలివేసేది. వేలవేల సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతూనే ఉంది. నేను హేతుబద్ధంగా ఆలోచించే మంచి మనిషినని తెలిసినా, హృదయం ఉన్నవాడినని తెలిసినా కేవలం దేవుడిని కాదన్నందుకే సమాజమంతా నాకు వ్యతిరేకంగా మారిపోయింది. కొంచెం ఆధ్యాత్మిక ఆలోచనల్ని, కొంచెం మానవ సెంటిమెంటునూ కలిపి, గొప్ప సాహిత్యాత్మక భావనల్ని ప్రకటించొచ్చు. కానీ నేనాపని చేయను. మానవవాదిగా, యధార్థవాదిగా, వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించగల మనోధైర్యం ఉన్నవాణ్ణి. ఆ ధైర్యంతోనే ఇంతదాకా వచ్చాను. ఆ ధైర్యాన్నే నా ముందు తరాలకు అందించదలిచాను. నిరంతరం ప్రయత్నించడమే గొప్ప విజయం. ముందుకు పోదలిచిన వాడెవడైనా సరే, పనికిరాని పాత విలువల్ని, నమ్మకాల్ని, సంప్రదాయాల్ని, సంస్కృతుల్ని ప్రశ్నిస్తూ రావాలి. అందులోని అతి సూక్ష్మమైన, సున్నితమైన అంశాలన్నింటినీ విశ్లేషించుకుంటూ రావాలి. ఆ పని చేయకుండా కండ్లు మూసుకుని నమ్ముతూ రావడం మూర్ఖుల లక్షణం. తెలివైన ఆధునిక మానవుడి విధానం అలా ఉండకూడదు.

గతంలోని అంశాలకైనా, సమకాలీన అంశాలకైనా, రాబోయే భవిష్యత్తులోని అంశాలకైనా మూలాధారం తర్కమే. తర్కానికి ఎదురు నిలిచి నిలబడిన అంశాల్ని విశ్వసించొచ్చు. ఎందుకంటే తర్కమే జీవనాధారం గనుక. ఒక హేతువాది తర్కాన్ని ఆమోదించలేని సమాజం అతన్ని తాత్కాలికంగా దోషిగా నిలబెట్టొచ్చు. శిక్షించొచ్చు. కానీ, వాస్తవమేమంటే అతను ఎన్నటికీ దోషి కాదు. అతన్ని ఆ తర్కమే జ్ఞానిగా నిలబెడుతుంది. కాలం గుర్తిస్తుంది. ఇలాంటి ఉదాహరణలు మనకు ఎన్నో ఉన్నాయి. తర్కాన్ని ఎదుర్కోలేని విశ్వాసాలు ఎప్పటికైనా మూఢ విశ్వాసాలే. అంధవిశ్వాసాలే. గుడ్డి నమ్మకాలే. తనను యధార్థవాదిగా ప్రకటించుకునేవాడు ఎవడైనా సరే, మూఢనమ్మకాలను వదిలించుకుని బయటికి రావాలి. తర్కానికున్న విలువను వెలుగును గుర్తించని వాడు గుడ్డివాడే కదా?

ఇంగ్లీషువాడు భారతదేశాన్ని ఎందుకు పరిపాలించాడు? దేవుడు కోరుకున్నందువల్లనో, దైవాజ్ఞవల్లనో కాదు. దేవుడి కృపాకటాక్షాలు ఇంగీషు వాడికి ఉన్నందువల్లనో, భారతీయులకు లేనందువల్లనో కాదు. ఇంగ్లీషువాడు శక్తివంతుడు, యుక్తివంతుడు కనుక. పరిపాలనానుభవం ఉన్నవాడు గనుక. మిలటరీ బలగాలు, ఆయుధాలు సమృద్ధిగా ఉన్నాయి గనుక. భారతీయుల్ని లాఠీలతో కొట్టి, తుపాకుల్తో కాల్చి వారిపై పెత్తనం చలాయించాడు తప్పితే ఇందులో ఏ దేవుడి ప్రమేయము లేదు. భారతదేశంలో చిన్నచిన్న రాజ్యాలుండటం ఆయా రాజుల మధ్య సఖ్యత లేకపోవడం కారణం. భారతీయుల బద్ధకం, అలసత్వం కూడా ఇంగ్లీషు వాడికి ఉపయోగపడ్డాయి. తప్పితే ఇందులో ఏ దేవుడి ప్రమేయం లేదు. అది ఈశ్వరాజ్ఞ కానేకాదు. నా మిత్రుడొకడు నన్ను ప్రార్థన చేసుకొమ్మని సలహా ఇచ్చాడు. నేను నాస్తికుడిని, మానవవాదినని నిర్భయంగా చెప్పినప్పుడు అతడన్నాడు "నీ చివరి రోజులు దగ్గర పడ్డప్పుడు నీకు తెలిసొస్తుందిలే" అన్నాడు. "ప్రియ మిత్రమా! ఒకటి గుర్తు పెట్టుకో! అలాంటి పని నేనెప్పుడూ చేయను. అలా చేయడం నా దృష్టిలో నైతికంగా దిగజారడం వంటిది. నాలో ఏవేవో కోరికలు పెట్టుకొని, అవి తీర్చమని లేని దేవుడితో నేను లాలూచీ పడను గాక పడను" అని చెప్పాను – ఇదీ భగత్‌సింగ్ ఆలోచనా ధోరణి.

భగత్‌సింగ్ ఆయన అనుచరులు 1930 జనవరి 21న కోర్టులో విచారణ ఎదుర్కొంటూ కూడా లెనిన్ జన్మదినోత్సవం నాడు మాస్కోకు టెలిగ్రాం పంపారు. లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకుపోతున్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. రష్యాలో జరుగుతున్న సోషలిస్టు ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ కార్మికోద్యమంలో తామూ గళం కలుపుతామని తెలిపారు. అదీ ఆ టెలిగ్రాంలోని సారాంశం. ఈ విషయాలేవీ నేటి కుహనా దేశభక్తులకు తెలియవు. తెలుసుకోరు కూడా. పాతికేండ్లకు కొంచెం ఇటూ అటుగా ఉన్న నాటి యువకులంతా ఆ రోజుల్లో లెనిన్ ప్రభావంలో ఎంతగా పడిపోయారంటే తమ హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్‌కు సోషలిస్టు పదం కూడా చేర్చి, హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ అసోసియేషన్‌గా మార్చుకున్నారు. 1917లో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవ ప్రభావంతో ఒక నిబంధనావళి రూపొందించి దాన్ని దేశమంతంటా పంచిపెట్టే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా ఇది ఉత్తరప్రదేశ్‌లో ఉధృతంగా జరిగింది. భారతీయ యువ రక్తానికి ఆనాడు లెనిన్ స్ఫూర్తిదాత కాకపోతే అలాంటి కార్యక్రమాలు జరిగి ఉండేవి కావు.

నాటి యువకులే కాదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వాన్ని నడిపిన తొలితరం నాయకులు లెనిన్ శతజయంతి సందర్భంగా 35లక్షల తపాలా బిళ్లల్ని విడుదల చేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన మీద ఎంత గౌరవభావముంటే ఆనాటి ప్రభుత్వం ఆ పని చేసిందీ? అంతేకాదు, సోవియట్ యూనియన్ 50 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో కూడా భారత ప్రభుత్వం 30వేల తపాలా బిళ్లల్ని విడుదల చేసింది. రెండు దేశాల మధ్య మైత్రి సంబంధాలు ఎంత గాఢంగా ఉంటే అట్లా చేస్తారూ? తెలియని వాళ్లు కొంచెం వెనక్కి వెళ్లి చరిత్ర తెలుసుకోవాలి. సరే తర్వాత కాలంలో ఈ ఇరుదేశాల్లోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అది మళ్లీ వేరే చర్చ. లెనిన్ సారథ్యంలోని సోషలిస్టు రష్యాను మన విశ్వకవి రవీంద్రుడు ఒకసారి సందర్శించి ఉబ్బితబ్బిబ్బయ్యారు. "అక్కడి విద్యా విధానాన్ని తప్పక అధ్యయనం చేయాల్సి ఉందని" రాసుకున్నారంటే మామూలు మాటలు కాదు గదా? లెనిన్ స్ఫూర్తి తక్కువది కాదు గదా? మందబుద్ధులకు ఇవన్నీ ఎలా అర్థమవుతాయి? అంతేకాదు, భారతదేశాన్ని వైజ్ఞానిక భారతంగా తీర్చిదిద్దాలని దాదాపు అన్ని జాతీయ పరిశోధనా సంస్థలు ప్రారంభించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కృషి తక్కువదిగా చూపాలని, ఆయన స్థాయిని తగ్గించి చూపాలనీ చూస్తున్న ఈ మందబుద్ధుల స్థాయి ఏమిటో వివేచనగల సామాన్య జనానికి తెలుసు. ఆనాడు లెనిన్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికి ఇచ్చిన స్ఫూర్తి, శాస్త్ర సాంకేతిక సహకారం చాలా గొప్పది. ఆయా రంగాల్లో మనదేశం ఈనాడు ప్రపంచంలో తలెత్తుకు నిలబడగలుగుతున్నదంటే.. అప్పటి స్ఫూర్తి, కూడా ఒక కారణం. "ఖర్మకాలి" ఈ ఆవూ పేడ టీమ్ 70 ఏండ్ల క్రితమే అధికారంలోకి వచ్చి ఉంటే ఈ దేశవాసులంతా రాముడు, కృష్ణుడు అనే కల్పిత పాత్రల్ని వెతుక్కుంటూ అడవుల్లో ఇంకా అనాగరికంగానే బతుకుతూ ఉండేవారు. హమ్మయ్య పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పుడు జరిగిన జరుగుతున్న పొరపాట్లను చిత్తశుద్ధితో సవరించుకునే మనోధైర్యం, సాహసం ఈ దేశ ప్రజలకు ఉంది. తమకు తాము దేశభక్తులమని ప్రకటించుకునే ఈ సనాతన సంప్రదాయ వాదుల్లోంచి భగత్‌సింగ్ లాంటి త్యాగశీలి ఒక్కరైనా ఎందుకు ఉద్భవించలేదూ? అన్నది ప్రశ్న! కేవలం అది అడ్డుగోడలు ఎరగని నాస్తికుడితోనూ, మానవవాదితోనూ మాత్రమే సాధ్యమైందన్నది గుర్తెరగాలి.

బ్రిటిష్ ఇండియా, పంజాబ్, లాహోర్‌లో 23 మార్చి 1931న భగత్‌సింగ్, తన 23వ యేట ఉరికంబమెక్కారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్
సెల్ : 9573706806



జి. తిరుపతయ్య

జీవచ్ఛావాలుగా...


జీవచ్ఛవాలుగా ఇక బతకడం సాధ్యం కాదని వైద్యులు నిర్ధారించిన తరువాత చావుకు ఎదురు చూస్తున్నవారి అర్జీనే కారుణ్య మరణం (యూతనేషియా) అంటారు. ఇటువంటి అవకాశానికి మార్చి 9వ తేదీన సుప్రీంకోర్టు ఆమోదం తెలిపింది. ఇలాంటి మరణాల్లో పాసివ్ యూతనేషియా, ఆక్టీవ్ యూతనేషియా అని రెండుంటాయి. ఈ రెండింటిలో పాసివ్ యూతనేషియాకి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. పాసివ్ యూతనేషియా అంటే ఏదైనా వైద్య సదుపాయం వుంటేనే తప్ప శ్వాస కొనసాగలేని స్థితి. ఉదా: వెంటిలేటర్ సహాయంతో లేదా మరేదైనా సహకారంతో మాత్రమే ప్రాణం కొనసాగించడం. ఆక్టీవ్ యూతనేషియా అంటే నయం కాని రోగంతో భరించలేని బాధతో కాలం వెళ్లబుచ్చే వారు కోరుకునే మరణం. ఈ రెండింటిలో తేడా ఏమంటే, పాసివ్ యూతనేషియా కింద చనిపోయేందుకు సహకారమివ్వడం. ఆక్టీవ్ యూతనేషియా కింద చనిపోయేందుకు అవకాశమివ్వడం. ఈ తీర్పులో లివింగ్ విల్ (వీలునామా) ను కూడా అనుమతించాలని తీర్పునిచ్చింది. దీని అర్థమేమంటే మనిషి మంచిగా ఉన్నప్పుడే, తనకేమైనా జరగరానిది జరిగి కోలుకోలేని స్థితిలో ఉంటే ప్రాణం తీయవచ్చు, అంటూ వీలునామా రాయటం. ఇలాంటి చట్టాలన్నీ పరిణితి చెందిన సమాజంలోనే ఫలితాలిస్తాయి.

దాదాపు నలభై ఏండ్లుగా ఇటువంటి మరణాలను అనుమతించాలా వద్దా అనే దానిపై తర్జన భర్జనలు జరిగాయి. ఈ తరహా అనుమతులు కొన్ని పాశ్చాత్య దేశాల్లో ఇస్తున్నప్పటికీ మనదేశంలో ఇన్నాళ్ళు ఇవ్వకపోవడానికి ప్రధాన కారణం ఇదెక్కడ దుర్వినియోగం అవుతుందోనన్న భయమే. ఇప్పుడీ భయాందోళనలేమీ తొలగి పోలేదు. కానీ జీవచ్ఛవాల్లా మారుతున్న వారి సంఖ్య బాగా పెరిగిపోతుండటం, అటువంటి రోగులకు సపర్యలు చేయడం కుటుంబ సభ్యులకు కూడా కష్టసాధ్యమైన పరిస్థితి. లైంగిక దాడికి గురై దాదాపు నలభై ఏండ్లు కోమాలో ఉన్న అరుణా షాన్బాగ్ అనే మహిళ అభ్యర్థన మేరకు 2011 లో అనుమతినిస్తూ ఒక తీర్పు వచ్చింది. కానీ ఆమె సహజమరణమే పొందింది. వైద్య సౌకర్యాలు మెరుగైన దృష్ట్యా, వృద్ధాప్యంలో మంచానికే పరిమితమైన వారు కొందరైతే ప్రమాదాల్లో మతిస్థిమితం కోల్పోయిన వారు ఇంకొందరు జీవచ్ఛవాల్లా మారి తమవారికే ఇబ్బంది కలిగించేంతగా పరిస్థితులు దాపురించినందుకు యూతనేషియా కావాలని కోరుకునే వారి సంఖ్య కూడా పెరిగింది. గోకుల్ చాట్ పేలుళ్ళలో తీవ్రంగా గాయపడి కోలుకోలేకుండా మంచానికే పరిమితమైన తన కొడుకును చూసుకునే స్థోమత, శారీరక శక్తీ తనకు లేవని ఓ తల్లి అర్థిస్తూ తనబిడ్డకు కారుణ్య మరణాన్ని అనుమతివ్వాల్సిందిగా కోర్టును ఆశ్రయించడం అందరి హృదయాలను కలిచి వేసింది. ఇట్లాంటి మరెన్నో కేసులు దేశంలోని కోర్టుల్లో పెండింగులో ఉన్నాయి. సుప్రీమ్‌కోర్టు తీర్పు తరువాత ఎలాంటి వెసులుబాటు కలుగుతుందో వేచి చూడాల్సిందే.

యూతనేషియాకు అర్జీ పెట్టుకున్న తరువాత రోగికి వైద్యం చనిపోతాడనుకుంటే ఆపేయడం లేదా చనిపోవడానికి ఒక ఇంజక్షన్ ఇవ్వడం వంటి పద్దతులు డాక్టర్లు పాటించాల్సి వుంటుంది. సమస్యంతా ఇక్కడే వుంది, ఇన్నాళ్ళూ వేచి చూసింది కూడా తరువాత వివరించబోయే సందేహాల గురించే. కొన్ని కేసుల్లో కచ్చితంగా చనిపోతాడనుకున్న వారికి నయమై కోలుకోవడం, అతి త్వరగా కోలుకుంటాడన్న కొందరు చనిపోయిన ఘటనలుండొచ్చు. ఈ మధ్య కాలంలో బాగా వెలుగులోకి వస్తున్నది కిడ్నీ రాకెట్. అలాగే ముఖ్యమైన అవయవాలకోసం చిన్న పిల్లల్ని ఎత్తుకెళ్ళి చంపేస్తున్నారని ఇరవై ఏండ్ల క్రితం క్రిమినల్ సినిమాలో చూయించిన తరువాత చాలా వెలుగులోకి వచ్చాయి కూడా. ఇప్పుడు కూడా చావు బ్రతుకుల్లో ఉన్న వారి బంధువుల దగ్గరికెళ్ళి అవయవాల దానానికి బేరాలు జరుగుతుంటాయని వింటున్నాం. ఇప్పుడున్న చట్టం ప్రకారం ఏ అవయవమైనా దానం ద్వారానే పొందాలి కానీ అన్ని వ్యవహారాల్లోనూ దానం పేరు మీద అమ్మకాలు కొనుగోళ్ళే జరుతున్నాయని సదరు దాతల ఫిర్యాదులు రెగ్యులర్ గా వినిపిస్తూనే ఉంటాయి. చట్టబద్ధం చేస్తూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు కొందరికి ఊరటనివ్వొచ్చు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన నిఘానీడలో మాత్రమే దీని అమలుకు చట్టాన్ని రూపొందించాలి.

- సెల్ : 9951300016

కులపాపం కడిగేయాలన్న భగత్‌సింగ్ అంతిమ భోజనం




కె. భాస్కర్

> **వేలాడుతున్న ఆ మహనీయుల శవాల వైపు తదేకంగా చూస్తూ తన కన్నీటిలో నిప్పులు చెరుగుతూ ఇంక్విలాబ్ జిందాబాద్...! అని నినదించిన బోధా భగత్‌సింగ్‌ల ఆత్మీయ అనుబంధమే స్ఫూర్తిగా... ఇప్పుడు మిగిలి ఉన్న భగత్‌సింగ్ లక్ష్యాలు నెరవేర్చేందుకు దళిత ఉద్యమాలు సైతం భగత్‌సింగ్ ఆశయాలను ఆలింగనం చేసుకొని అమలు చేయాల్సిన అవసరం చాలా ఉన్నది.**

అభ్యుదయం కోసం నిలబడే వ్యక్తి పాతకాలపు గుడ్డి విశ్వాసాలను విమర్శించాలి, పరిహసించాలి, ప్రశ్నించాలి అని భగత్‌సింగ్ గతకాలపు కుల వ్యవస్థ ఈ దేశానికి పట్టిన పుండులాంటిదని అభిప్రాయపడ్డాడు. నేటికీ భారతదేశంలో అభ్యుదయ భావాలు కలిగిన వారు సైతం కుల సమస్యపై మధ్యేమార్గం అవలంబిస్తూ పరోక్ష మద్దతుదారులుగా ఉంటారు. భగత్‌సింగ్ ఆర్థిక కోణం గురించి తెలిసినంతగా ఆయన సామాజిక దృక్పథం బయటి ప్రపంచానికి తెలియదు. ప్రస్తుతం దళిత సమాజం ఎదుర్కొంటున్న పీడన విముక్తి కోసం భగత్‌సింగ్‌ని ఆ ఉద్యమాల్లో అంతర్భాగం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

తన చివరి క్షణాల్లో ఆయన చూపిన ఆర్ద్రత కులం పట్ల ఆయన వైఖరి తెలియజేస్తున్నది. భగత్‌సింగ్ ఆర్థిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక అసమానత్వానికి మూలమైన కుల వ్యవస్థపట్ల కూడా తీవ్ర వ్యతిరేకత కలిగి ఉన్నాడు. భౌతిక సుఖాల కోసం పరిగెత్తే మనుషులు తనువు చాలించిన వెంటనే తమ అస్థిత్వాన్ని కోల్పోతారు. ప్రగతి కోసం, అభ్యుదయ విలువల కోసం సంఘర్షించే వారు తాము నమ్మిన భావాలని మరింత పరిపుష్టం చేస్తారు. ఆ అభ్యుదయ భావానికి రూపంగా, ఒక ఉన్నత విలువగా, ఒక ఆదర్శంగా సమాజంపై తమ ప్రగాఢముద్ర వేస్తూనే ఉంటారు. "భావాలూ వ్యక్తుల మెదళ్ళని ఆవహించినప్పుడు భౌతిక రూపం ధరిస్తుంది" అన్న మార్క్స్ మాట భగత్‌సింగ్ ఆశయ సాధన విషయంలో అమలుకు నోచుకోవలసి ఉన్నది. భగత్‌సింగ్‌ని సమగ్రంగా అర్థం చేసుకోవలసిన అధ్యయనం ఇంకా ముందుకు సాగాల్సిఉంది. తన సంస్థ అయినా హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌ని, హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్‌గా మార్చిన ఆయన ఆలోచన వెనక ఉన్న దృఢమైన ఆశయాన్ని తెలియజేస్తుంది. ఆ ఆశయం భారత సమాజంలో ఒక సమూల మార్పు వాంఛిస్తుంది.

బ్రిటిష్ స్థానంలో అదే ఆధిపత్య లక్షణాలు గల భారతీయులు అధికారం చేపట్టడం కాదు. ఆయన తను కోరుతున్న స్వాతంత్ర్యం ఎలా ఉండాలి అనే అంశంలో చాలా స్పష్టమైన అవగాహనాతో ఉన్నాడు. కేవలం స్వాతంత్ర్యం మన లక్ష్యం కాదు. స్వాతంత్ర్యం అంటే అధికారం బ్రిటిషువాళ్ళ చేతుల్లో నుండి లాగి ఆధిపత్య వర్గాలైన భారతీయుల చేతుల్లో పెట్టడం కాదు. అలాంటి స్వాతంత్ర్యం వల్ల పేదల జీవితాల్లో ఎలాంటి మార్పూరాదు. కార్మిక కర్షకుల పరిస్థితుల్లో మార్పు తీసుకురాలేదు. స్వాతంత్ర్యం కేవలం మొదటి మెట్టు మాత్రమే. ఒకరిపై ఒకరు పెత్తనం చేయని, ఆధిపత్యం చెలాయించని, అణచివేయని వ్యవస్థని నెలకొల్పడం మన లక్ష్యం. అందరికీ సమానంగా జీవించే హక్కు గల వ్యవస్థ కావాలి. ఒకరిపై మరొకరు ఆధిపత్యం చెలాయించే వ్యవస్థ నాశనం కావాలి. ఇది అనేక కులాలు, మతాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, భాషలు కలిగిన మన దేశంలో కష్టంతో కూడుకున్న పనే. కానీ అసాధ్యమైన పని కాదు. వీటిపై మనం కృషి చేయకపోతే దేశానికి స్వాతంత్ర్యం రావచ్చు. కానీ దేశం సంప్రదాయ వాదుల, అవినీతిపరుల, పీడితుల సమాజంగా మిగిలిపోతుంది. వీటిపై మనకు స్పష్టత ఉండాలి అన్న భగత్‌సింగ్ చివరి క్షణాలను వివరిస్తూ జస్వీందర్‌సింగ్ రాసిన అంతిమ భోజనం పుస్తకాన్ని కూడా లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.



సూర్యాస్తమయం కావొస్తోంది. వాతావరణం చల్లబడుతోంది. కానీ సమస్త భారతదేశం కోపంతో ఊగిపోతోంది. లాహోర్ అడుగడుగునా నిశ్శబ్దం అలుముకుంది. ఢిల్లీ నుండి లండన్ వరకు బ్రిటిష్ ప్రభుత్వం గాబరాపడుతోంది. లాహోర్ కేంద్ర కారాగార ప్రధానాధికారి సర్వవిధ సంసిద్ధుడైయున్నాడు. కానీ జైల్లో యువఖైదీ ఏమాత్రం చింతలేకుండా చిన్న గదిలో హాయిగా కూర్చుని ఉన్నాడు. ఒక్కసారిగా జైలర్ ఖాన్ బహదూర్ మహ్మద్ అక్బర్ బూట్ల చప్పుడు ఆ యువఖైదీ గదిముందు ఆగింది. తలుపులు తెరుచుకున్నాయి. సర్దార్‌జీ లేవండీ.. మీ ఉరికి సమయం ఆసన్నమైందని అన్నాడు. ప్రగాఢమైన ఆత్మవిశ్వాసంతో భగత్ దృష్టి పుస్తకంలో నుంచి జైలరు వైపు మళ్లింది.. ఆగండి. "ఒక విప్లవకారుడు మరో విప్లవకారునితో సంభాషిస్తున్నాడు" అంటూ లెనిన్ రాసిన "ఏం చేయాలి" పుస్తకాన్ని చదవటం ఆపలేదు. జైలర్ నిశ్శబ్దంగా భగత్‌సింగ్ స్పందన కోసం వేచి చూస్తున్నాడు. భగత్‌సింగ్ పుస్తకం పూర్తి చేసి జైలరు కండ్లలో కండ్లు సారించి ఇక నడవండి అంటాడు. ఆ ధైర్యాన్ని చూసిన జైలరు కాళ్లు చచ్చుబడిపోయినట్టవుతాయి. కంపిస్తున్న గొంతుతో భగత్‌సింగ్.. నీ ఆఖరి కోరిక ఏమైనా ఉంటే చెప్పు నేను తీర్చగలుగుతానేమో అని అడుగుతాడు. ఆ జైలర్ అప్పటికే భగత్‌సింగ్ వ్యక్తిత్వం చేత ప్రభావితుడైయున్నాడు. అతను భగత్‌సింగ్ ఉరి శిక్షనైతే రద్దు చేయించలేడు. అదే సమయంలో భగత్‌సింగ్‌ను ఉరికంబంపై వేలాడుతుంటే చూడలేడు. అందుకని ఉరిశిక్ష ప్రకటించిన తరువాత ఒక రోజు జైలర్ భగత్‌సింగ్‌తో మాట్లాడుతూ "ఒక వేళ నువ్వు జైలు నుంచి పారిపోవాలనుకుంటే నా ఉద్యోగాన్ని సైతం అపాయంలో పెట్టి అయినా నీవు పారిపోవటానికి సహకరిస్తానన్నప్పటికీ, భగత్‌సింగ్ ఒప్పుకోలేదు.

అంతిమ భోజనం

నా ఆఖరి కోరికగా.. నేను అమ్మ చేతివంట తినాలనుకుంటున్నాను.. తీర్చగలవని జైలర్‌కు భగత్‌సింగ్ తన ఆఖరి కోరిక చెప్పి నిశ్శబ్దంగా ఉండిపోయాడు. కానీ జైలర్ నిశ్శబ్దం నుంచి బయటపడి వణుకుతున్న గొంతుతో 'భగత్ నీ కోరిక నేనెలా తీర్చను? ఇంతకుముందే మీ అమ్మతో ఆఖరి క్షణాల్లో నన్ను కలవడానికి మళ్లీ రావద్దు అన్నావు కదా! ఇప్పుడు మీ అమ్మ చేతివంట నేనెలా తీసుకురాగలనని' ఆందోళన పడతాడు. అప్పుడు భగత్‌సింగ్ "నేను ఆ అమ్మ చేతివంట గురించి చెప్పడం లేదు. ఇక్కడి ఈ అమ్మ చేతివంట గురించి మాట్లాడుతున్నానంటూ ఆ కారాగారంలో మరుగుదొడ్లు శుభ్రం చేసే దళిత ఉద్యోగి బోధా వైపు చెయ్యి చూపుతాడు..." జైలు ఉద్యోగులే కాదు ఖైదీలు కూడా బోధాను భంగీ లేదా పాకీ లేదా బోధా అని పిలుస్తారు. కానీ భగత్‌సింగ్ ఇప్పుడే కాదు... ఇంతకు ముందు నుంచే బోధాను "అమ్మా..!" అని పలకరించేవాడు. అమ్మ చేతివంట తింటానని భగత్‌సింగ్ చెప్పగానే, అతనిని అమ్మా..! అంటున్నావా అని జైలర్ ఖాన్ బహదూర్ ఆశ్చర్యానికి గురయ్యాడు. "అవును, నేను అతడినే అమ్మా అంటున్నాను, నా తల్లి నన్ను చిన్నప్పుడు మాత్రమే శుభ్రం చేసింది. బోధా మాత్రం జైలులో అందరి మురికిని శుభ్రపరుస్తున్నాడు. అందుకే నేను అతని చేతి అన్నమే తినాలనుకుంటున్నాను అనగానే, బిడ్డా..! నువ్వు నాచేతి వంట తిని నీ ఆచారాన్ని ఎందుకు చెడగొట్టుకుంటావు అంటూ బోధా గద్గద కంఠంతో అడిగితే, నీవు పెట్టిన భోజనం తిని నా పూర్వీకుల పాపాలన్నీ కడిగేయాలనుకుంటున్నానని భగత్‌సింగ్ బోధాను ఆలింగనం చేసుకుంటాడు. బోధా వంట చేస్తాడు. పొంగుకొచ్చే దుఃఖాన్ని దిగమింగుతూ, తుడుచుకుంటూ వడ్డిస్తాడు. కానీ భగత్ మాత్రం నవ్వుతూ హాయిగా తింటాడు. ఎన్నో తరాలనుంచి ఆకలిగా ఉన్నవాడిలా ఇష్టంగా తృప్తిగా భోంచేస్తాడు.

తరువాత తన మిత్రులైన రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆలింగనం చేసుకొని "ఇంక్విలాబ్ జిందాబాద్" అని నినదిస్తూ ఉరికంబం వద్దకు చేరుకోగానే అక్కడున్న ఆంగ్లేయ డిప్యూటీ కమిషనర్ ఆ ముగ్గురు వీరులను చూడగానే కంపించిపోయాడు. భగత్‌సింగ్ ఆ ఆంగ్లేయ డిప్యూటీ కమిషనర్‌నుద్దేశించి "వెల్, మిస్టర్ మెజిస్ట్రేట్, యు ఆర్ ఫ్యార్చునేట్ టు ప్రాబబ్లీ టు సీ హౌ ఇండియన్ రెవల్యూషనరీస్ కెన్ ఎంబ్రెస్ డెత్ ప్లెజర్ ఫర్ ది కేస్ ఆఫ్ దేర్ సుప్రీమ్ ఐడియల్ (జడ్జిగారు! మీరు అదృష్టవంతులు. భారతీయ విప్లవకారులు తమ అత్యున్నతమైన ఆదర్శం కోసం మృత్యువును సైతం ఎంత సంతోషంగా స్వీకరిస్తారో చూడబోతున్నారంటాడు.) భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ "ఇంక్విలాబ్ జిందాబాద్", సామ్రాజ్యవాదం నశించాలని నినాదాలిస్తూ ఉరికంబం వైపునకు నడుస్తారు. పక్కనే నిలబడి ఉన్న బోధా బోరున గుండెలవిసేలా ఏడుస్తూ వారితోపాటు బోధా కూడా గొంతుకలిపి కుడి చేత్తో కండ్లు తుడుచుకుంటూ ఎడమ చేయి పిడికిలి బిగించి పైకెత్తి ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినదిస్తుండగానే ముగ్గురికీ ఉరితాడు బిగుసుకుంటుంది.

సెల్ : 9491118822



ఆదాయానికి పది మార్గాలు

"చిన్నచిన్న నీటి బిందువులు కలిసి ఒక పెద్ద సముద్రాన్ని తయారుచేస్తాయి" అనే ప్రసిద్ధ నానుడి ఉంది. అంటే అర్థం మీరు తక్కువ సమయంలో చిన్న మొత్తంతో మొదలుపెట్టి దీర్ఘకాలంలో ఒక పెద్ద మొత్తాన్ని ఆదా చేయవచ్చు. ఇలా చేయాలంటే కచ్చితమైన ప్రణాళిక అవసరం. ఆదాయాన్ని, ఖర్చుల మధ్య సమతుల్యతను పాటించే వారు మాత్రమే బాగా పొదుపు చేయగలరు. మీరు ఎంత సంపాదిస్తున్నారు అనేది విషయం కాదు. ఎక్కువ ఇబ్బంది పడకుండా ఎంత ఆదా చేస్తున్నారనేదే లెక్క. అందుకే ముందు ఒక బడ్జెట్ తయారుచేసుకోవాలి. ఆ తర్వాత ఖర్చుల ప్రణాళిక వేసుకుని, ఒక డైరీలో రాసుకోవాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి దీనికి సంబంధించిన ఓ యాప్‌ని డౌన్లోడ్ చేసుకుంటే, అది మీ ఖర్చులను అదుపులో ఉంచుకోవడానికి సహాయపడుతుంది. మనం సాధారణంగా చిన్నచిన్న ఖర్చులను లెక్కచేయం. కానీ అలాంటి చిన్న ఖర్చులే చివరకు పెద్ద మొత్తంగా మారి కష్టాల్లోకి నెట్టేస్తాయి. ఆర్థికంగా మిమ్మల్ని ఇబ్బంది పెడతాయి. అందుకే డబ్బును ఆదా చేసే పది సలహాలు మీ కోసమే...

1 నెలవారి సరుకుల లిస్టు: మీ ఇంటికి నెలకు సరిపడా సరుకుల జాబితాను తయారు చేసుకుని బడ్జెట్ వేసుకోండి. లేదంటే షాపుకు వెళ్ళినప్పుడు అవసరంలేని వస్తువులు కూడా కొంటారు. అందుకే ఒక జాబితా తయారుచేసుకుంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దానివల్ల అవసరంలేని వస్తువులను కొనకుండా ఉండవచ్చు. పండుగ సీజన్లలో లేదా అతిధులను ఆహ్వానించినపుడు మరో జాబితాను పరిగణలోనికి తీసుకోవాలి. దాని ప్రకారమే కొనుగోళ్లు చేయడం మంచిది.



2 పోల్చుకోండి: ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువయింది. ప్రతీది ఆన్‌లైన్‌లో దొరుకుతుంది. ఆన్‌లైన్‌లో కొనేవాటికి, విడిగా కోనేవాటికి కొంత తేడా ఉంటుంది. మీరు కొనాలి అనుకునే వస్తువులను ఏమైనా ఎక్కువ తగ్గింపు ధరలు ఉన్నాయేమో పోల్చి చూసుకోండి. ఉదాహరణకు మీరు ఒక మొబైల్ కొనాలి అనుకుంటే, ఒక్క ధర మత్రమే కాకుండా ఆన్ లైన్‌లో రివ్యూ కూడా చూడండి. ఎలక్ట్రానిక్ వస్తువులపై ఆన్‌లైన్‌లో అప్పుడప్పుడు ఆఫర్లు వస్తుంటాయి. వాటిని వినియోగించుకోండి.



3 మందులపై ఆదా: మీరు మందులు కొనుగోలు చేసేటపుడు మీ బిల్ పై కొంత తగ్గింపు వచ్చే దుకాణాలలో కొనుగోలు చేయండి. అలాంటి ఫార్మసీలలో కొనుగోలు చేయడం వల్ల మరో ప్రయోజనం ఏమిటంటే, మీ మందులను ట్రాక్ చేసుకోవచ్చు. మీకు అవసరమైన జాబితాని డౌన్లోడ్ చేసుకోవచ్చు. వారు మీకు ఒక లాగిన్ ఇస్తారు. పన్ను రిటర్నులు సమర్పించేటపుడు దీన్ని చూపించుకోవచ్చు. ఇటీవల చాలా రాష్ట్రాల్లో జనరిక్ దుకాణాలు ప్రారంభిస్తున్నారు. వీటిని సైతం కొనుగోలు చేసి మీ బిల్లును తగ్గించుకోవచ్చు.



4 విలాసాలకు ఒక ప్రణాళిక: మీరు వారాంతరంలో కాస్త సరదాగా గడపాలనుకుంటారు. డిన్నర్‌కో, మూవీకో వెళ్ళాలనుకుంటారు. అయితే అనుకున్న వెంటనే ఎలాంటి ప్లాన్ లేకుండా వెళ్ళిపోవద్దు. ఏ రెస్టారెంట్లలో తగ్గింపు ఆఫర్లు ఉన్నాయో సమాచార జాబితాను కొన్ని వెబ్ సైట్లలో పరిశీలించుకోండి. సినిమా టికెట్లు బుక్ చేసే ముందు మీ కార్డ్స్ పై ఎమైనా ఆఫర్లు ఉన్నాయేమో చూసుకోండి. కొన్ని బ్యాంకులకు వీటితో టై అప్ ఉంది.



5 ఆఫర్ల కోసం తనిఖీ చేయండి: మీరు ఏదైనా పెద్ద వస్తువు కొనుగోలు చేయాలంటే ఆఫర్ల కోసం ఎదురుచూడండి. పండగ సీజన్లలో ఈ ఆఫర్లు అందు బాటులో ఉంటాయి. పండగ సమయాలలో ఎలక్ట్రానిక్ వస్తువులపై చాలా పెద్ద ఆఫర్లు ఉంటాయి. కొన్ని వస్తుమార్పిడి ఆఫర్లు కూడా ఉంటాయి. పెద్ద వస్తువు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతకే ప్రాధాన్యం ఇవ్వండి. ఎందుకంటే వీటికోసం మళ్ళీ మళ్ళీ ఖర్చు చేసే అవసరం రాకూడదు.



6 అవసరంలేని వస్తువులను అమ్మడం: డబ్బు సంపాదించడానికి ఇదో మంచి పద్ధతి. కొంతమంది ఇంట్లో పడివున్న అనవసరమైన వస్తువులను అమ్మి డబ్బు సంపాదిస్తారు. అయితే, వస్తువులను అమ్మేటపుడు తెలివి అవసరం. ఇటీవల ఓఎల్ఎక్స్ లాంటి వెబ్‌సైట్లు పాత వస్తువులను అమ్మడాన్ని సులభతరం చేశాయి. అలాంటి వెబ్‌సైట్లను ఉపయోగించుకోండి.



7 క్రెడిట్ కార్డ్స్ వాడకంలో జాగ్రత్త: క్రెడిట్ కార్డు అత్యవసరాల్లోనే వాడండి. అవును, ఇది ప్రతి ఒక్కరికీ చెప్పే అత్యంత సాధారణ చిట్కా. తక్కువ పరిమితి గల క్రెడిట్ కార్డులను ఉపయోగించడం చాలా కష్టం అని మీరు గమనించే ఉంటారు. క్రెడిట్ కార్డులను వాడకపోవడానికి ప్రధాన ఉద్దేశం అనవసరమైనవి కొనుగోలు చేయకుండా ఉండడం. క్రెడిట్ కార్డ్ నుండి ఎక్కువ ఆదా చేయాలంటే, మీ క్రెడిట్ పాయింట్లను ట్రాక్‌లో ఉంచితే అవసరమైనపుడు వాడుకోవచ్చు. పెట్రోల్, డీజిల్ లాంటి వాటికి కార్డ్ ఉపయోగించడం మంచిది.




8 విలాస వస్తువుల వాడకంలో అప్రమత్తత: సాధ్యమైనంత వరకు కారుకు బదులు బైకును వాడండి. నడవడం అనేది అన్నిటికంటే ఇంకా మంచిది. తక్కువ దూరాలకు నడక మార్గాన్నే ఎంచుకోండి. ఇందుకు మీరు సమయ పాలన పాటించడం అవసరం. ఈ చిన్ని చిన్ని అంశాలు మీ ఇంధన చెల్లింపులను తగ్గించడమే కాకుండా మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



9 నగదు రూపంలో ఉంచొద్దు: మీ చేతిలో డబ్బు ఉంటే అదాయం వచ్చే పని కోసం పెట్టుబడి పెట్టండి. అనేక బ్యాంకులు ఆటో స్వీప్ సౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. అంటే మీ అకౌంట్ కొంత మొత్తానికి నిర్దేశిస్తే దానంతట అదే ఆ మొత్తం డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్ ఖాతాలోకి మళ్లింపబడుతుంది. బ్యాంకులు ఏర్పాటు చేసిన ఎఫ్‌డీలపై వడ్డీ రేట్ల ప్రయోజనాన్ని మనం పొందవచ్చు.



10 మీ ఆర్థిక నైపుణ్యాలను పెంపొందించుకోండి: అవును, ఆర్థికపరమైన సమాచారం తెలుసుకుంటే మీరు బ్యాంక్ డిపాజిట్లు పెరుగుతున్నాయా? తగ్గుతున్నాయా? డెబిట్, క్రెడిట్ కార్డ్లపై ఏమైనా ఆఫర్లు ఉన్నాయా అనే అనేక మార్గాలను తెలుసుకోవడానికి సహాయ పడుతుంది. ముఖ్యంగా ఏదైనా వస్తువు కొనుగోలు చేసేముందు ఆ డాక్యుమెంట్ జాగ్రత్తగా చదివి సరైన రీతిలో పెట్టుబడి పెట్టండి.





మూడు పదులు కూడా దాటని వయస్సు.. ఎలాంటి వ్యాపార నేపథ్యం కాని, అనుభవం కాని లేని యువతి.. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా, అదీ అప్పటిదాకా ఎవరూ వినని రంగంలో కాలు మోపారామె. ఆ వ్యాపారాన్ని నమ్మి రుణాలిచ్చేందుకు ఏ బ్యాంకూ ముందుకు రాలేదు. ఉద్యోగం చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. అయినా తాను అనుకున్న రంగంలో కేవలం పదివేల పెట్టుబడితో ముందడుగు వేశారు. 30 ఏండ్ల ఆమె శ్రమ ఫలించింది. ఇప్పుడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు వరదలా వచ్చిపడ్డాయి. ఆమె నింపిన స్ఫూర్తి ఎందరో ప్రతిభ కలిగిన యువ శాస్త్రవేత్తలు విదేశాల నుంచి తిరుగుబాట పట్టేలా చేసింది. ఆమె బయోకాన్ అధినేత్రి కిరణ్ మజుందార్ షా. నేడు ఆమె పుట్టినరోజు...

బయో ఐకాన్

కోల్‌కతాకు చెందిన ఓ మార్వాడీ కుటుంబంలో 1953, మార్చి 23న జన్మించారామె. ఆ తర్వాత కుటుంబంతో పాటు బెంగళూరు వెళ్లారు. పాఠశాల విద్యతో పాటు ఉన్నత, కళాశాల విద్య కూడా బెంగళూరులోనే ముగించారు. బెంగళూరు యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఆ తర్వాత తిరిగి బెంగళూరు వచ్చారు. వైద్య రంగంలో ప్రవేశించాలనుకున్న కిరణ్ మజుందార్ షా, అనుకోకుండా జీవశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1978లో బయోకాన్ బయోకెమికల్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు. 25 ఏళ్ల వయసులో ఎలాంటి వ్యాపార నేపథ్యం లేనప్పటికీ అద్దె ఇంటిలోని గ్యారేజీలో కేవలం రూ.10 వేల పెట్టుబడితో 1979లో బయోఫార్మా ఫర్మ్ బైకాన్ కంపెనీని స్థాపించారు కిరణ్ మజుందార్ షా. కొత్త కంపెనీ, తక్కువ వేతనానికి పనిచేసేందుకు ఎవ్వరూ ముందుకు రాకున్నా మొండి ధైర్యంతో కంపెనీని నడిపించారు. ఎవరి సహకారం లేకపోయినప్పటికీ స్వయంశక్తితో ఎదిగారు. నిధుల కోసం అర్రులు చాచిన బయోకాన్‌ను నిధుల వరద ముంచెత్తే స్థాయికి తీసుకురాగలిగారు. పవన విద్యుత్‌రంగ నిపుణుడు జాన్ షాను వివాహం చేసుకున్న షా, బెంగళూరునే తన స్థిర నివాసంగా చేసుకున్నారు.

శాస్త్రవేత్తలు విదేశాల్లో స్థిరపడాలనుకున్న సమయంలో కిరణ్ ఇండియాలో సంచలనం స ష్టించారు. బయోకాన్ స ష్టించిన ప్రభంజనం తిరిగి వారిని ఇండియాకు రప్పించింది. ఔషధ పరిశోధన రంగంలో విశేష ప్రతిభా పాటవాలు కలిగిన భారత యువ శాస్త్రవేత్తలు క్రమంగా విదేశాల నుంచి తిరుగుబాట పట్టారు. భారత్‌లో బయోటెక్నాలజీ రంగంలో తొలి కంపెనీని నెలకొల్పి, ప్రపంచంలోనే పేరెన్నికగన్న సంస్థగా తీర్చిదిద్దారు షా. బడా పారిశ్రామిక వేత్తలు చేయని రీతిలో సాహసంతో ముందడుగు వేసిన కిరణ్ మజుందార్ షా, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో చోటు సంపాదించారు. కిరణ్ 2.1 బిలియన్ డాలర్ల సంపదతో అత్యంత ధనవంతుల జాబితాలో ఇండియాలో 72వ స్థానంలో, ప్రపంచంలో 973వ స్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ 2016లో విడుదల చేసిన అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో 77వ స్థానంలో నిలిచారు.

బయోటెక్నాలజీ రంగంలో కిరణ్ మజుందార్ షా సక్సెస్‌ఫుల్ టెక్నోక్రాట్. ఆమె క షికి గాను ఎన్నో అవార్డుల వరించాయి. టైం మ్యాగజైన్ వంద మంది ప్రభావిత వ్యక్తుల్లో స్థానం దక్కించుకున్న గొప్ప మహిళ. ఎకనామిక్ టైమ్స్ ప్రకటించిన 2012 టాప్ 10 పవర్‌ఫుల్ ఉమన్ సీఈఓల్లో కిరణ్ మజుందార్ ఒకరుగా నిలిచారు. నిక్కీ ఆసియా ప్రైజ్, 2009లో రీజనల్ గ్రోత్ అవార్డ్, 2009 డైనమిక్ ఎంట్రప్రెన్యూర్ అవార్డ్‌లతో పాటు 1989లో పద్మశ్రీ, 2005లో పద్మభూషణ్ ఆమెను వరించాయి. ఇక ప్రతిష్ఠాత్మకమైన అడ్వాన్సింగ్ ఉమెన్ ఇన్ సైన్స్ అండ్ మెడిసిన్ (ఎడబ్ల్యుఎస్ఎం) ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. భారత నుంచి ఈ బహుమతిని అందుకున్న తొలి మహిళ కిరణ్ మజుందార్ షా.

ఇంట్లోనే సహజంగా....



ఫేషియల్ అనగానే పార్లర్‌కు పరిగెత్తి పర్స్ ఖాళీ చేసుకుంటారు చాలామంది. సింపుల్ ప్యాక్స్‌తో ఇంట్లో పార్లర్‌లాంటి నిగారింపు పొందవచ్చు. ఇంట్లోనే సహజంగా చేసుకోగలిగే ఫేస్ ప్యాక్స్ కొన్ని..

బొప్పాయితో... చర్మానికి మెరుపునిచ్చే పండ్లల్లో బొప్పాయి ఒకటి. ఈ బొప్పాయి మాస్క్ తయారుఉ చేసుకోవడానికి.. మూడు ముక్కలు బాగా పండిన బొప్పాయి తీసుకుని... దానికి రెండు చెంచాల బాదం పొడిని కలుపుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లాగా వేసుకుని పది నిమిషాల తరువాత ముఖాన్ని మర్దన చేయాలి. తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి.

పెరుగుతో... రెండు చెంచాల పెరుగుకు రెండు లేదా మూడు చ్చుల బాదం నూనెను కలపాలి. ఒక చెంచా తేనెను చేర్చాలి. ముఖంపై సమానంగా అప్లై చేయాలి. 15 నిమిషాల తరువాత ముఖానికి మృదువుగా మసాజ్ చేసి చల్లని నీటితో కడిగేయాలి. చర్మాన్ని మృదువుగా చేయడమే కాదు... సహజమైన అందాన్నిస్తుంది.

తేనెతో... వయసును తగ్గించే సహజమైన ద్రావణం తేనె. వారానికి మూడు సార్లు తేనెను ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తరవాత చల్లని నీటితో కడిగేయాలి.

బాదంతో... బాదాంలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది ఓట్స్, మిల్క్‌తో కలిస్తే అద్భుతాలను సృష్టిస్తుంది. ఒక చెంచా బాదం పొడి, ఒక చెంచా ఓట్స్ తీసుకోవాలి. ఈ రెండింటిని పాలల్లో వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. 20 నిమిషాల తరవాత చల్లని నీటితో కడిగేయాలి. స్కిన్‌టోన్‌ను పూర్తిగా మార్చేస్తుంది. చర్మానికి నిగారింపునిస్తుంది.

క్యారెట్‌తో... క్యారెట్‌లో విటమిన్ 'సి', 'కె' తోపాటు 'బి' కెరోటిన్ ఉంటుంది. క్యారెట్ తీసుకుని గుజ్జుగా చేసుకోవాలి. పాలపొడి, చక్కెరతో బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

'మానవి' మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి.
మీ సూచ నలు, సలహాలు ఇ-మెయిల్
navamaanavi@gmail.com
కు తెలియ జేయండి.
మా చిరునామా:
మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664,
అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు,
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.



తండ్రి కలను నిజం చేసి...

'**అ**బ్బాయి తెచ్చినా, అమ్మాయి తెచ్చినా... స్వర్ణ పతకం.. స్వర్ణ పతకమే కదా' అంటాడు దంగల్ హీరో! పురుషాధిపత్యాన్ని బద్దలు కొడుతూ.. అమ్మాయిలపై వివక్షకు అంతం పలుకుతూ ఆయన తీసుకున్న నిర్ణయం తరువాత తన కూతుళ్ల జీవితాలనే కాదు.. మొత్తం భారతదేశంలోని చాలామంది అమ్మాయిల భవిష్యత్‌ను మార్చేసింది. ఉత్తరాఖండ్‌లోనూ అలాంటి ఓనిజమైన హీరో ఉన్నారు. కాకపోతే ఇక్కడ ఆయన కూతురును రెజ్లింగ్‌కు పంపలేదు. న్యాయస్థానంలోని అత్యున్నత స్థానంలో తన కూతురు నిల్చోవాలని కలలు కన్నాడు. ఆ కలలను కూతురు నిజం చేసింది. తండ్రి ఆటోనడిపి సంపాదించిన డబ్బే ఆ కుటుంబానికి ఆదాయం. పైగా నలుగురు పిల్లలు. అలా అని ఆ తండ్రి పిల్లల్ని చదివించకుండా వదిలేయలేదు. తిండికోసం కష్టమైనా సరే సంపాదనంతా పిల్లల చదువులకే పెట్టారు. అదే వాళ్ల భవిష్యత్తును మారుస్తుందని ఆయన నమ్మకం. ఆ నమ్మకం నిజమేనని ఆయన మూడో సంతానమైన పూనమ్ టోడి నిరూపించింది. ఉత్తరాఖండ్‌లో ప్రొవిన్షియల్ సివిల్ సర్వీసెస్ (జుడీషియల్)లో ఆమె రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. పూనమ్ తండ్రి అశోక్ టోడి ఆటో నడుపుతూ రోజుకు నాలుగొందల నుంచి ఐదొందల రూపాయలు సంపాదిస్తే... కుటుంబంలోని ఆరుగురి పొట్ట నిండాలి. పైగా ఇద్దరమ్మాయిలూ, ఇద్దరబ్బాయిలు. అయితే ఎప్పుడూ అమ్మాయిలు, అబ్బాయిల విషయంలో తారతమ్యాలు చూపలేదు. పెంపకం దగ్గరనుంచి చదివించడం వరకు ఆయన ఎలాంటి వివక్ష కనబరచలేదు. మొదట్లో వారికో చిన్న కిరాణా దుకాణం ఉండేది. దాంతో వచ్చే ఆదాయం సరిపోయేది కాదు. అందుకే డెహ్రాడున్‌కు వచ్చి ఆటో నడపడం మొదలెట్టాడు పూనమ్ తండ్రి. పిల్లల లక్ష్యాలకు డబ్బు అనేది సమస్య రాకుండా పెంచాలనుకున్నాడు. తానెంత కష్టపడ్డా... పిల్లలను మాత్రం బాగా చదివించాడు. తండ్రి ఆశయానికి తగ్గట్టుగా పూనమ్ ఇంటర్ తర్వాత బీకామ్‌లో చేరింది. కానీ ఆమెకు న్యాయవ త్తి మీద ఆసక్తి ఉండడంతో డిగ్రీ తర్వాత ఎల్‌ఎల్‌బి ఎంచుకుంది. వెంటనే సివిల్స్ జ్యుడీషియల్ పరీక్షలకు సన్నద్ధం అవ్వడం ప్రారంభించింది. రెండు సార్లు పరీక్ష రాసినా ఇంటర్వ్యూలో చుక్కెదురయ్యింది. అయినా పట్టువదలకుండా 2016 లోనూ పరీక్ష రాసింది. ఈసారి ఊహించని రీతిలో మొదటి ర్యాంకు సంపాదించింది. నిజానికి పూనమ్... తన చదువు పూర్తి కాగానే ఏదైనా ఉద్యోగం చేయాలనుకుంది. కుటుంబానికి అండగా నిలవాలని భావించింది. కానీ పూనమ్ తండ్రి అందుకు అంగీకరించలేదు. ఉద్యోగం చెయ్యమని ఎప్పుడూ ఆమెను అడగలేదు. సరి కదా... ఇంకా చదువుతానన్నా కూడా ఆయన అడ్డు చెప్పలేదు. అలా కుటుంబ సహకారంతోనే ఎమ్‌కామ్, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేయగలిగింది. రెండు సార్లు ఓడిపోయినా తల్లిదండ్రులెప్పుడూ ఆమెను నిరుత్సాహ పరచలేదు. సాధించగలవంటూ పూనమ్ వెన్ను తట్టారు. ఆ ప్రోత్సాహమే ఆమెకు విజయం వరించేలా చేసింది. న్యాయస్థానంలోని ఉన్నత పదవి 'జడ్జి'ని అలంకరించేలా చేసింది. పూనమ్ కష్టం... కుటుంబం అందించిన సహకారం.. ఎంతోమంది అమ్మాయిలకు, వారి కుటుంబాలకు స్ఫూర్తిదాయకం!



ఆంధ్రప్రదేశ్

ఆర్టీసీఎండీగా సురేంద్రబాబు

- ఆక్టోపస్ అడిషనల్ డీజీ నుంచి పదోన్నతి
- ఉత్తర్వులు వెలువరించిన ప్రభుత్వం



అమరావతి : ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా 1987 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్‌వి సురేంద్ర బాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషినల్ డీజీగా ఉన్న సురేంద్ర బాబుకు పదోన్నతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2001 నుంచి 2004 మధ్య విజయవాడ కమిషనర్‌గా పనిచేశారు. 2006-2007 మధ్యలో హైదరాబాద్ సిటీ పోలీస్ అడిషనల్ కమిషనరేట్‌లో కో ఆర్డినేషన్ విభాగంలో సేవలందించారు. అంతకుముందు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. 2007లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొందారు. 2008లో మక్కా మసీదు బాబింగ్ కేసులో ఏపీ పోలీస్ దళం సభ్యులుగా ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గానూ, ఎక్సైజ్ శాఖలోనూ పని చేశారు. వరంగల్ ఎన్‌ఐటి నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన ముంబైలో ఎంటెక్ చేసి డెహ్రాడూన్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో ఎస్‌పి శిక్షణ పొందారు. నల్లమలలోని గ్రేహౌండ్స్ అకాడమీలో మావోయిస్టు వ్యతిరేక శిక్షణను పూర్తి చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాలో ఫెలోషిప్ చేశారు. కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షులుగానూ ఉన్నారు. ఆయనకు 2003లో రాజీవ్ సర్వీస్ మెడల్ కూడా లభించింది.

ఉద్యోగానికి 'సీబీఐ' లక్ష్మీనారాయణ గుడ్‌బై !

- విఆర్‌ఎస్‌కు దరఖాస్తు
- త్వరలో రాజకీయాల్లోకి.. ?



ముంబయి : సీబీఐ పూర్వ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పనున్నారు. ఈ మేరకు ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్)కు దరఖాస్తు చేశారు. తాను ఉద్యోగం నుంచి తప్పుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ 1990లో ఐపీఎస్‌కు మహారాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర ఏటీఎస్‌లో ఎస్పీ, డీఐజీగా, థానే సంయుక్త పోలీస్ కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం మహారాష్ట్ర అదనపు డీజీగా కొనసాగుతున్నారు. ఆయన కేంద్ర సర్వీసుల్లో ఉన్నప్పుడు సీబీఐ హైదరాబాద్ విభాగం డీఐజీ, సంయుక్త సంచాలకుడిగా పనిచేశారు. సీబీఐ అధికారిగా వైకాపా అధినేత జగన్ అక్రమాస్తులు, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఎమ్మార్, సత్యం కుంభకోణం, ఆజాద్ ఎన్‌కౌంటర్ వంటి కీలక కేసుల్లో ఆయన వ్యవహరించిన తీరు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. కేంద్ర సర్వీసుల అనంతరం తిరిగి మహారాష్ట్రలో విధుల్లో చేరినప్పటికీ లక్ష్మీనారాయణ తరచుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను ఉత్తేజపరిచే ప్రసంగాలు చేస్తూ వస్తున్నారు. సుమారు ఏడేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ ఆయన ఐపీఎస్‌గా వైదొలగాలని నిర్ణయించుకోవడం సంచలనం సృష్టిస్తోంది. లక్ష్మీనారాయణ త్వరలోనే రాజకీయాల్లో చేరుతారనే ప్రచారం కూడా జరుగుతోంది.

రాష్ట్రంలో త్వరలో ఆపరేషన్ 'గరుడ' :శివాజీ




మాట్లాడుతున్న సినీహీరో శివాజీ

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అయితే రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను మార్చేందుకు ఒక జాతీయ పార్టీ 'ఆపరేషన్ గరుడ' చేపట్టనుందని చెప్పారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆ జాతీయ పార్టీ అను బంధ విభాగానికి చెందిన నాయకుడు తనకు మిత్రుడుగా ఉండటం వల్ల ఆ విషయం చెప్పగల్గు తున్నట్లు వెల్లడించారు. జాతీయ పార్టీ తీసుకునే నిర్ణయాలను ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ, మరో ప్రధాన పార్టీలు అమలు చేస్తుంటాయని, ఆ రెండు పార్టీలను ఒక నాయకుడు శాసిస్తాడని తెలిపారు. దీని కోసం రూ.4,800 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్‌లోకి ఎవరైనా వస్తే వారికి రావడమేగానీ బయటకెళ్లడం తెలియదన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరూ ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో అధికారం చేపట్టటానికి వివిధ పేర్లతో ఆపరేషన్స్ చేపట్టబోతున్నారన్నారు. ఆంధ్ర, తెలంగాణలకు సంబం ధించి 'గరుడ' పేరుతో ఆపరేషన్ చేపట్టనున్నట్లు వివ రించారు. హోదా కోసం ఉద్యమం చేసిన కమ్యూ నిస్టులు, వైసిపి, ఇతర సంఘాలకు గుర్తింపు ఉండటం లేదని తెలిపారు. ఎపి ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని ఎవరూ ఆ నాటకంలో చిక్కుకోవద్దని సూచించారు. ప్రత్యేక హోదా కోసం సినిమా వాళ్లు పోరాటం చేయటం లేదని టిడిపి ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మొదటసారి జాతీయస్థాయికి తీసుకెళ్లింది సినిమా వారేనని చెప్పారు. తాను హోదా ఉద్యమం కోసం హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తే అర్థరాత్రి అరెస్టు చేసి పంపించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ హోదా కోసం జరిగే ఉద్యమంలో పాల్గొనాలని కోరారు.

వీఆర్‌ఎల మహాధర్నా

- విజయవాడలో భారీ ర్యాలీ
- వేతన పెంపు జీవో జారీకి డిమాండ్
- పస్తులతో ఎలా బతకాలి: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్



అమరావతి : గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఎలు) తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైంది. వేతన పెంపు జీవో విడుదల చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రమోషన్ కోటా 70 శాతం పెంచాలని, రిటైర్డ్ వీఆర్‌ఎలకు పెన్షన్ ఇవ్వాలని, పే స్కేలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ తరలి వచ్చిన విఆర్‌ఎలు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు పెద్ద ఎత్తున నినదిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. అనంతరం అలంకార్ సెంటర్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఏపీ వీఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ పెద్దన్న అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మహా ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ విఆర్‌ఎలు చాలీచాలని జీతాలతో, పస్తులతో ఎలా బతకాలని ప్రశ్నించారు. వీఆర్‌ఎల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెట్టి చాకిరి చేస్తున్న వీరికి జీతాలు ఎందుకు పెంచట్లేదని ప్రశ్నించారు. జిల్లాల నుంచి ధర్నాకు వస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారన్నారు. వేతనపెంపు జీవోను చంద్రబాబు ఎందుకు ఆమోదించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రాజెక్టుల అంచనాలు పెరగటానికి

అవినీతేకారణం

జస్టిస్ (రిటైర్డ్) చంద్రకుమార్ ఆరోపణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టుల అంచనాలు పెరగటానికి అవినీతే కారణమని జస్టిస్ (రిటైర్డ్) చంద్ర కుమార్ ఆరోపించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మఖ్దూంభవన్‌లో జరిగిన రైతు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కావాలని డిమాండ్ చేయకుండా ఈ ప్రాజెక్టును తానే కడతానని కేసీఆర్ చెప్పటం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 18,000 కోట్ల నుంచి 84,000 కోట్లకు పెరగటం ఆశ్చర్యకరమన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్‌పై తామంతా టి, హన్మంతరావును కలిసినప్పుడు ఆయన చాలా ముఖ్య మైన విషయాలు చెప్పారన్నారు. కాళేశ్వరంలో భారీ రిజర్వాయర్లు అవసరం లేదని అన్నారని, దీనికి ఉదాహరణగా హర్యానాలోని జవహర్‌లాల్ నెహ్రూ ఎత్తిపోతల పథకం గురించి వివరించారని చెప్పారు. తాము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని, వీటి పేరుతో వేల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని సమా వేశం ఆమోదించింది. రాష్ట్ర జలవిధానాన్ని ప్రకటించాలని, సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటి వరకూ పెట్టిన ఖర్చు, అంచనాలు పెంచటంపై శ్వేతపత్రం విడు దల చేయాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. శ్రీరామ్‌సాగర్ వరద కాల్వ ఆయకట్టుగా నిర్ణయించిన జనగామలోని 60 వేలు, యదాద్రి లోని 30 వేల ఎక రాలకు సాగునీరు అందించాలని సమావేశం డిమాండ్ చేసింది. సీతారామ ప్రాజె క్టు ద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని ఆయకట్టుకు నీరం దించే విధంగా పనులు చేయాలని కోరింది. మధ్యతరహా ప్రాజెక్టుల పట్ల అలస త్వం వీడాలని, బడ్జెట్‌లో కేటాయించిన నిదులను పూర్తిగా ఖర్చు చేయాలని కోరు తూ తీర్మానించింది. నిర్వాసితులకు కొండపోచమ్మ వద్ద ఇచ్చిన విధంగా పరిహా రాన్ని అందరికీ ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. రైతు సంఘం నాయకులు సాగర్, సంజీవరెడ్డి, ప్రసాద్, పశ్యపద్మ, కెచ్చెల రంగారెడ్డి, పౌర సంఘాల నేతలు గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యను విస్మరిస్తే అభివృద్ధి ఉండదు

- పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్‌లో హరగోపాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగాన్ని విస్మరిస్తే ఏ రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా అభివృద్ధి ఉండబోదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే విద్యారంగం బాగుపడుతుందని ఆశించామని చెప్పారు. కానీ సీఎం కేసీఆర్ విధానాలు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తామని, నియంత్రిస్తామని, ఈ రాష్ట్రం నుంచి తరిమేస్తామని కేసీఆర్ ఉద్యమ సమయంలో అన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారని చెప్పారు. 2018-19 బడ్జెట్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయాలు రూ.900 కోట్లు కోరితే రూ.422 కోట్లు కేటాయించారని అన్నారు. అవి జీతభత్యాలకే సరిపోతాయని చెప్పారు. విద్యారంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగించారని విమర్శించారు. పేద, బడుగు బలహీనవర్గాలకు విద్యను దూరం చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం, విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరుతూ మరో ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జూపాక శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె నారాయణ (టీపీటీఎఫ్), నాగటి నారాయణ (తల్లిదండ్రుల సంఘం), కిష్టప్ప (డీటీఎఫ్), కోట రమేష్ (ఎస్‌ఎఫ్ఐ), మద్దిలేటి (టీవీవీ), శోభన్‌నాయక్ (టీఎస్ఎఫ్), మల్లేష్ రాజు (ఏఐడీఎస్ఓ), విజయ్‌కుమార్ (డీవైఎఫ్ఐ), బోయిన్‌పల్లి రాము తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్

ఆవిర్భావ దినోత్సవం

- కార్యాలయాల వద్ద ఎర్ర జెండాల ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల వద్ద ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్కిల్ యూనియన్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడిన 17 సంవత్సరాల్లో ఎన్నో విజయాలను సాధించిం దన్నారు. బీఎస్ఎన్ఎల్‌లో ఏడు సార్లు గుర్తింపు ఎన్నికలు జరిగితే మొదటి సారి తప్ప మిగతా ఆరు సార్లు యూనియన్ గెలుపొందిందని తెలిపారు. సంస్థ రక్షణ కోసం ఎన్నో పోరాటాలను నిర్వహించి ట్రేడ్ యూనియన్ చరిత్రలో నిలిచిపోయే విధంగా 200 ఉద్యోగుల సమస్యలను పరిష్కరిం చిందన్నారు. ఉద్యోగులకు రెండవ వేతన సవర ణలను సాధించి, ప్రమోషన్ పాలసీని అందించిం దన్నారు. బ్యాంకు రుణాలతో పాటు ఇతర అలవెన్స్‌ను సాధిం చామని చెప్పారు. మూడవ వేతన సవరణ, పెన్షన్ సవ రణ, సెల్ టవర్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరం తర ఐక్య పోరాటాలను చేయాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ సర్కిల్ సహాయ కార్యదర్శి జి సాంబశివరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రామ చంద్రుడు, శేషయ్య, జైస్వాల్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఫుటేజీ కావాలంటే సభ ఆమోదం కావాలి

- మరింత సమయమివ్వండి: అదనపు అడ్వకేట్ జనరల్
- 27కు విచారణ వాయిదా

హైదరాబాద్: శాసనసభ్యత్వాల రద్దును సవాల్ చేస్తూ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు దాఖలు చేసిన కేసులో గురువారం హైకోర్టులో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి. గవర్నర్ ప్రసంగ సమయంలో సభాగౌరవాన్ని దెబ్బతీసేలా వారిద్దరూ వ్యవహరించారని ఆరోపిస్తూ వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో సమావేశాల వీడియో ఫుటేజీ అందజేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయితే వీడియో ఫుటేజీ అందజేయాలంటే సభ ఆమోదం విధిగా ఉండాలని, ఈ నేపథ్యంలో వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని గురువారం తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ రామచందర్‌రావు హైకోర్టుకు తెలియ జేశారు. గత విచారణ సమయంలో హైకోర్టు ఆదే శాల మేరకు వీడియో ఫుటేజీ కావాలని అసెంబ్లీ సెక్ర టరీకి అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి లేఖ రాశారని ఆయన చెప్పారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి బి.శివశంకర్‌రావు రికార్డుల్లో నమోదు చేసి వీడియో ఫుటేజీ ఇచ్చేందుకు సమయాన్ని ఈ నెల 27 వరకు పొడిగించారు. విచారణ కూడ ఆదే తేదీకి వాయిదా వేశారు.

గ్రూప్-2 పరీక్షల ఓఎంఆర్‌షీట్ల సీల్డ్ కవర్ నివేదిక

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో టాప్‌లోని తొలి అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను న్యాయవాదుల కమిటీ పరిశీలన పూర్తి అయింది. సీనియర్ లాయర్ల కమిటీ పరిశీలన అనంతరం నివేదికకు హైకోర్టుకు అందజేశారు. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో వైటనర్ వినియోగించరాదని, కొట్టివేతలు ఉండరాదని, బబ్లింగ్‌లో తప్పు చేసిన, వివరాల నమోదులో తప్పు చేసిన వారిని కూడా అర్హులుగా ప్రకటించారంటూ హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు శుక్రవారానికి విచారణకు వచ్చే అవకాశమున్నది.

రథయాత్ర అనుమతి వ్యాజ్యం కొట్టివేత

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ నుంచి హనుమాన్ జయంతి వరకు వీహెచ్‌పీ (విశ్వహిందూపరిషత్) నిర్వహించాలని భావించిన శ్రీరామ రథయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. శ్రీరామ రథయాత్రకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అనుమతి ఇవ్వకడాన్ని సవాల్ చేసిన కేసులో బుధవారం వాదనలు ముగిసిన విషయం విదితమే. ఈనెల 18న ఉగాదిని పురస్కరించుకుని 31న హనుమాన్ జయంతి వరకూ బాసర నుంచి హైదరాబాద్‌లోని తాడ్‌బడ్ హనమాన్ ఆలయం వరకూ శ్రీరామ రథయాత్ర నిర్వహించాలంటే అన్ని చోట్లా పోలీసుల రక్షణ అవసరం ఉన్నందున వీహెచ్‌పీ పిటిషన్‌ను తోసిపుచ్చుతున్నట్లు గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణమూర్తి తీర్పు చెప్పారు.

రాజ్యసభ ఓటింగ్‌కు బీజేపీ దూరం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ కేంద్ర నాయకత్వం సూచన మేరకు శుక్రవారం జరిగే రాజ్యసభ ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనట్లేదని ఆపార్టీ తెలిపింది. రాష్ట్రంలో టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సమాన దూరంగా ఉండాలని నిర్ణయించినందున తమపార్టీ ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనబోరని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో టిఆర్ఎస్ ఎంపీలు సభా కార్యక్రమాలకు అడ్డుతగలడాన్ని తాము ఖండిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యాలయం పేర్కొంది. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు కనీసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే, నిరసన తెలిపే అవకాశాన్ని కూడా శాసనసభలో ఇవ్వని టిఆర్ఎస్ పార్టీ... లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలకు ఎలా అడ్డుతగులుతుందని ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల డిమాండ్‌ను కోర్టులు కొట్టివేశాయని, అది రాజ్యాంగ విరుద్ధమని తెలిసి కూడా ఓట్ల కోసం టీఆర్ఎస్ డ్రామా ఆడుతున్నదని విమర్శించారు.

ఆర్టీసీ జేడీ వెంకట్రావుకు డాక్టరేట్


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



టీఎస్‌ఆర్టీసీలో జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ)గా పనిచేస్తున్న టి వెంకట్రావు డాక్టరేట్ సాధించారు. ఈ విషయాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం ప్రకటించింది. 'పోలీస్ అండ్ లా-ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ కాన్‌స్టిట్యూషనల్ అండ్ హ్యూమన్ రైట్స్ డైమెన్షన్స్' అనే అంశంపై ఆయన పరిశోదన చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ టి విజయచంద్ర పర్యవేక్షణలో ఆయన పరిశోధన సాగించి, సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వెంకట్రావు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా కుంటల మండలం అంబకాంతి గ్రామం. ఆయన 1976లో పోలీస్‌శాఖలో ఎస్ఐగా ఉద్యోగంలో చేరారు. అంచలంచెలుగా ఎదుగుతూ అనేక హెూదాల్లో కొనసాగారు.

అమిత్‌షా కోసమే నయీమ్ ఎన్‌కౌంటర్

- జస్టిస్ లోయ మృతి వెనుక 'షా'
- నయీమ్ డైరీని బయటపెట్టాలి
- ఆ కేసులో మొదటి నిందితుడు కేసీఆరే : నారాయణ



నవతెలంగాణ- యాదాద్రిభువనగిరి ప్రతినిధి

సోహ్రబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో నిందితుడైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సీబీఐ కేసు నుంచి బయట పడేందుకు.. కీలక సాక్షిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ నయీమ్‌ను ఎన్‌కౌంటర్ పేరుతో అంతమొందించారని సీపీఐ జాతీయయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిచందర్‌తో కలిసి మాట్లాడారు. నయీమ్ బతికి ఉంటే అమిత్‌షా సోహ్రబుద్దీన్ కేసులో కచ్చితంగా జైలుకు వెళ్లేవాడన్నారు. రాజకీయంగా ఇబ్బంది రావచ్చుననే భయంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కనుసన్నల్లో ఉన్న నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఎస్ఐబీలతో నయీమ్‌ను ఎన్‌కౌంటర్ చేయించాయి కానీ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి కాదన్నారు. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి లోయ అనుమానాస్పద మృతి వెనుక కూడా అమిత్‌షా కుట్ర దాగి ఉందన్నారు. రూ.100 కోట్లు ఇస్తామని ఆశ చూపినా లొంగకపోవడంతో పథకం ప్రకారం జస్టిస్ లోయను చంపేశారని ఆరోపించారు. నయీమ్‌తో అంటకాగిన దోషులను ఎంతటివారైనా వదిలిపెట్టబోమని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్ తలమాసిన వాళ్లను తప్ప అసలు దోషులను అరెస్టు చేయలేదన్నారు. దోషులను కాపాడే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్ నయీమ్ కేసులో మొదటి నిందితుడు అవుతాడన్నారు. నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాదిన్నర కావస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. నయీమ్ డెన్‌లో దొరికిన నగదు, బంగారం, స్థలాల డాక్యుమెంట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. నయీమ్ ఆగడాల్లో భాగస్వామ్యం ఉన్న పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఉన్న రాజకీయ నేతలు, అధికారులను దోషులుగా తేల్చాలంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నయీమ్ డైరీని ఎందుకు దాచి పెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దమ్ముంటే వెంటనే డైరీని బయట పెట్టాలని సవాల్ చేశారు. 197 కేసులను నమోదు చేసి విచారణ చేసిన సిట్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

నయీమ్ కేసులను నీరుగార్చడానికే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నాగిరెడ్డితో సిట్ వేసిందని ఆరోపించారు. పోలీసుల కనుసన్నుల్లో ఉన్న శేషన్ననూ నయీమ్ స్థానంలో భర్తీ చేయడానికి పోలీసులు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రాంచంద్రయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మలేశం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నయీమ్ బాధితులు జగదీష్, సత్యనారాయణ ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

- హైదరాబాద్ ధూల్‌పేట్‌లో ఘటన

నవతెలంగాణ - ధూల్‌పేట్

ట్యూషన్ నుంచి వస్తున్న బాలికపై ఓ బాలుడు లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన గురువారం హైదరాబాద్‌లోని ధూల్‌పేట రేయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎంఏ.జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా కాలనీకి చెందిన ఓ బాలిక (12) స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే స్కూల్ నుంచి వచ్చిన బాలిక సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఓ బాలుడు(17) ఆమెను బలవంతంగా పక్కనే ఉన్న ఇంటి మిద్దెపైకి లాక్కెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి బాలుడిని అదుపులో తీసుకుని జువైనల్‌కు తరలించారు.

చట్టబద్ధ సౌకర్యాలు యాజమాన్యమే కల్పించాలి

- కాంట్రాక్టు కార్మికుల విషయంలో స్పష్టం చేసిన కార్మికశాఖ
- సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ ఏప్రిల్ 9కి వాయిదా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపైనే ఉందని కార్మిక శాఖ అధికారులు స్పష్టం చేశారు. సింగరేణిలోని అన్వేషణ(ఎక్స్‌ప్లోరేషన్) విభాగంలో పనిచేస్తున్న సీఎల్స్, సెక్యూరిటీగార్డులు మరియు కన్వెయన్స్ డ్రైవర్ల సమస్యలపై హైదరాబాద్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్(సెంట్రల్) సమక్షంలో గురువారం చర్చలు జరిగాయి. చర్చల్లో యాజమాన్యం తరపున సీనియర్ జియాలజిస్ట్ హరిప్రసాద్, యూనియన్ తరపున సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి బి మధు, కాంట్రాక్టర్లు జీబీ పౌడెల్, వీఆర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాంట్రాక్టు కార్మికులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, వారికి కాంట్రాక్టర్లకే సంబంధం ఉందనీ సింగరేణి యాజమాన్యం వాదించింది. యాజమాన్యం తమకేదీ ఇస్తే అదే కార్మికులకు ఇస్తామని, తమ పాత్ర నామమాత్రమని కాంట్రాక్టర్లు చెప్పారు. యూనియన్ ప్రతినిధి మధు మాట్లాడుతూ... ఎక్స్‌ప్లోరేషన్‌లో సీఎల్స్‌తో నైపుణ్యంతో కూడిన పనులు చేయిస్తూ, అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారని చెప్పారు. కార్మికులకు రక్షణ పరికరాలు, సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకు పనిచెప్పడం, పర్యవేక్షణ చేయడం అంతా ఎక్స్‌ప్లోరేషన్ అధికారులే నిర్వహిస్తున్నారనీ, కాబట్టి సమస్యల పరిష్కారం బాధ్యత కూడా ప్రధాన యజమానిగా ఉన్న వారిపైనే ఉందని కార్మికశాఖ అధికారులకు వివరించారు. దీనికి కార్మికశాఖ అధికారులు స్పందించారు. ఎక్స్‌ప్లోరేషన్‌లో కార్మికులు ఏఏ పనులు చేస్తున్నారు..? వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు..? తదితర వివరాలను వెంటనే సమర్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. చర్చలను ఏప్రిల్ 9కి వాయిదా వేశారు.

సుప్రీంతీర్పును సమీక్షించాలి: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ లైంగిక నిరోధక చట్టాన్ని నీరుగార్చే సుప్రీంతీర్పును సమీక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె భాస్కర్, స్కైలాబ్‌బాబు కోరారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చట్టంతో దళిత, గిరిజనులు కొంత ఉపశమనం పొందారని, అలాంటి చట్టంలో మార్పులు తీసుకొస్తే వారిపై మరిన్ని దాడులు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి: జాక్టో

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న స్వల్ప సంఘటనలను ప్రధాన బూచిగా చూపుతూ అకారణంగా టీచర్లను సస్పెన్షన్లు చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) తెలిపింది. ఈమేరకు గురువారం ఎస్టీయూ భవన్‌లో జాక్టో స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాక్టో నాయకులు ఈ రఘునందన్ మాట్లాడుతూ...ఎక్కడైనా పొరపాట్లు జరిగితే పరీక్షల విధుల నుంచి ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని సూచించారు. ఇప్పటివరకు ఉపాధ్యాయులపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


ఉత్తమ ప్రవాస తెలంగాణ వాది' విజేత గా రాయదాస్ మంతెన



న్యూయార్క్: సప్త సముద్రాల అవతల ఉన్నా తనను కనిపెంచిన భూమిని మరవని తెలంగాణ బిడ్డ అతను. దశబ్దాల వెనకబాటు వెక్కిరించినా విధిని దిక్కరించిన విజేత అతను. నీ ఉనికే ప్రశ్నారకం అయిన చోట, నీది గాని దేశంలో గెలుపు గుర్రం ఎక్కడం దేశం గాని దేశం లో అసాధ్యం. తనది కాని ప్రాదేశిక ప్రాంతం లో ప్రవాసుల మధ్య తన వైయుక్తిక అభిరుచి అందరిలో బిన్నంగా నిలబెట్టింది అతనిని అతనే రాయదాస్ మంతెన. ఇటీవల 'తెలంగాణ కబుర్లు' అనే వెబ్సైటు నిర్వహించిన ఆన్లైన్ సర్వే లో ఉత్తమ ప్రవాస తెలంగాణ వాసి బెస్ట్ ఎన్‌ఆర్ఐ గా గెలుపొందాడు. దశబ్దాలుగా తెలుగు వాళ్ళు ప్రవాసులుగా ఉన్నా తెలుగు వాళ్ళలో తెలంగాణ ప్రతినిత్యం కనబడకుండా వినబడకుండా చేసారు. ఆస్ట్రేలియా, డెన్మార్క్,దుబాయ్,అమెరికా,లండన్ దేశాలలో స్థిరపడ్డ తెలంగాణ వాసుల ఆకాంక్ష పట్ల వారి పనితీరుమీద ఆధారపడి చేసిన ఈ సర్వే లో నిజామాబాద్ జిల్లా మాచర్ల గ్రామ వాసి 'రాయదాస్ మంతెన' అత్యదిక జనాదరణ కలిగిన 'ప్రవాస తెలంగాణ వాసిగా ఎన్నికయ్యాడు. ప్రాధమిక విద్యను నిజామాబాద్ లో, ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాల లో కంప్యూటర్ సైన్సు పట్టభద్రుడు అయిన న్యూ హ్యాంప్‌షైర్ లో ఫ్రాన్సిన్ పియర్స్ విశ్వవిద్యాలయం లో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివి రెండు దశాబ్దాల కింద అమెరికాలో వెర్మాంట్ లో స్థిరపడ్డాడు. ఆయన అమెరికాలోని మొదట మోర్గాన్ స్టాన్లీ లో ప్రస్తుతం ప్రసిద్ధ వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ లో అగ్రగామి సంస్థ అయిన జేపీ మోర్గాన్ చేజ్ కి వైస్ ప్రిసిడెంట్ గా పనిచేస్తున్నారు. గడిచిన రెండు దశాబ్దాలుగా ఆయన మలివిడత తెలంగాణ ఉద్యమానికి అనేక సహాయం సహకారాలు అందించిన ఆయన పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు బాల, మహిళా సంక్షేమ, విద్య వైద్య రంగాలకు ఇతోధికంగా సహకరిస్తున్నాడు. ఉత్తమ ప్రవాస తెలంగాణ గా గెలుపొందిన ఆయనను పలువురు తెలంగాణ అభిమానులు అభినందించారు.

బాధిత కుటుంబానికి జూలకంటి అండ

- యాజమాన్యంతో చర్చలు
- రూ. 8.30లక్షల పరిహారానికి అంగీకారం



యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న రంగారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

సూర్యతేజ రైస్‌మిల్లులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు బుధవారం మృతిచెందిన కార్మికురాలు కుర్ర నర్సమ్మ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అండగా నిలిచారు. యాజమాన్యం నుంచి 8లక్షల 30వేల రూపాయల పరిహారం ఇప్పించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామ సమీపంలోని సూర్యతేజ రైస్‌మిల్లులో పని చేస్తున్న క్రమంలో కుర్ర నర్సమ్మ చీర మిషన్‌లో చుట్టుకొని మృతిచెందింది. ఆమె భర్త రెండు నెలల కిందటే రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దాంతో నర్సమ్మ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. ఒక కుమార్తెకు వివాహం చేసింది. మరో కుమార్తె ఉంది. ఇప్పుడు నర్సమ్మ కూడా చనిపోవడంతో చిన్న కుమార్తె ఒంటరైంది. ఈ విషయం తెలుసుకున్న జూలకంటి రంగారెడ్డి సీఐటీయూ నాయకులతో కలిసి యాజమాన్యంతో చర్చలు జరిపారు. మృతురాలి కుమార్తె జీవనాధారం, వివాహానికి అవసరమైన సహాయం అందేలా చూడాలని కోరారు. రూ.8.30 లక్షలు పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించింది.

గ్లాస్‌గొ నైట్‌క్లబ్‌లో అగ్ని ప్రమాదం

- భారీ ఆస్తినష్టం, తప్పిన ప్రాణ నష్టం

స్కాట్లాండ్ : గ్లాస్‌గొ నైట్‌క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో భారీ ఆస్తినష్టం సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో నైట్‌క్లబ్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు దావానలంలా వ్యాపిస్తున్నాయని, మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి. విక్టోరియా వీధిలో ముమ్మర సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన ప్రాంతంలోని ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని అన్నారు.

కొత్త బ్లాక్‌హోల్స్‌కు 'స్టీఫెన్ హకింగ్' పేరు

మాస్కో : రష్యన్ వ్యోమగాములు ఓ కొత్త బ్లాక్ హోల్‌ను ఆవిష్కరించారు. తన జీవితమంతా అంతరిక్ష పరిశోధనలకు కేటాయించిన ప్రఖ్యాత బ్రిటీష్ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హకింగ్ పేరును బ్లాక్ హోల్‌కు పెట్టారు. కొత్తగా కనిపెట్టిన బ్లాక్‌హోల్ ఓఫికస్ నక్షత్రాలు కూటమిలో ఉన్నట్టు కనుగొన్నారు. సరిగ్గా స్టీఫెన్‌హకింగ్ చనిపోయిన రెండు రోజుల తర్వాత ఈ విషయం కనిపెట్టారు. మాస్కో స్టేట్‌యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొంతకాలంగా నక్షత్రాల కూటమిలో గామా కిరణాల పేలుళ్లను(జీఆర్‌బీ) పరిశీలిస్తున్నారు. నక్షత్రం కూలిపోవటం వల్లే పేలుడు సంభవించిందని, దాని స్థానంలో బ్లాక్ హోల్ ఏర్పడటానికి పరిస్థితులు దారితీశాయని వెల్లడించారు. గామా-రే ఖగోళ శాస్త్రంలో.. గామా-రే పేలుళ్లు చాలా శక్తివంతమైన పేలుళ్లు అని, సుదూరంలో ఉన్న గెలాక్సీలను కూడా అవి మింగేస్తాయని తెలిపారు. పేలుళ్ల సమయంలో విడుదలయ్యే శక్తిని టెలిస్కోపు ద్వారా బంధించడం కూడా దాదాపు అసాధ్యమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సెకనులో పదో వంతు నుంచి మిల్లీ సెకండ్ సమయంలో మాయమైపోతాయని అన్నారు. కానీ అదృష్టవశాత్తు రష్యాన్ వ్యోమగాములు ఈ దృశ్యాన్ని బంధింపగలిగారని రష్యన్ టైమ్స్ పత్రిక పేర్కొంది.

యూజర్ల సమాచారాన్ని రహస్యంగా ఉంచుతాం : జుకర్‌బర్గ్

వాషింగ్టన్: కోట్లాది మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమైందంటూ ప్రముఖ సోషల్‌మీడియా వెబ్‌సైట్ ఫేస్‌బుక్‌పై గత కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరోపణలపై ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఎట్టకేలకు స్పందించారు. యూజర్ల సమాచారాన్ని రహస్యంగా ఉంచడంలో కంపెనీ నుంచి పొరబాటు జరిగిందని జుకర్‌బర్గ్ అంగీకరించారు. అయితే, తమ పొరబాటును సరిదిద్దుకుంటున్నామని తెలిపారు.



భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డెవలపర్లు, బిజినెస్ భాగస్వాములతో కలిసి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ మేరకు తన ఫేస్‌బుక్ ఖాతాలో సుదీర్ఘ పోస్టు పెట్టారు. 'ఫేస్‌బుక్‌ను నేను ప్రారంభించాను. మా ప్లాట్‌ఫాంపై ఏం జరిగినా అందుకు నేను బాధ్యత వహించాల్సిందే. యూజర్ల డేటాను భద్రంగా ఉంచే బాధ్యత మాపై ఉంది.

ఒకవేళ అలా చేయలేకపోతే మీకు సేవలందించే అర్హత నేను కోల్పోయినట్లే. అయితే, మేము కూడా పొరబాట్లు చేస్తుంటాం. ఏం జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. మరోసారి ఇలాంటివి జరగకుండా పొరబాటును సరిదిద్దుకుంటున్నాం. యూజర్ల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటాం. అన్ని యాప్‌లను పరిశీలిస్తాం. ఏదైనా యాప్ అనుమానాస్పదంగా కన్పిస్తే దానిపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహిస్తాం. అంతేగాకుండా, ఒక వ్యక్తి మూడు నెలలుగా ఫేస్‌బుక్‌ను వినియోగించకపోతే ఆ వ్యక్తి డేటాను తెలుసుకోకుండా ఉండేలా డెవలపర్ యాక్సెస్‌ను తొలగిస్తాం. దీంతో పాటు ఫేస్‌బుక్ ఖాతాను తెరిచే సమయంలో అడిగే వివరాలను కూడా తగ్గిస్తాం. పేరు, ఈమెయిల్ ఐడీ, ప్రొఫైల్ ఫొటో మాత్రమే అడిగేలా యప్‌ను మారుస్తాం. త్వరలోనే మరిన్ని మార్పులతో మీ ముందుకు వస్తాం' అంటూ జుకర్‌బర్గ్ చెప్పుకొచ్చారు. భారత్, బ్రెజిల్ దేశాల ఎన్నికల్లో ఫేస్‌బుక్ యూజర్ల డేటా దుర్వినియోగం కాకుండా ఉండేలా చూస్తాం అని అన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా.. ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని దుర్వినియోగం చేసిందంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో గత కొన్ని రోజులుగా ఫేస్‌బుక్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఈ విషయమై అమెరికాలోని శాన్‌జోస్ కోర్టులో కేసు కూడా నమోదైంది.

మరోవైపు ఈ వ్యవహారం విషయంలో భారత్ కూడా ఫేస్‌బుక్‌ను గట్టిగా హెచ్చరించింది. భారత ఎన్నికల ప్రక్రియల్లో అక్రమ మార్గాల ద్వారా జోక్యం చేసుకుంటే సహించేది లేదని కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. అలా జరిగితే కఠిన చర్యలు తీసుకునేందుకూ వెనుకాడబోమని.. అవసరమైతే జుకర్‌బర్గ్‌కు సమ్మన్లు పంపుతామని అన్నారు. ఇలా వరుస ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో జుకర్‌బర్గ్ క్షమాపణలు తెలిపారు.

చెక్ రిపబ్లిక్‌లోని కెమికల్ ప్లాంట్‌లో పేలుడు

- ఆరుగురు మృతి



ప్రేగ్ : చెక్ రిపబ్లిక్‌లోని యునీ పెట్రోల్ రసాయనిక కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. రీజినల్ ఫైర్ సర్వీస్ అధికార ప్రతినిధి వ్లాదిమీర కెరెకోవా తెలిపిన వివరాల ప్రకారం...యునీపెట్రోల్ కెమికల్ ప్లాంట్‌లో గురువారం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఆరుగురు మృతి చెందారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి. పేలుడు సంభవించిన యునీపెట్రోల్ కెమికల్ ప్లాంట్ జెక్ రిపబ్లిక్‌లో అతి పెద్దది. ఈ కర్మాగారంలో ప్లాస్టిక్ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు.

జూన్ 2 నాటికి కొత్త టీచర్లు

డిప్యూటీసీఎం కడియం శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జూన్ 2 నాటికి రాష్ట్రంలో కొత్తగా 8,792 మంది ఉపాధ్యాయులను నియమిస్తామని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. టీఆర్‌టీ పరీక్షలు అడ్డుకోవాలని కొన్ని రాజకీయ పక్షాలు ఎంత ప్రయత్నించినా.. తాము సమర్థవంతంగా నిర్వహించామని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయడానికి ప్రభుత్వం జారీచేసిన జీవోనెంబర్ 16పై కొందరు కోర్టుకు వెళ్లడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని అన్నారు. అందుకే తామువారికి గౌరవ వేతనాలను పెంచామని చెప్పారు. శాసనసభలో గురువారం పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా కడియం మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలవిద్య, ఉన్నతవిద్య, సాంకేతికవిద్యలో తాము తీసుకుంటున్న నిర్ణయాలను ఆయన వివరించారు. నాణ్యమైన విద్యను అందించడానికి తాము రాష్ట్రవ్యాప్తంగా 524గురుకులాలు ప్రారంభించినా... ప్రతిపక్షాలు ఇంకా కేజీ టు పీజీ అంటున్నారని విమర్శించారు. తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్రం దుస్తులు ఇవ్వడం లేదని, ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వమే 5.17 లక్షల మంది విద్యార్థులకు యూనిఫారాలు ఇస్తామని, ఇందుకోసం రూ.34.31కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు.

సహకరించని కేంద్రం

విద్యాసంస్థల కోసం తాము ఎంత ప్రయత్నించినా...కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదన్నారు. 'బేటీబచావో్..బేటి పడావో' అంటూ ప్రధానమంత్రి మోడీ గొప్పగా ప్రకటించారని, కానీ అది నినాదంగానే మిగిలిందన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 12వ తరగతి వరకూ క్లాసులు పెంచాలని కోరినా...కేంద్రం మౌనంగా ఉందన్నారు. మోడల్ స్కూళ్లను ఎత్తివేసిందన్నారు. దీని కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా రూ.300కోట్ల భారం పడుతోందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ..మైనార్టీల కోసం 230 గురుకులాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

పూర్తి ఫీజును పరిశీలిస్తాం; జోగు రామన్న

ఎస్సీ,ఎస్టీ, మైనార్టీల మాదిరిగా బీసీ విద్యార్థులకు కూడా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించే అంశాన్ని పరిశీలిస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. కులవృత్తుల రక్షణ కోసం తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ ఫెడరేషన్లకు రూ.1672 కోట్లు కేటాయించామన్నారు. అర్హులైన వారికి బీసీ కుల ధృవీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు.

'మాదాసు'కు ఎస్సీ ధృవీకరణపై సందిగ్ధం: జగదీశ్‌రెడ్డి

మాదాసు కులానికి ఎస్సీ సర్టిఫికెట్ అందించే అంశంపై సందిగ్ధం నెలకొందని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. మాదాసు కులానికి చెందిన వారు తాము కురుమలని పేర్కొంటూ ఇటీవల గొర్రెలను తీసుకున్నారని చెప్పారు. కళ్యాణలక్ష్మి కింద ఇప్పటివరకూ రూ.459.49 కోట్లు చెల్లించామన్నారు. దళితులకు మూడెకరాల భూమి కోసం రూ.554కోట్లు వెచ్చించామని, స్వయం ఉపాధి కోసం రూ.737కోట్లు, గుడుంబా తయారీదారుల పునరావాసం కోసం రూ.20 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.

9,522 ఇండ్లు నిర్మించాం: ఇంద్రకరణ్‌రెడ్డి

డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పథకంలో ఇప్పటివరకూ 9,522 ఇండ్లను నిర్మించామని గృహ నిర్మాణ శాఖ మంత్రి



ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 2,72,763 ఇండ్లు మంజూరు చేశామని, ఇందులో 2,19,699 ఇళ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని., 1,78,503 ఇండ్లకు అగ్రిమెంట్ పూర్తయిందన్నారు. 1,50,542 ఇండ్లను ప్రారంభించగా..ఇందులో 9552 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. మొత్తం రూ.12.77 కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. మిగిలిన అన్ని ఇండ్లను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజన శాఖ మంత్రి చందులాల్ వివరాలు వెల్లడించారు. చర్చ తర్వాత పలు ఆర్థిక పద్దులకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. అనంతరం స్పీకర్ అసెంబ్లీని రేపటికి వాయిదా వేశారు.

నేడు రాజ్యసభ స్థానాలకు పోలింగ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరుగనుంది. టీఆర్‌ఎస్ పార్టీ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు అభ్యర్థిగా పోటీలో నిలిచారు. టీఆర్‌ఎస్ నుంచి సంతోష్, లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్, కాంగ్రెస్ నుంచి బలరాం నాయక్ బరిలో ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కుపు ఉంటుంది. అభ్యర్థులతో పాటు నోటాకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కావడంతో 117 మంది ఎమ్మెల్యేలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యేలు ఓటు వేయనున్నారు. అయితే బీజేపీ, టీడీపీ, సీపీఐ(ఎం) పోలింగ్‌కు దూరంగా ఉన్నాయి. టీఆర్‌ఎస్‌కు ఎంఐఎం మద్దతు తెలిపింది. ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ పర్యవేక్షించనున్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ శాసనసభ్యులు మాక్‌పోలింగ్ నిర్వహించారు. నమూనా పోలింగ్‌కు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఉదయం 7.30 గంటలకే మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణభవన్‌కు చేరుకోవాలని, బస్సులో అసెంబ్లీకి చేరుకున్న తర్వాత అందరూ ఒకేసారి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని పెట్టడం దౌర్భాగ్యం : కేసీఆర్

అసెంబ్లీలో బలం లేకున్నా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని నిలబెట్టడం దౌర్భాగ్యమని సీఎం కేసీఆర్ అన్నారు. మూడో సర్వే ఫలితాలు కూడా టీఆర్‌ఎస్‌పార్టీకి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. త్వరలో జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించబోతున్నట్టు చెప్పారు.

డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనం రూ.300లకు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనం రూ.100 నుంచి రూ.300లకు పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రంలో 184 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 72 గంటలు పనిచేస్తే వారికి నెలకు రూ.21,600 గౌరవ వేతనం అందుతుందని పేర్కొన్నారు. రూ.21,600 గౌరవ వేతనం పెరగకుండా సీలింగ్ విధించామని తెలిపారు. గౌరవ వేతనం పెంచాలని గెస్ట్ ఫ్యాకల్టీ ఎప్పటినుంచో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న విషయం తెలిసిందే.

కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం హర్షం

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవం వేతనం పెంచడం పట్ల కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం హర్షం ప్రకటించింది. సంఘం అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నల్లగొండ పార్లమెంటుకు కేసీఆర్

కోమటిరెడ్డి పతనం ఆరంభమైంది :వేముల వీరేశం

హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేసే అవకాశాలున్నాయని వేముల వీరేశం తెలి పారు. గురువారం నిర్వహించిన విలేకరుల చిట్‌చాట్‌లో ఆయన పలు విష యాలు వెల్లడించారు. జాతీయ రాజకీయాలకు సీఎం వెళుతున్నందున, నల్ల గొండ పార్లమెంటు స్థానం నుండి కేసీఆర్ పోటీ చేస్తారా? అని అడిగిన ప్రశ్న కు అవకాశం లేకపోలేదన్నారు. నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పతనం ఎప్పుడో ఆరంభమైందన్నారు. కోమటిరెడ్డి చేసేవన్నీ దొంగ దీక్షలు, దొంగ నాటకాలని అన్నారు. ఉపఎన్నికలు ఆపాలని కాంగ్రెస్ నేతలు కోర్టును ఆశ్ర యించినప్పుడే వారికి గెలుపుపై నమ్మకం పోయిందన్నారు. కోమటిరెడ్డి గన్‌మెన్ల ఉపసంహరణ వెనుక ఎలాంటి రాజకీయమూ లేదన్నారు. అక్కడ ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా భూపాల్‌రెడ్డే టీఆర్‌ఎస్ అభ్యర్థి అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఓడిపోవడం ఖాయమని వీరేశం జోస్యం చెప్పారు. మందకష్ణ గురించి పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదన్నారు.

ఇంటిపార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం

హైదరాబాద్ : చెరకు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలంగాణ ఇంటిపార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం లభించింది. ఇంటిపార్టీ పేరుతో దరఖాస్తు కోగా, కేంద్ర ఎన్నిలక సంఘం క్లియరెన్స్ ఇచ్చినట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సడలించొద్దు

తెలంగాణ గిరిజన సంఘం విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సడలించొద్దని తెలంగాణ గిరిజన సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. చట్టం సరవణ చేస్తే చట్టం కింద నమోదైన కేసుల్లో తక్షణం అరెస్టు చేయడానికి వీలులేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ధర్మానాయక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలపై అనేక అత్యాచారాలు, దాడులు, వివక్ష కొనసాగుతున్నాయనీ, బీజేపీ హయాంలో ఈ దాడులు మరింత పెరిగాయని పేర్కొన్నారు. ప్రధానంగా దళిత, గిరిజనులకు ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయించిన నిధుల వినియోగం కూడా సక్రమంగా జరిగే అవకాశం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో సవరణలు చేస్తే చట్టం నీరుగారి పోయే ప్రమాదం ఉందన్నారు.

వేతనాలు పెంచినందుకు ధన్యవాదాలు : టీఆక్టా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెంచుతున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం పట్ల తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (టీఆక్టా) హర్షం ప్రకటించింది. ఈ మేరకు టీఆక్టా అధ్యక్షుడు ఎం రామేశ్వరరావు నేతృత్వంలో గురువారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనం 75 శాతం పెంచుతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని ప్రకటించారు.

గీతంకు స్వయంప్రతిపత్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పూర్తి స్వయంప్రతిపత్తి హోదాను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 62 ఉన్నత విద్యాసంస్థలు, విశ్వ విద్యాలయాలకు ఈ హోదా కల్పించింది. అత్యుత్తమ విద్యాసంస్థల్లో ఒకటిగా గీమ్ నిలవడం సరికొత్త చరిత్ర సృష్టించిందని ఉపకులపతి ప్రొఫెసర్ ఎంఎస్ ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ హోదా పొందడం ద్వారా గీతం అవసరాలకు అనుగుణంగా సొంతం గా కొత్త కోర్సులు, ప్రాంగణాలు, నైపు ణ్యాలను పెంపొందించే కోర్సులు, పరిశోధనా కేంద్రాలు ప్రారంభించేందు కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.


విదేశీ అధ్యాపకుల నియామకం చేపట్టేందుకు విదేశీ విద్యార్థులను చేర్చుకునేందుకు, దూరవిద్య కోర్సుల నిర్వహణకు వీలవుతుందని తెలిపారు. విద్యాపరమైన ఒప్పందాల విషయం లో స్వేచ్ఛ లభించనుందని పేర్కొన్నా రు. యూజీసీ నిర్ణయంపై విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అన్ని జిల్లాల్లో 'గులాబీ' గూళ్లు

- ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి పేర దరఖాస్తు
- ఒకేసారి 30 జిల్లాల్లో నిర్మాణం
- ఎకరం నుంచి 2 ఎకరాల మేర ప్రతిపాదన
- అన్ని విలువైన భూములే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్‌ఎస్) పార్టీ కార్యాలయాలను నిర్మించాలని ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు కార్యాచరణ చేపట్టాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. సీఎం చెప్పిందే తడవుగా యుద్ధప్రాతిపదికగా తెలంగాణ భవన్ రాష్ట్ర కార్యాలయం వ్యవహారాలు చూసే కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎం. శ్రీనివాసరెడ్డి చురుగ్గా చర్యలు చేపట్టారు. ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి అయిన మహ్మద్ మహమూద్ అలీకి జనవరి 21న దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రతిపాదనలు పంపించారు. ఆయా జిల్లాల్లో టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, కీలక నాయకత్వం ఎక్కడ భూములు ఉన్నాయో ఇప్పటికే గుర్తించారు. ఆమేరకు దరఖాస్తు వెంట ఆ జాబితాను సైతం జతచేశారు. ఈనేపథ్యంలో ఒక్కో జిల్లాలో ఎకరం నుంచి 2 ఎకరాల వరకు పార్టీ కార్యాలయాల కోసం భూములు కేటాయించాలని ప్రతిపాదనలను ఆయా జిల్లా కలెక్టర్లకు అందజేశారు. యుద్ధప్రాతిపదికన కలెక్టర్ల ద్వారా ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని పార్టీ శ్రేణులపై ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి సూచించారు. అలాగే ముఖ్యమంత్రి పేషీ కార్యదర్శి స్మితసభర్వాల్ కార్యాలయం నుంచి కూడా కలెక్టర్లకు ఒకటికి పలుమార్లు ఫోన్లు వచ్చినట్టు తెలిసింది. టీఆర్‌ఎస్ కార్యాలయాల ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయం కోసం రాజేంద్రనగర్‌లో మైలార్‌దేవ్‌పల్లిలోని సర్వే నెంబరు 166లో 1-30 ఎకరాలు ప్రతిపాదించారు. అలాగే హైదరాబాద్ జిల్లా పరిధిలోని బండ్లగూడలో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. దీనికి



ఫైల్

సంబంధించిన ఫైలును ఆగమేఘాలమీద పంపాలని సీఎం పేషి నుంచి ఒత్తిడి చేసినట్టు సమాచారం. దరఖాస్తులో పలు విషయాలను ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి పొందు పరిచారు. టీఆర్‌ఎస్ ప్రాంతీయ పార్టీ అని , 2001, ఏప్రిల్ 27న ఏర్పాటు చేసినట్టు వివరించారు. 2014 ఎన్నికల్లో అత్యధికంగా అసెంబ్లీ స్థానాలు గెలిచి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్టుగా చెప్పారు. 11 లోక్‌సభ సీట్లు, మూడు రాజ్యసభ స్థానాలు కలిగి ఉందని అందులో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యకలాపాల నిర్వహణకు కార్యాలయాలు అవసరమని, అందుకే భవనాల నిర్మాణానికి స్థలాలను కేటాయించాలని కోరారు. ఈమేరకు 30 జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సైతం దరఖాస్తుతోపాటు జతచేశారు. ఆ పార్టీ ప్రతిపాదించిన స్థలాలు అన్ని కీలకమైన ప్రాంతాల్లో ఉన్నాయని, అవి అత్యంత విలువైన భూములని తెలిసింది. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో హైదరాబాద్‌లోని బంజరాహిల్స్‌లో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం 'తెలంగాణభవన్'కు భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 వేల చదరపు అడుగుల స్థలం ఇచ్చారు. అప్పట్లో లీజు ప్రాతిపదికన గజానికి రూపాయి చొప్పున అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూమిని అందజేసింది. ఇదిలావుండగా 2019 ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగానే జిల్లాల్లో కార్యాలయాలు నిర్మించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. వచ్చే ఆరునెలల్లో కార్యాలయాలను ఎలాంటి పరిస్థితుల్లోనూ నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిసింది. భూములను ప్రభుత్వం కేటాయించడమే ఆలస్యం జనవరి నాటికి జిల్లాల్లో భవనాల నిర్మాణం పూర్తిచేసేందుకు ప్రయివేటు నిర్మాణ సంస్థలతో సంప్రదింపులు ఇప్పటికే పూర్తయినట్టు సమాచారం. ప్రస్తుత ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ తరహాలో యుద్ధప్రాతిపదికన జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్టు సమాచారం. అయితే తెలంగాణ భవన్ మాదిరిగా లీజు ప్రాతిపదికన భూములు తీసుకుంటారా ? లేదా మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేస్తారా ? అనే సంగతి తేలాల్సి ఉంది. దీనిపై రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే, తమకేమి తెలియదని చెబుతున్నారు.

నవచిత్రం



అల్లు అర్జున్



సుకుమార్

హ్యాట్రిక్ హిట్ కోసం..

'ఆర్య', 'ఆర్య 2' చిత్రాలతో అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంది. తాజాగా ఈ కాంబినేషన్ హ్యాట్రిక్ హిట్ కోసం మరోసారి కలిసి పని చేయబోతోందని సమాచారం. సుకుమార్ ప్రస్తుతం 'రంగస్థలం' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న ఈచిత్రం ఈ నెల 30న విడుదల ప్రేక్షకుల ముందుకు రానుంది. అల్లు అర్జున్ 'నాపేరు సూర్య –నా ఇల్లు ఇండియా'లో నటిస్తున్నారు. ఇది మే 4న రిలీజ్ కానుంది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలుస్తోంది.



కాజల్



కథానాయకులు నారా రోహిత్, శర్వానంద్, శ్రీవిష్ణులతో 'నీది నాది ఒకే కథ' చిత్ర బృందం

మంచి సినిమా మిస్ అయ్యాను

'నీది నాది ఒకే కథ' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో శర్వానంద్

శ్రీవిష్ణు, సాట్నా టైటస్ జంటగా, వేణు ఊడుగుల దర్శకత్వంలో అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకంపై ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నీది నాది ఒకే కథ'. నేడు (శుక్రవారం) ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ,'శ్రీవిష్ణు ఈ కథ చెప్పినప్పుడు నా స్నేహితుడు గుర్తొచ్చాడు. తను నేషనల్ లెవల్‌లో బాస్కెట్ బాల్‌కి సెలక్ట్ అయితే ఇంట్లో వాళ్ళు ఒప్పుకోకపోవడంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. అలాంటి వాళ్ళ జీవితాలను తెలిపే చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. 'ట్రైలర్ చూసి శ్రీవిష్ణుకి పెద్ద ఫ్యాన్ అయిపోయా. నా కథలాగా అనిపించింది. మార్నింగ్‌షోనే సినిమా చూడాలనే క్యూరియాసిటీతో ఉన్నాను. సినిమాను కొనాలనుకున్నప్పుడు అప్పటికే బిజినెస్ క్లోజ్ అయ్యిందని తెలిసి, మంచి చిత్రాన్ని మిస్ చేసుకున్నాననిపించింది. గత ఏడాది నుంచి కొత్త దర్శకులు ఇలాంటి మంచి కథలతో సినిమాలు చేస్తున్నారు. నారా రోహిత్ ఓ మంచి ఫ్రెండ్‌లా శ్రీవిష్ణుకి వెనకాల ఉంది సపోర్ట్ చేస్తున్నారు. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని శర్వానంద్ తెలిపారు.

శ్రీవిష్ణు చెబుతూ, 'దర్శకుడు వేణు ఈ కథ చెప్పినప్పుడు నా కథలాగే అనిపించింది. మా పక్కింట్లోనో లేక ఎదురింట్లోనో ఉండి ఈ కథ రాసుకున్నాడా అనిపించింది. నా కోసమైనా సినిమా చేయాలనిపించింది. ఎందుకంటే ఎప్పుడైనా నా జీవితాన్ని సినిమాగా చూసుకోవాలనిపిస్తే ఈ చిత్రాన్ని చూడొచ్చు. చూసిన వారంతా సినిమా భలేగా ఉందన్నారు. ఈ చిత్రాన్ని చేసినందుకు చాలా గర్వంగా ఉంది. చాలా మంది సొసైటీ కోసం చదువుతారు. మనకు నచ్చిన పని చేయడానికి ఇంట్లో వాళ్ళని ఒప్పించడానికి ప్రయత్నించాలి. ఒక అమ్మాయి వెనుకపడి ప్రేమ కోసమే ఒప్పించినప్పుడు జీవితం కోసం ఎంత ఒప్పించాలని చెప్పేదే ఈ సినిమా. తల్లితండ్రులు పిల్లల్ని నమ్మాలి. వాళ్ళు నమ్మకపోతే రేపు ప్రపంచం ఏం నమ్ముతుంది?, కాబట్టి చదువుని చదువులానే ఉంచుదాం' అని చెప్పారు.

'ఈ మధ్య కొత్త దర్శకులు ప్రభంజనం సృష్టిస్తున్నారు. అదే కోవలోకి వేణు ఊడుగుల కూడా రాబోతున్నాడని కచ్చితంగా చెప్పగలను' అని రాజ్ కందుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.నాగేశ్వర్‌రెడ్డి, దేవి ప్రసాద్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

బ్లాక్‌మెయిల్‌తో రీ ఎంట్రీ



ఊర్మిళ

థ్రిల్లర్ చిత్రాలకు, ప్రత్యేక పాటలకు కేరాఫ్‌గా నిలిచిన అలనాటి బాలీవుడ్ నటి ఊర్మిళ మరోమారు వెండితెరపై మెరవనున్నారు. దాదాపు నాలుగేండ్లు సినిమాలకు దూరంగా ఉన్న ఆమె తాజాగా హిందీలో 'బ్లాక్‌మెయిల్' చిత్రంలోని ఓ ప్రత్యేక పాటలో మెరిసారు. అభినయ్ డియో దర్శకత్వంలో ఇర్ఫాన్ ఖాన్ హీరోగా నటించిన ఈ చిత్రంలో 'బేవఫా బ్యూటీ..' అనే పాటలో స్టెప్పులేశారు. ఈ పాటను గురువారం చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. 'వాహ్.. రంగీలా. భామ ఇప్పటికీ అంతే అందంగా ఉంది. ఫరెవర్ గ్రీన్ ఊర్మిళను ఈ పాటలో చూశారా' అంటూ వర్మ ట్వీట్ చేశారు. రామ్‌గోపాల్ వర్మ రూపొందించిన 11 చిత్రాల్లో ఊర్మిళనే కథానాయిక. రెండు చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో మెరిశారు.

ఆ సినిమాతో గుడ్‌బై చెప్పాలనుకున్నా..

"లక్ష్మీ కళ్యాణం' చేసేటప్పుడు ఈ ఒక్క సినిమా చేసి ఇండస్ట్రీని వదిలేసి ఎంబీఏ చేయాలనుకున్నా. కానీ 'మగధీర' తర్వాత ఇదే నా జీవితమనే నిర్ణయానికి వచ్చేశాను' అని అంటోంది కాజల్. 'లక్ష్మీ కళ్యాణం'తో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమై 12ఏండ్ల కెరీర్‌లో 50కిపైగా చిత్రాల్లో నటించిన కాజల్ ప్రస్తుతం కళ్యాణ్ రామ్‌కి జోడీగా 'ఎంఎల్‌ఏ' చిత్రంలో నటించింది. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా కాజల్ గురువారంతో మీడియాతో ముచ్చటించింది. 'కళ్యాణ్ రామ్‌తో పదేండ్ల క్రితం నటించా. ఇన్నేండ్ల తర్వాత మళ్ళీ ఆయనతో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. అప్పటికీ, ఇప్పటికీ మాలో చాలా మార్పు వచ్చింది. నటులుగా పరిణతి సాధించాం. ఇండస్ట్రీలో మాకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నాం. కళ్యాణ్ రామ్ హార్డ్ వర్కర్, ఫోకస్డ్, డెడికేషన్‌తో వర్క్ చేస్తారు. ఈ సినిమాలో నేను ఎన్‌ఆర్‌ఐగా కనిపించే కార్పొరేట్ ఉద్యోగిని. అంతేకాదు నా పాత్రలో మరో షేడ్ ఉంటుంది. అదేంటనేది తెరపైనే చూడాలి. పాత్ర చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ఇందులో చదువు ప్రాధాన్యతను తెలిపే ఒక సందేశం ఉంటుంది. హార్డ్‌గా, మొట్టికాయ వేసినట్టుగా కాకుండా వినోదాత్మకంగా ఆ సందేశాన్ని చెప్పే ప్రయత్నం చేశాం. సినిమాలో మల్టీజోనర్స్ కనిపిస్తాయి. ఉపేంద్ర చాలా బాగా తెరకెక్కించారు. కచ్చితంగా ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. నా కెరీర్ విషయంలో, ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల విషయంలో హ్యాపీగా ఉన్నా. నా హార్డ్‌వర్క్, నిజాయితీ, దర్శక, నిర్మాతలు నమ్మకం, తెలుగు ప్రేక్షకుల ఆదరణ, సక్సెస్ ఇలా అనేక అంశాల సమాహారమే నేను ఇన్నేండ్లు విజయవంతంగా కొనసాగడానికి కారణం. ఇటీవల చాలా సెలక్టీవ్‌గా చేస్తున్నా. స్ట్రాంగ్ రోల్స్‌కే ప్రాధాన్యతనిస్తున్నా. అందులో ఒకటి 'అ'. ప్రయోగాత్మక చిత్రమిది. దక్షిణాదిలో అమేజింగ్ స్క్రిప్ట్స్ వస్తున్నాయి. కాబట్టి బాలీవుడ్‌కి వెళ్ళాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం 'క్వీన్' తమిళ రీమేక్‌లో, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చిత్రంలో నటిస్తున్నా. డేట్స్ లేకపోవడం వల్ల రవితేజ-శ్రీనువైట్ల చిత్రంలో చేయడం లేదు. కొత్తదనంతో కూడిన విభిన్న పాత్రలకే ప్రయారిటీ ఇస్తున్నా' అని కాజల్ తెలిపింది.

హ్యాపీడేస్‌ని గుర్తు చేసే ఆనందం



గురురాజ్

"ఆనందం' చిత్రాన్ని చూసిన ప్రతి ఒక్కరికి 'హ్యాపీడేస్'ను చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది' అని అంటున్నారు నిర్మాత గురురాజ్. మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై ఆర్.సీతారామరాజు సమర్పణలో గురురాజ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేడు(శుక్రవారం) ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురురాజ్ మీడియాతో సంభాషించారు. ఆ విశేషాలను ఆయన మాటల్లోనే..

చెబుతారు..కానీ ప్రోత్సహించరు..

కాలేజ్ స్టూడెంట్స్ పిక్నిక్‌కి వెళ్ళినప్పుడు చోటు చేసుకున్న మధురమైన సన్నివేశాలతో ఆద్యంతం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రమిది. సినిమా యూత్‌తోపాటు పెద్దలందరికీ కనెక్ట్ అవుతుంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరికి తమ కాలేజ్ రోజులను గుర్తు చేస్తుంది. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ చిన్న సినిమాలో మలయాళ స్టార్ నివిన్ పాలీ అతిథి పాత్రలో నటించడం సినిమాకు హైలైట్. మన వద్ద చిన్న సినిమాలను బతికించాలని చెబుతుంటారు. కానీ ఏ ఒక్క స్టార్ కూడా చిన్న సినిమాలకు ప్రోత్సాహాన్ని అందించరు. మలయాళంలో స్టార్ హీరోలు చిన్న సినిమాలకు అందించే సపోర్ట్‌కి ఈ చిత్రం ఒక ఉదాహరణ.

పోటీ ఉన్నప్పటికీ కథపై నమ్మకంతో..

కథను నమ్ముకుని కొత్త ఆర్టిస్టులతో కేవలం 4 కోట్లతో రూపొందిన ఈ సినిమా అక్కడ 20 కోట్లు కలెక్ట్ చేసింది. కథ బాగుంటే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారు. కంటెంట్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ హీరో సినిమానైనా రిజెక్ట్ చేస్తారు. కాబట్టి విడుదల విషయంలో పోటీ ఉన్నప్పటికీ కథపై నమ్మకంతో తెలుగులో విడుదల చేస్తున్నాం. రిలీజ్ విషయంలో కష్టాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు. 20ఏండ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నాం. నాకున్న మంచి పేరుతో మంచి థియేటర్లు దొరికాయి. ఈ సినిమా తెలుగు హక్కుల కోసం చాలా పోటీ ఉంది. కొందరు రీమేక్ చేయడానికి ఆసక్తి కూడా చూపించారు. కానీ ఫొటోగ్రఫీ, తీసిన విధానం అంత సహజంగా రాదని మేం కూడా అనువాదం చేశాం.

క్రేజీ స్ట్రయిట్ ప్రాజెక్ట్..

నటుడిని కావాలని ఇండస్ట్రీలోకి వచ్చా. కొన్ని సినిమాలు చేశా. నటుడిగా మనుగడ కష్టమైపోతుందేమో అని రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టాను. కానీ కళామతల్లిపై అభిమానం తగ్గలేదు. అందుకే సుఖీభవ మూవీస్‌ను స్థాపించి సినిమాలు నిర్మిస్తున్నా. మా బ్యానర్‌లో భారీ సినిమాలు చేయాలనుంది. మంచి కథ ఉన్నా, స్టార్ హీరోలు కాల్షీట్లు ఇవ్వరు. అందుకే కొన్ని రోజుల వరకు డబ్బింగ్ సినిమాలు చేయాలనుకుంటున్నా. అయితే త్వరలోనే స్ట్రెయిట్‌గా ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను చేయబోతున్నాం. ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం.

ట్రెండ్‌కి అనుగుణంగా ప్రశ్నిస్తా..



మనీష్‌బాబు, అక్షిత

మనీష్‌బాబుని హీరోగా పరిచయం చేస్తూ బి.శేషుబాబు సమర్పణలో జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై పి.సత్యారెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. రాజావన్నెంరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అక్షిత కథానాయిక. ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వైభవంగా జరిగింది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబీ క్లాప్‌నివ్వగా, జెమినీ కిరణ్ కెమెరా స్విచాన్ చేశారు. బి.గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'దర్శకుడు రాజా వన్నెంరెడ్డి మా అబ్బాయి మనీష్‌ను చూసి వెండితెరకు హీరోగా పరిచయం చేస్తానని చెప్పారు. గత రెండేండ్లుగా నటన, డైలాగ్స్ డెలివరీ, డాన్సుల్లో శిక్షణ ఇప్పించాం. దివ్యభారతిని గుర్తు చేసేలా మా కథానాయిక అక్షిత ఉంటుంది. మంచి సబ్జెక్ట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. నేటి ట్రెండ్‌కు అనుగుణంగా సందేశాత్మకంగా, టైటిల్‌కి తగ్గట్టుగానే ప్రశ్నించే విధంగా, వినోదాత్మకంగా ఉంటుంది' అని అన్నారు. 'సక్సెస్ వెంట పరిగెడుతున్న ఈ రోజుల్లో నిర్మాత సత్యారెడ్డి నన్ను నమ్మి తన కొడుకు మనీష్‌బాబుని నాకు అప్పగించినందుకు థ్యాంక్స్. నా గురువు దాసరిగారి ఆశీస్సులుంటాయని ఆశిస్తున్నా. గురువారం నుంచే రెగ్యులర్ షూటింగ్ జరుపుతున్నాం' అని దర్శకుడు తెలిపారు. హీరో మనీష్‌బాబు చెబుతూ, 'హీరో అవ్వాలన్న నా కోరికను గుర్తించి సినిమాను రూపొందిస్తున్నందుకు దర్శకుడికి రుణపడి ఉంటాను. మంచి కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నాం' అని చెప్పారు. 'ఇందులో నటించే అవకాశం ఇచ్చిన దర్శక,నిర్మాతలకు థ్యాంక్స్. మనీష్‌బాబుకి ఆల్‌ది బెస్ట్' అని హీరోయిన అక్షిత తెలిపింది.

కార్పొరేట్ ఆస్పత్రుల్లో అక్రమాలు

సెంచూరీ దవాఖానలో రోగం తెలియకుండా సర్జరీ

- వైద్యం వికటించి రోగి మృతి
- ఫిర్యాదు చేసినా ఆ ఆస్పత్రిపై చర్యలేవీ?: మండలిలో కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి ఆవేదన
- విచారణ జరుపుతున్నాం : మంత్రి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ ఆస్పత్రుల్లో అక్రమాలు జరుగుతున్నాయని అధికార పార్టీ సభ్యుడు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల పేరుతో నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకునే ముందు వైద్యవిద్యను అభ్యసించి సర్జరీలు సరిగా చేయకుండా, రోగుల ప్రాణాలు తీస్తున్న డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని సెంచూరీ దవాఖానలో రోగం తెలియకుండానే ఓ మహిళకు సర్జరీ చేయడం వల్ల వైద్యం వికటించి కిడ్నీలపై ప్రభావం చూపడంతో మరణించారని చెప్పారు. సెంచూరీ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని, ఆ డాక్టర్‌ను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరినా ఇంత వరకూ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార పార్టీ సభ్యుడు కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గర్భసంచిలో గడ్డ ఉందని ఓ మహిళా ఉపాధ్యాయురాలు సెంచూరీ దవాఖానలో చేరారని చెప్పారు. రోగం తెలియడానికి ప్రాథమికంగా కొన్ని పరీక్షలు చేసి నిర్ధారించుకున్న తర్వాతే సర్జరీ చేయాలని అన్నారు. ఇవేవీ పట్టించుకోకుండా రోగం తెలియకుండానే సర్జరీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. 15 రోజుల్లోనే మూడుసార్లు సర్జరీ చేశారని చెప్పారు. సెంచూరీ దవాఖానలో సర్జరీ వికటించడంతో గ్యాస్ట్రోఎంటరాలజీ సమస్య ఉందని చెప్పి ఏషియన్ గ్యాస్ట్రోఎంటరాలజీకి పంపించారని అన్నారు. అక్కడ గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్యుడు కాకుండా ఆంకాలజీ వైద్యుడు సర్జరీ చేశారని చెప్పారు. ఆ తర్వాత నిమ్స్‌కు తరలించారని వివరించారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో చేసిన సర్జరీలతో ఆమె కిడ్నీలపై ప్రభావం పడిందని అన్నారు. ఆ తర్వాత ఆమె మరణించారని చెప్పారు. ఈ సమస్యకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీకి, వైద్య శాఖ మంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశానని అన్నారు. ఇంత వరకు ఆ డాక్టర్ మీద, సెంచూరీ దవాఖాన మీద చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఏం జరిగినా తనదే బాధ్యత అని ఓ పత్రంపై ఆమె భర్త సంతకం చేశారని చెప్పారు. రూ.7 లక్షలు బిల్లు వేశారని, నాడు చెక్ ఇస్తే, సెంచూరీ దవాఖాన యాజమాన్యం చెక్ బౌన్స్ కింద ఆమె భర్తకు నోటీసులు పంపించిందని అన్నారు. అన్యాయంగా ఓ మహిళా ఉపాధ్యాయురాలిని సెంచూరీ దవాఖాన బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ వైద్యవిద్యను అభ్యసించకుండా ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. పదో తరగతి పూర్తయిన వారు, ఇంటర్ ఫెయిలైన వారు వైద్య వృత్తిని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని భానుప్రసాద్ సూచించారు. ఆర్ఎంపీ, పీఎంపీల కోసం ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెట్టాలని ఆలోచిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. ఆ సర్టిఫికెట్ ఉంటేనే వారు కొనసాగుతారని అన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందన్నారు. సెంచూరీ ఆస్పత్రి ఘటనపై విచారణ జరుగుతోందని చెప్పారు. నివేదిక రాగానే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఎవరైనా ఫిర్యాదు చేసుకునే అవకాశముందని అన్నారు.

కేసీఆర్ కిట్లతో పెరిగిన ప్రసవాలు

- శాసనమండలిలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

కేసీఆర్ కిట్ల పథకంతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. అనవసరపు ఆపరేషన్లను తగ్గించడం,, సాధ్యమైనంత వరకు సహజ ప్రసవాలతో పాటు శిశువులకు వంద శాతం టీకాలు వేయడం అనే లక్ష్యాల ప్రారంభమైన పథకం అందరి మన్ననలతో విజయవంతమైందని తెలిపారు.

శాసనమండలిలో కేసీఆర్ కిట్లపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. చర్చలో ఎమ్మెల్సీలు రామచంద్రరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పబావట్ రాములు నాయక్, ఎలిమినేటి క ష్ణారెడ్డి, ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి కేసీఆర్ కిట్ల లక్ష్యాలను, సాధించిన విజయాలను ప్రస్తావించారు.

సింగరేణిలో కార్మిక చట్టాలను అమలు చేయించండి..

- సీఎంకు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణిలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని.. సీపీఐ (ఎం) డిమాండ్ చేసింది. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని.. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం లేఖ రాశారు. సింగరేణిలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి.. డైరెక్ట్ పేమెంట్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. చట్టబద్ధ బోనస్‌లను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. 2013 జనవరి నుంచి అమలు కావాల్సిన కోలిండియా వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ జీవో 14 ప్రకారం వేతనాలను, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జెన్‌కోలో చెల్లిస్తున్న విధంగానే ఎన్టీపీసీలో పనిచేస్తున్న కార్మికులకు కూడా వేతనాలను చెల్లించాలని కోరారు. వేతనంతో కూడిన పండగ సెలవులు, గ్రాట్యుటీ తదితర చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేయాలని తమ్మినేని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా సింగరేణి ఆస్పత్రులలో ఉచిత వైద్య సౌకర్యాన్ని కల్పించాలని సీఎంను కోరారు.

బీజేపీకి నాగం గుడ్ బై

(మొదటిపేజీ తరువాయి)

ఇమడ లేకపోయారు. కాంగ్రెస్‌లో చేరి 2019 ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేసే విధంగా పావులు కదుపుతున్నారు, ఇప్పటికే ఆ పార్టీ అధిష్టానంతో వివిధ దఫాలుగా చర్చించి పార్టీలో చేరడానికి మార్గం సుగమం చేసుకున్నట్టు సమాచారం.

బీజేపీకి తెలంగాణలో అధికారం కలే..: నాగం

నాగం గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌లో ఇప్పటికే పలు ధఫాలుగా కార్యకర్తలతో సమావేశాలై వారి అభీష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకుంన్నట్టు తెలిపారు. జాతీయ రాజకీయాల్లో తనకు అడుగడుగునా అడ్డుతగిలిన బీజేపీ తెలంగాణలో ఎన్నటికీ అధికారంలోకి రాదన్నారు. రాష్ట్రంలో బీజేపీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని ఆయన విమర్శించారు.

'గీత'కు తీపి కబురు..

(మొదటిపేజీ తరువాయి)

సీఎం ఆకాంక్షించారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన గౌడలకు తీవ్ర అన్యాయం జరిగిందని కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చెట్టుపై నుండి పడి మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు పరిహారం చెల్లించటంలో ఆనాటి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఏర్పడే నాటికున్న మూడేండ్ల బకాయిలను తాము అధికారంలోకి రాగానే ఏకకాలంలో చెల్లించామని గుర్తుచేశారు. ఇందుకోసం రూ.6.38 కోట్లను విడుదల చేశామని తెలిపారు. అప్పటిదాకా అరకొరగా ఇస్తున్న పరిహారాన్ని మానవీయ దృక్పథంతో పెంచామని చెప్పారు. గతంలో చెట్టుపై నుంచి పడి మరణించిన వారికి రెండు లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.50 వేలు మాత్రమే ఇచ్చేవారని వివరించారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రమాదవశాత్తూ మరణించిన వారికి, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచిందని తెలిపారు.

గీత కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.1000కి పెంచామని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటి వరకూ కల్లుగీత సొసైటీ సభ్యులకు మాత్రమే వర్తిస్తున్న పెన్షన్‌ను ఇక నుంచి టీఎఫ్‌టీ కార్మికులకు కూడా వర్తింపజేస్తామని తెలిపారు. దీనివల్ల 30 వేల కుటుంబాలకు ఆసరా లభిస్తుందని వివరించారు. టీఎఫ్‌టీ నుంచి టీసీఎస్‌లోకి మారేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి పది రోజుల్లో బదలాయింపులు జరపాలంటూ అధికారులను ఆదేశించారు. లైసెన్సుల రెన్యూవల్ గడువును ఐదేండ్ల నుంచి పదేండ్లకు పెంచుతున్నామని కేసీఆర్ ఈ సందర్భంగా చెప్పారు.

ఇది మా పోరాట విజయం
తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం

తమ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం పన్నును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నదని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇది తాము సాధించిన విజయమని సంఘం ప్రధాన కార్యదర్శి ఎమ్‌వీ రమణ తెలిపారు. లైసెన్సు రెన్యూవల్ గడువును పదేండ్లకు పెంచటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. 2018–19 బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని.. ఇందుకనుగుణంగా బడ్జెట్‌లో మార్పులు, చేర్పులు చేయాలని కోరారు. ఒక నామినేటెడ్ బాడీని ఏర్పాటు చేసి.. దానికి ఈ నిధులను ఖర్చు చేసే అధికారమివ్వాలని రమణ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. చెట్ల పెంపకానికి భూమి, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు, వ్యక్తిగత రుణాలు, పిల్లలకు విద్య, ప్రత్యేక హాస్టల్ నిర్మాణం, యువతకు ఉపాధి తదితరాంశాలను పరిశీలించి, పరిష్కరించాలని సీఎంను కోరారు.

హుందాగా వ్యవహరించాలి

- ఎమ్మెల్సీలకు మంత్రి ఈటల హితబోధ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి సభ్యులు హుందాగా వ్యవహరించాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హితబోధ చేశారు. గురువారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ఎన్నో సమస్యలను ప్రజలు వారి దృష్టికి తెస్తారని చెప్పారు. వాటిని మంత్రుల దృష్టికి తేవాల్సిన బాధ్యత సభ్యులపై ఉందన్నారు. మంత్రులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, పర్యటనలు, విదేశీ యాత్రలు ఎవరూ చేయడం లేదన్నారు. తమకు వేరే వ్యాపకాలూ లేవని చెప్పారు. సమస్యలు తెలియగానే తమ దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు వీలవుతుందని అన్నారు. సభ్యులు మాట్లాడే భాషను మార్చుకోవాలని సూచించారు. ప్రజలు నిజంగా ఎదుర్కొనే సమస్యలను ప్రస్తావించాలని చురకలంటించారు. ఏదో ఒకటి మాట్లాడ్డం సబబు కాదన్నారు. ప్రజాప్రతినిధులపై ఎంతో బాధ్యత ఉందని, టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికార పార్టీ సభ్యులపై మరింత బాధ్యత ఉంటుందని అన్నారు. అంతకుముందు ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నపుడు ఉన్న సమస్యలే ఉన్నాయని అధికార పార్టీ సభ్యుడు రాములు నాయక్ ఆరోపించారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కొంత మెరుగైనా, ఆస్పత్రి ఉన్నా అందులో డాక్టర్లు, సిబ్బంది ఉండరని అన్నారు. దీనిపై మంత్రి ఈటల రాజేందర్ ఘాటుగా స్పందించారు. ఆ తర్వాత రాములు నాయక్ మాట్లాడాలని ప్రయత్నించినా చైర్మెన్ స్వామిగౌడ్ అవకాశం ఇవ్వకపోవడంతో ఏమీ మాట్లాడలేకపోయారు. మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆస్పత్రులు మెరుగయ్యాయని చెప్పారు. వసతులు మెరుగుపర్చామని, డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టామని వివరించారు. రాములు నాయక్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ మధ్య కాలంలో పర్యటించి ఆస్పత్రులను పరిశీలించి మాట్లాడినట్టుగా లేదన్నారు. అందుకే వాస్తవాలు గమనించలేదని ఎద్దేవా చేశారు.

భాగ్యనగరంలో...బడా స్కాం

(మొదటిపేజీ తరువాయి)

కంపెనీలకు టోటెం సబ్‌కాంట్రాక్టుగా పనులు చేసింది. దీని ఆధారంగానే టోటెం కంపెనీ తమ వద్ద రుణం పొందిందని యూబీఐ అధికారులు చెబుతున్నారు. చెల్లింపులు సరిగా లేకపోవటంతో పాటు.. ఆ డబ్బులు ఇతర సంస్థలకు మళ్లించినట్టు తమ దృష్టికి వచ్చిందని యూనియన్ బ్యాంక్ అధికారులు అంటున్నారు. తీసుకున్న అప్పులకు చెల్లింపులు లేకపోవటంతో పాటు ప్రమోటర్లు పరారయ్యారని తెలిపారు. ప్రస్తుతం వారు ఎక్కడ ఉన్నారో కూడా తమకు తెలియదని చెబుతున్నారు. నీరవ్‌మోడీ, రోటోమ్యాక్‌లతో పాటు మరెన్నో కుంభకోణాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో.. యూబీఐ పాత చిట్టాను తెరిచింది. సీబీఐకు ఫిర్యాదు చేయగానే..రంగంలోకి దిగిన అధికారుల బృందం.. ప్రమోటర్లు ఏ కలుగులో దాక్కున్నారో.. కూపీ లాగుతున్నారు. పలు చోట్ల సోదాలు ముమ్మరం చేశారు.

వెల్‌నెస్ మూతే!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాధుల చికిత్సలో వినియోగించే ప్రత్యేక మందులు అందుబాటులో లేకుండా పోయాయి. అడిగితే మరో వారం రోజుల్లో వస్తాయని వెల్‌నెస్ సెంటర్ల ఉద్యోగులు చెప్పడం.. వారి మాటలు విని దూరభారాలు లెక్క చేయకుండా వయోధికులైన పెన్షనర్లు రావడం.. నిరాశగా వెనుదిరగడం రివాజుగా మారింది. నిజానికి ఆయా కేంద్రాల ఉద్యోగులకు మందులు ఎప్పుడు వస్తాయో తెలియనే తెలియదు. రోగులకు కన్పించని వారి పై అధికారులు చెప్పిన మాటలనే వారు వల్లె వేస్తూ వస్తున్నారు. దాంతో వాస్తవాలు తెలియని రోగులు ఉద్యోగులపై అక్కసు వెళ్లగక్కుతుండడంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతూ వస్తున్నారు.

మా కన్నా వారెక్కువా?

"అధ్యక్షా! ఇక మన రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తాం. రాష్ట్ర గవర్నర్, సీఎం, మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఆఖరి ప్రాధాన్యత ఉన్న వ్యక్తి దాకా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తాం." అని ఇటీవల శాసనసభలో ముఖ్యమంత్రి చేసిన గంభీర ప్రకటన వెనక దాగింది వెల్‌నెస్ సెంటర్ల ఎత్తివేత ఎత్తుగడేనని వైద్య ఆరోగ్య ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలను మానసికంగా సన్నద్ధం చేయడంలో అది భాగమేనని అవి స్పష్టం చేశాయి. నిజానికి సీఎం పేర్కొన్న గవర్నర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ధర్మాసుపత్రులకు వెళితే వారికి జరిగే చికిత్సలకు.. లభించే ప్రాధాన్యతలకు ప్రస్తుత లబ్ధిదారులు ధర్మాసుపత్రుల్లోకి వెళితే జరిగే మర్యాదల మధ్య తేడాలు ప్రజానీకానికి తెలియనివేమీ కాదు కదా?!

అందని కిట్లు

నిజానికి గత మూడు నెలలుగా మందులు మాత్రమే కాదు; రోగ నిర్ధారణ పరీక్షల్లోనూ కోతలు పెట్టేశారు. సాధారణ మధుమేహ పీడితులు ప్రతి మూడు నెలలకు ఒకసారి హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయించుకుంటారు. అలాగే థైరాయిడ్ ప్రొఫైల్ లాంటి పరీక్షలూ ఎక్కువగానే అవసరమవుతాయి. వాటిని 'కిట్స్' సాయంతో చేస్తారు. అలాంటివే మరికొన్ని పరీక్షలుంటాయి. చాలా కాలంగా రోగ నిర్ధారణ కిట్ల సరఫరా పూర్తిగా నిలిపివేశారు. ఎంతో దూరం నుంచి పరిగడుపున వచ్చే వయోధికులు ఉస్సురంటున్నారు. పోనీ, ఆ పరీక్షలు ఇక ఇక్కడ జరపం అని చెప్తున్నారా అంటే అదీ లేదు. గత మూడు నెలలుగా ఎప్పుడడిగినా వచ్చే వారం అనే జవాబు ఠంచనుగా వస్తోంది.

మామూలు మందులకూ గతి లేదు

మరోవైపు ప్రత్యేక మందులే కాదు. సాధారణ మందులకు సైతం రాంరాం చెప్పారు. అధిక రక్తపోటు, మధుమేహం, మలబద్ధకం, దగ్గు మందులతో పాటు నొప్పి నివారణ ఆయింట్‌మెంట్లు సైతం అందుబాటులో లేవు. నాలుగునెలల కిందటిదాకా కళకళలాడిన మందుల స్టోర్లు వెల్‌నెస్ సెంటర్లలో ప్రస్తుతం వెలవెలా పోయాయి.

అంతా డ్రామా

నిన్న మొన్నటిదాకా వెల్‌నెస్ సెంటర్లను మూసివేస్తారన్న ప్రచారాలను ప్రభుత్వం అడ్డకునేందుకు అనేక ఎత్తుగడలను ప్రయోగించింది. ఉద్యోగుల సంఘం మాజీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్‌ను హడావిడిగా ప్రగతి భవన్‌కు పిలిపించుకోవడం.. ఆయనతో చర్చించడం.. ఆయన బయటకు వచ్చి సెంటర్లు యథావిధిగా పని చేస్తాయని ప్రకటించడం కొద్ది రోజుల కిందటే జరిగింది. అదే విషయాన్ని వెల్‌నెస్ సెంటర్ల రూపకల్పన నుంచి భాగం పంచుకున్న ఒక ఉన్నతాధికారి వద్ద ప్రస్తావించగా 'అదంతా ఒక పెద్ద డ్రామా' అని కొట్టిపారవేయడం ప్రస్తావనార్హం!

ఉద్యోగులు రోడ్డు పాలు

ప్రస్తుత శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ఏ ఒక్క విషయం సైతం బయటకు పొక్కకుండా చూడడంలో భాగంగానే సెంటర్ల మూసివేత అంశాన్ని తెరపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. నిజానికి సెంటర్లు మూసివేస్తే ఒక్క లబ్ధిదారులకే కాదు; అందులో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయం. కొంత కాలం పని చేస్తే మంచి రోజులు వస్తాయనుకుంటే ఇలా జరుగుతుందేమిటని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

బోజనం చేసే కార్మికులకు కూడా కనీస వేతనం అమలు కాకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజన పథకం, సర్వశిక్ష అభియాన్, ఫీల్డ్ అస్టెంట్లు, గోపాల మిత్ర, రైతు మిత్ర, ఆరోగ్య మిత్ర, గ్రామీణ

ఉపాధిహామీ పథకం, రెండో ఎఎన్ఎమ్‌లు, 104,108, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వంటి మొత్తం 63 పథకాల్లో పని చేసే కార్మికులందరికీ కనీస వేతనంగా రూ. 20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20వేలు ఉండే విధంగా అమలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. ఈ పథకాల్లో పని చేసే కార్మికులందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. రాజకీయ నేతల నుంచి వేధింపులకు గురికాకుండా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు దూరం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. లక్ష్మణ్

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు దూరంగా ఉంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. లక్ష్మణ్ అన్నారు. ఎన్నికల్లో పాల్గొనకూడదని పార్టీ నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. ఎమ్మెల్యేల అభిప్రాయం. అధిష్టానం ఆదేశం మేరకే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా పార్లమెంటులో పట్టుపట్టడం సరైంది కాదన్నారు. విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో అంశమని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల ఐదు మంది చెబితేనే అసెంబ్లీలో వినాలా? అని సీఎం మాట్లాడుతున్నారని అన్నారు. 540 మంది ఉన్న పార్లమెంటు సభ్యుల్లో 11 మంది ఎంపీలు చెబితే కేంద్ర ప్రభుత్వం వింటుందా అని ప్రశ్నించారు.

కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రైతు విభాగం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నామని లక్ష్మణ్ చెప్పారు. రైతు రుణమాఫీ అంశాన్ని సభలో ఎన్నిసార్లు లేవనెత్తినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతు ఆత్మహత్యలు అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

రైతు సమన్వయ సమితుల్లో మొత్తం టీఆర్ఎస్ కార్యకర్తలను భర్తీ చేసి, పంచాయతీ హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. లక్షా 75వేల మందితో కమిటీ వేశారని, ఇందులో మొత్తం టీఆర్ఎస్ కార్యకర్తలేనని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వం పని చేస్తున్నదని విమర్శించారు. గతంలో టీడీపీ జన్మభూమి, కాంగ్రెస్ పార్టీ ఆదర్శరైతుల మాదిరిగానే టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసిందని చెప్పారు.

కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి : ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్నే రద్దు చేస్తామని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

గీత కార్మికులకు భరోసా ఇచ్చిన ప్రభుత్వం : ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రంలోని గీతకార్మికులందరికీ ప్రభుత్వం భరోసా ఇచ్చిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చెట్టుపన్ను రద్దు చేయడం, ఐదు ఎకరాల్లో రూ. 5కోట్లతో గౌడ భవన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలన్నారు. అనేక వ్యాధులకు ఔషదంగా పని చేసే నీరా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

మాదాపూర్‌లో భారీ అగ్నిప్రమాదం

150కు పైగా బూడిదైన గుడిసెలు

- భారీగా ఆస్తినష్టం
- సర్వం కోల్పోయి రోడ్డున పడిన పేదలు
- తొంగి చూడని ఐటీ మంత్రి కేటీఆర్
- ఆలస్యంగా స్పందించిన అధికారులు

నవతెలంగాణ-గచ్చిబౌలి

హైదరాబాద్ మాదాపూర్ పత్రికానగర్‌లో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఓ ఖాళీ స్థలంలో పేదలు వేసుకున్న గుడిసెల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి 150కి పైగా గుడిసెలు కాలిబూడిదయ్యాయి. కూలీనాలి చేసుకుని దాచుకున్న నగలు, వస్తువులు, ఇతర పరికరాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా భారీగా ఆస్తి నష్టం జరిగింది. సర్వస్వం కోల్పోయి పేదలు రోడ్డున పడ్డారు.

మాదాపూర్ పత్రికానగర్‌లోని ఓ ఖాళీ స్థలంలో వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన పేదలు బతుకుదెరువు కోసం పొట్టచేత పట్టుకుని వచ్చి 350 గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. కూలి నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం 9:40 నిమిషాల సమయంలో ఒక గుడిసెలో చిన్నపాటి మంటలు లేచాయి. ఈ మంటలు కాస్తా ఒకదానికొకటి అంటుకుని పెద్దగా వ్యాపించాయి. ఈ క్రమంలో ఓ గుడిసెలో ఉన్న సిలిండర్ పేలిపోయింది. దీంతో మంటలు ఇంకా ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 150కి పైగా గుడిసెలు కాలి బూడిదయ్యాయి. తినడానికి తిండి లేక సర్వం కోల్పోయిన పేదలు రోడ్డున పడ్డారు.

కనిపించని అధికారులు

పత్రికానగర్‌లో 350కు పైగా పేదలు గుడిసెలు వేసుకుని ఉన్నారు. అందులో 92 గుడిసెలకు ఒక్కో విద్యుత్ కనెక్షన్‌కు రూ.1200 చొప్పున తీసుకుని అధికారులు మీటర్లు మంజూరు చేశారు. వీరి నుంచి మరికొందరు కనెక్షన్ పెట్టుకుని ఉపయోగించుకుంటున్నారు. మీటర్లు ఉన్న వారు ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నారు. దీంతోపాటు అధికారులు అనధికారింగా అదనపు కనెక్షన్ల పేరుతో ప్రతినెలా పేదల వద్ద అదనంగా దండుకుంటున్నారు. అగ్ని ప్రమాదం జరిగి రెండు గంటలు గడిచినా విద్యుత్, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు ఆ దరిదాపుల్లోకి కూడా రాలేదు. గుడిసెలన్నీ బూడిదైన తర్వాత వచ్చిన విద్యుత్ అధికారులు హడావిడిగా విద్యుత్ వైర్లు కట్ చేసి వెళ్లిపోయారు. తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలించారు. ఇక సాయంత్రం వరకు ఇంజినీరింగ్ అధికారుల పత్తా లేదు.

కానరాని ఐటీ మంత్రి

ఐటీ కారిడార్ నడిబొడ్డున మాదాపూర్‌లో పేదల గుడిసెలు బూడిదైనా ఐటీ మంత్రి కేటీఆర్ కనీసం ఆ వంక చూడలేదు.

మెరుపుతీగలా వచ్చివెళ్లిన ఎమ్మెల్యే

ఉదయం గుడిసెలు దగ్ధమైతే స్థానిక ఎమ్మెల్యే గాంధీ మాత్రం 11:30 గంటలకు అక్కడికి వచ్చారు. హడావిడిగా వచ్చిన ఆయన అదే తీరులో హడావుడిగా పరిశీలించి వెళ్లిపోయారు. పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటానని, ఆర్డీవోతో మాట్లాడతానని, అసెంబ్లీ సమావేశం ఉందని తిరిగి మధ్యాహ్నం వరకు వస్తానని చెప్పి వెళ్లి పోయారని బాధితులు చెప్పారు.

హైవేలపై హోదా హోరు

అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని సాగుతున్న పోరాటం ఉవ్వెత్తున ఎగసింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ(ఎం) ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, వైసీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపి పలు చోట్ల నిరసన చేపట్టింది. హోదా ఉద్యమానికి రాష్ట్రంలో ఒక్క బీజేపీ మినహా అన్ని పార్టీలు మద్దతు పలికాయి. జాతీయ రహదారులు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్తంభించాయి. విజయవాడ కనకదుర్గ వారధి దగ్గర జరిగిన జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సినీ హీరో శివాజీ, వైసీపీ రాష్ట్ర నాయకులు పార్థసారథి, జనసేన కార్యకర్త పోతిన మహేష్ పాల్గొన్నారు. గుంటూరు నగర శివారు అంకిరెడ్డిపాలెం రహదారి వద్ద వైఎస్ జగన్ ఆందోళనకు మద్దతు తెలిపారు. విజయవాడలో ఈలలు వేసి, కర్రసాము చేసి డప్పులు కొట్టి మధు రామకృష్ణ, శివాజి ఆందోళనలో పాల్గొన్న వారికి ఉత్సాహాన్నిచ్చారు. విశాఖ జిల్లాలో ఎనిమిది సెంటర్లలో హైవేలను దిగ్బంధం సాగింది. విశాఖపట్నం మద్దిలపాలెం జంక్షన్‌లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళలు ఆటలు ఆడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. సినీ హీరో శివాజి కర్రసాము చేశారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్వాహకులు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. విజయవాడలో బెంజిసర్కిల్, రామవరప్పాడు వద్ద తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం)ఏపీ రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రాలను ఇబ్బందులు పెడుతున్నదని తెలిపారు. హోదా ఇస్తామని ఎందుకు ఇవ్వలేదో ఇంత వరకు సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యకం చేశారు. తెలుగుదేశం కూడా ఇప్పటి వరకూ ఏం చేయకుండా ఇప్పుడు హోదా కోసం పోరాడుతున్నట్టు ఫోజు పెడుతోందన్నారు. సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ హోదాపై బీజేపీ పూర్తి అన్యాయం చేస్తోందని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకే...

- రైతు సమన్వయ సమితులపై పోచారం వెల్లడి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి, మార్కెట్లు, ఇతర ధాన్యం కొనుగోలు సంస్థలను రైతు సమన్వయ సమితులు సమన్వపరుస్తాయని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సమితుల విధులపై పలువులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు పైవిధంగా సమాధానమిచ్చారు. రాజకీయ జోక్యం ఉండదన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా మహిళలకు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించామన్నారు. దీనిపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో బీజేపీ సభ్యులు సభను వెళ్లిపోయారు.

కొత్త ఆవిష్కరణలకు టీ హబ్ వేదిక : మంత్రి కేటీఆర్

విద్యా, వైద్యం, సైన్స్, సాంకేతిక, ఐటీ, వ్యవసాయం రంగాలే కాకుండా ఏ రంగంలోనైనా కొత్త ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించడానికి టి హబ్ వేదికగా మారిందని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె తారకరామారావు చెప్పారు. ప్రపంచంలోనే పేరొందిన కార్పొరేట్ సంస్థలలో ఒప్పందాలు చేసుకున్నట్టు తెలిపారు. టీ హబ్ అంటే ఏదో చదువుకున్న వారికే ఉపయోగపడుతుందన్న ప్రచారంలో నిజం లేదన్నారు. గ్రామీణ యువతకు, ఉపాధి కూలీలకు ఉపయోగపడుతుందన్నారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఇంక్యుబేటీస్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. గోవా, అస్సాం, ఢిల్లీ ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు.

బీటీ రోడ్ల రెన్యువల్స్ కోసం చర్యలు తీసుకుంటాం : మంత్రి జూపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా ఐదేండ్ల కాలం పూర్తయిన బీటీ రోడ్లను రెన్యువల్స్ చేపడుతామని పంచాయతీరాజ్ మంత్రి జూపల్ల కృష్ణారావు తెలిపారు. బీటీ రోడ్లు రెన్యువల్స్ కావడం లేదంటూ పలువురు అధికార పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు త్వరలోనే రోడ్ల రెన్యువల్స్ చేస్తామన్నారు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత, బ్యాక్‌లాగ్ రోడ్లను కూడా పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున బీటీ రెన్యువల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం ఆర్‌బీ రోడ్ల పొడవు 366 కిమీ వీటిలో 160 కిమీను గత మూడేండ్ల మెరుగుపరచమైందన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు పూర్తి చేస్తాం : తుమ్మల

తెలంగాణ రాష్ట్రంలో 50 ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను పూర్తి చేశామని, మరో 50 ఎమ్మెల్యేలు క్యాంపు కార్యాలయంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలకు పాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కార్యాలయాలు కేటాయిస్తామన్నారు. 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల సమస్య ఉందని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

భద్రాచలం అభివృద్ధి కోసం రూ 500 కోట్లు కేటాయించండి : సున్నం రాజయ్య

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం అభివృద్ధి కోసం రూ 500 కోట్లు కేటాయించాలని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య కోరారు. భద్రాచలంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భద్రాచలంలో 70వేల జనాభా 50 కాలనీలలో సరైన డ్రైనేజ్ వ్యవస్థ, రోడ్లు, పార్కులు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడుతాయన్నారు.

గిరిజనులు కోరుకున్నచోటే స్థలాలు ఇవ్వాలి

గిరిజనులు కోరుకున్న చోటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ(ఎం) శాసనసభ్యులు సున్నం రాజయ్య కోరారు. గురువారం బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ కులాల జరాభా 50 లక్షలకు పైబడి ఉన్నారని, వీరికి కేటాయించిన బడ్జెట్ చాలా తక్కువగా ఉందని, వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. వీరికి ఉద్యోగ అవకాశాలు లేవని, ఆయా సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం కావాలని సీఎంతో సహా ఎంతో మందిని కోరడం జరిగిందన్నారు. ఇంత వరకు మంజూరు చేయలేదని చెప్పారు. ఏప్రిల్‌లో అంబేద్కర్ జయంతి ఈసందర్భంగానైనా నిధులు కేటాయించాలని కోరారు. 2.50 లక్షల మంది దళితులకు భూములు ఎక్కడ ఇస్తారని సూటిగా ప్రశ్నించారు. గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ అమలు చేస్తారా ? లేదా ? అని ప్రశ్నించారు.

సెన్సెక్స్ ▼253 32,923	నిఫ్టీ ▼101 10,094	డాలరుకు రూపాయి విలువ 65.18	బంగారం(10.గ్రా) రూ. 30,408	వెండి (కేజీ) రూ. 40,200	కోడిగుడ్లు





కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



ఎల్ఐసికి భారీ నష్టం

న్యూఢిల్లీ : గత కొద్ది రోజులుగా వరుసగా పడిపోతున్న స్టాక్ మార్కెట్ల వల్ల దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ ఎల్ఐసి భారీగానే నష్టపోయింది. ముఖ్యంగా 53 ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాల వల్ల ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు రూ.20,000 కోట్ల నష్టాలు వాటిలినట్లు సమాచారం. 2018లో ఇప్పటి వరకు ప్రతీ 10 పిఎస్‌యుల్లో తొమ్మిది పిఎస్‌యులు దాదాపుగా 40 శాతం వరకు మార్కెట్ విలువను నష్టపోయాయి. ప్రధానంగా కార్పొరేషన్ బ్యాంకు, భెల్, పంజాబ్ నేషనల్ బ్యాంకులు 19 శాతం వరకు నష్టపోయాయని కాపిటలైన్ పేర్కొంది. కోల్ ఇండియా, సెంట్రల్ బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకు సూచీలు నష్టాలను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా పిఎన్‌బి కేసు వల్ల బ్యాంకుల సూచీలు దెబ్బతినడంతో ఎల్ఐసి ఎక్కువగా నష్టపోయింది.

సాబిక్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ



హైదరాబాద్ : గ్లోబల్ కంపెనీ సాబిక్ సిఎస్ఆర్‌లో భాగంగా 135 మంది నిరుపేద యువతకు ప్లాస్టిక్ రంగంలో పూర్తి స్థాయి శిక్షణను అందించినట్లు పేర్కొంది. బాలాసోర్, లక్నో, హైదరాబాద్ నగరాల్లోని యువతకు కెమికల్స్ మంత్రిత్వశాఖ, సిపెట్ ఆధ్వర్యంలో పూర్తి స్కాలర్‌షిప్‌తో శిక్షణ అందించినట్లు సాబిక్ సౌత్ ఏసియా వైస్ ప్రెసిడెంట్ జనార్ధనన్ పేర్కొన్నారు.

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు..

సెన్సెక్స్ 130 పాయింట్ల పతనం



ముంబయి : వరుస నష్టాల నుంచి గట్టెక్కి రెండు రోజులు లాభాల్లో నమోదైన దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ చతికిల పడ్డాయి. మార్చి మాసం డెరివేటివ్స్ కాంట్రాక్ట్స గడువు ముగింపునకు తోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచనున్నట్లు వార్తలు రావడంతో మార్కెట్లు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఈ పరిణామాల మధ్య గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 129.91 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 33,006.27కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 40.50 పాయింట్లు తగ్గి 10,114,75కు క్షీణించింది. బ్యాంకింగ్, విత్త సంస్థల సూచీలు అత్యధికంగా నష్టాలను ఎదుర్కొన్నాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంకు సూచీలు రెండు శాతం మేర విలువ కోల్పోయాయి. రంగాల వారిగా నిఫ్టీలో రియాల్టీ 1.21 శాతం, బ్యాంకింగ్ 0.47 శాతం, ఆటో 0.89 శాతం, ఐటి 0.95 శాతం చొప్పున నష్టాలను ఎదుర్కొన్నాయి. కాగా లోహ సూచీ మాత్రం 0.32 శాతం పెరిగింది. సెన్సెక్స్-30లో ఎస్‌బిఐ 2.58 శాతం, విప్రో 2.32 శాతం, మారుతి సుజుకి 2.11 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.07 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.98 శాతం, అదానీ పోర్ట్సు 1.62 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. మరోవైపు ఒఎన్‌జిసి 2.45 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 1.41 శాతం, రిలయన్స్ 1.31 శాతం, టాటా మోటార్స్ 1.23 శాతం, సన్ ఫార్మా 0.85 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.56 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

త్వరలో జియో ఫోన్లలో వాట్సాప్!

శాన్‌ఫ్రాన్సిస్కో: రిలయన్స్ జియో.బేసిక్ ఫోన్లలోనూ త్వరలో ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌ను కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోన్నట్లు సమాచారం. జియో ఫోన్లలో సపోర్ట్ చేసే విధంగా వాట్సాప్ అప్లికేషన్‌లో మార్పులు చేస్తున్నట్లు ఒక వెబ్‌సైట్ కథనం వెల్లడించింది. ఉచిత ఆఫర్లతో అతి తక్కువ కాలంలోనే 10కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుంది. ఇటీవలే వినియోగదారులకు ఫేస్‌బుక్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

ఆర్‌కామ్‌కు షాక్

• అంబానీ బ్రదర్స్ డీల్‌కు చుక్కెదురు • స్టే కొనసాగించిన సుప్రీం

- వచ్చే నెలలో తదుపరి విచారణ
- పడిపోయిన షేర్ విలువ




న్యూఢిల్లీ: అంబానీ అన్నదమ్ములకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు చెందిన ఆస్తులను ముఖేష్ అంబానీ కొనుగోలు చేయాలని గతేడాది నిర్ణయించారు. ఆర్‌కామ్ ఆస్తులను రిలయన్స్ జియోకు విక్రయించకుండా బాంబే హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం గురువారం నిరాకరించింది. దీనిపై మళ్లీ విచారణ జరిపేంత వరకు బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు కొనసాగుతుందని స్పష్టం చేసింది. తద్వారా తన అనుమతిలేనిదే ఈ డీల్‌ను పూర్తి చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 5కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ పరిణామంతో బిఎస్ఇలో ఆర్‌కామ్ షేర్ 5.36 శాతం పతనమై రూ.23.85కు పడిపోయింది.

తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ ఆ భారాన్ని తగ్గించుకునేందుకు తన ఆస్తులను ముఖేష్ అంబానీకి చెందిన జియో ఇన్ఫోకామ్‌కు విక్రయిస్తున్నట్లు గతేడాది డిసెంబరులో ప్రకటించింది. సుమారు రూ.39వేల కోట్ల రుణభారాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా తన వైర్‌లెస్ స్పెక్ట్రం, టవర్, ఫైబర్, మీడియా కన్వర్జెన్స్ నోడ్ (ఎంసిఎన్) ఆస్తులను జియోకు విక్రయించనున్నట్లు ఆర్‌కాం ప్రకటించింది. ఈ మేరకు అంబానీ సోదరులు అనిల్, ముఖేశ్‌ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అయితే దీనిపై ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టుకు వెళ్లింది. తమ బకాయిలు చెల్లించకుండా ఆస్తులు విక్రయిస్తున్నారని ఆరోపించింది. ఆర్‌కాం నుంచి తమకు రూ.1,000 కోట్లకు పైగా బకాయి రావాల్సి ఉందని ఎరిక్సన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీంతో అనుమతులు లేకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తులు అమ్మరాదని ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశించింది. దీంతో ఆర్బిట్రేషన్ తీర్పుపై ఆర్‌కామ్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా ఆ కోర్టులోనూ ఆస్తులు విక్రయించకుండా స్టే విధించింది.

కాగా ఆర్‌కామ్‌కు మద్దతుగా నిలిచిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ట్రిబ్యునల్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆస్తుల అమ్మకానికి అనుమతి నివ్వాల్సిందిగా కోరింది. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయ స్థానం ముంబై హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం ధర్మాసనం ఎకె గోయల్, ఆర్‌ఎఫ్ నారిమన్, యుయు లలిత్ తాజా ఆదేశాలిచ్చింది. దీంతో ఆర్‌కామ్ మళ్లీ చిక్కుల్లో పడినట్లయ్యింది. ఎస్‌బిఐ కన్సోరియంలోని బిఒబి, బిఒఐ, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పిఎన్‌బి, ఐడిబిఐ బ్యాంకు, యూకో బ్యాంకు, ఐఒబి, దేనా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, యూనైటెడ్ బ్యాంకు, ఎల్ఐసి, బార్‌క్లేస్ బ్యాంకు తదితర 24 విత్త సంస్థలు ఆర్‌కామ్‌కు అప్పులిచ్చిన వాటిలో ఉన్నాయి.

ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రమ్, మొబైల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, మీడియా కన్వర్జన్స్ నోడ్స్‌ను (ఎంసిఎన్) జియో ఇన్ఫోకామ్ కొనుగోలు చేయాలని గతేడాది ముగింపులో నిర్ణయించింది. ఆ సమయంలో ఇరు కంపెనీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. కాగా డీల్ ఆర్థిక వివరాలను వెల్లడించనప్పటికీ, దీని విలువ రూ.24,000-25,000 కోట్ల శ్రేణిలో బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ ఆస్తుల విక్రయం రూ.45,000 కోట్ల రుణ భారంతో కుదేలైన ఆర్‌కామ్‌కు ఊరట లభిస్తుందని భావించాయి. 2018 మార్చి ముగింపు నాటికి ఈ ఒప్పందాన్ని పూర్తి చేయాలని ఇరు సంస్థలు నిర్ధేశించుకున్నాయి. తాజాగా కోర్టుల ఉత్తర్వుల వల్ల మరింత ఆలస్యం కానుందని తెలుస్తోంది.

సీఏడీ మూడు రెట్లు పెరగొచ్చు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత కరెంట్ ఎకౌంట్ లోటు (సీఏడీ) మూడు రెట్లు పెరిగి 10-12 బిలియన్ డాలర్లకు చేరొచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అధిక వాణిజ్య లోటుతో ఈ పరిస్థితి చోటు చేసుకోనుందని పేర్కొంది. జిడిపిలో సీఏడీ 13.5 బిలియన్ డాలర్లతో రెండు శాతానికి చేరనుందని తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపిలో సిఎడి 8 బిలియన్ డాలర్లతో 1.4 శాతంగా ఉంది. ఇక్రా అంచనాల ప్రకారం 2017-18లో మొత్తంగా సీఏడీ 46-48 బిలియన్ డాలర్లకు ఎగియనుంది. ఇది జిడిపిలో 1.8 శాతంగా ఉండనుంది.

2016-17లో 15.2 బిలియన్లతో 0.7 శాతంగా ఉంది. 2018-19లో భారత ఎగుమతులు 335-340 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇదే సమయంలో దిగుమతులు 505-510 బిలియన్లుగా ఉంది. దీంతో భారత వాణిజ్య లోటు 170-175 బిలియన్ డాలర్లకు చేరనుందని ఇక్రా అంచనా వేసింది. 2018-19లో 45-50 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నమోదు కావొచ్చు. 2018లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 64-66గా ఉండొచ్చు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి రెండు కొత్త బైక్స్

న్యూఢిల్లీ : దేశీయ దిగ్గజ మిడ్-సైజు మోటార్‌సైకిల్ తయారీదారి రాయల్ ఎన్‌ఫీల్డ్ తన రెండు కొత్త 650 సీసీ మోటార్‌సైకిల్స్‌ను ఆస్ట్రేలియా మార్కెట్‌కి తరలిస్తోంది. ఇంటర్‌సెప్టర్ 650, కాంటినెంటల్ జీటీ 650 పేర్లతో రూపొందించిన ఈ బైక్‌లను ఆస్ట్రేలియన్ మార్కెట్‌లో రిటైల్ చేయబోతోంది. వీటి ధరలు ఆస్ట్రేలియా మార్కెట్‌లో 10వేల ఏయూడీ(సుమారు రూ.5.04 లక్షలుగా)గా, 10,400 ఏయూడీ(సుమారు రూ.5.24 లక్షలుగా)గా ఉన్నాయి. ఈ రెండు కొత్త బైక్‌లను చెన్నై ప్లాంట్‌లోనే రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీచేసింది. భారత మార్కెట్‌లో కూడా వీటిని 2018 ఏప్రిల్ తర్వాత లాంచ్ చేయబోతోంది. అయితే భారత్‌లో వీటి ధరలు ఎంత ఉంటాయనేది కంపెనీ రివీల్ చేయడానికి నిరాకరించింది.

ప్రస్తుతం ఆస్ట్రేలియా, భారత మార్కెట్లలో ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ మోడల్స్ ధరలను పోల్చి చూస్తే.. త్వరలో భారత్‌లోకి రాబోతున్న ఈ బైక్స్ ధరలను అంచనా వేయొచ్చని ఇండస్ట్రి వర్గాలంటున్నాయి. హిమాలయన్ బైక్ ధర భారత్‌లో రూ.1.68 లక్షలుగా ఉండగా.. ఆస్ట్రేలియాలో రూ.3.02 లక్షలుగా ఉంది. అంటే కొత్త ఇంటర్‌సెప్టర్ 650 బైక్ ధర భారత మార్కెట్‌లో సుమారు రూ.3 లక్షలుగా ఉండొచ్చని తెలుస్తోంది. కాంటినెంటల్ జీటీ 650 ధర దానికి కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని అంచనాలు వెలువడుతున్నాయి. అన్ని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ల మాదిరిగానే, ఈ కొత్త బైక్‌లు కూడా రెట్రో స్టయిల్‌లో రూపొందాయి. కాంటినెంటల్ జీటీ 650 కేఫ్ రేసర్, ఇది ప్రస్తుతమున్న సింగిల్-సిలిండర్ కాంటినెంటల్ జీటీ 535 మాదిరిగానే ఉంది. ఇంటర్‌సెప్టర్ 650 తేలికగా రైడ్ చేయొచ్చు. ఈ రెండు కొత్త బైక్‌లు కొత్త 650సీసీ, ఎయిర్ కూల్డ్, ప్యారలల్-ట్విన్ ఇంజిన్‌తో రూపొందాయి. ఈ బైక్స్‌లో అతిపెద్ద 320ఎంఎం ఫ్రంట్, 240ఎంఎం రియర్ డిస్క్ బ్రేక్, అడ్జస్టబుల్ గ్యాస్ ఛార్జ్‌డ్ రియర్ షాక్ అబ్జార్బర్స్, ప్రీమియం పిరెల్లీ టైర్స్, యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఫీచర్లున్నాయి.

ఆన్‌లైన్‌లో అద్దెకు ఎసి, కూలర్లు

హైదరాబాద్: వేసవి కాలం నేపథ్యంలో గ్రాబ్ ఆన్ రెంట్.కమ్ అద్దెకు ఎసిలు, కూలర్లు అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. నెలకు రూ.799-రూ.2049 శ్రేణీ అద్దెతో ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఈ సేవలు హైదరాబాద్, బెంగళూరు, ముంబయి తదితర నగరాల్లో తొలుత అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. రిఫ్రీజిరేటర్లను కూడా అద్దెకు ఇస్తున్నట్లు తెలిపింది. అన్ని ప్రముఖ బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

ఐటెల్ కొత్త ఫోన్లు..



మొబైల్ బ్రాండ్లలో ఒక్కటైన ఐటెల్ భారత మార్కెట్లోకి ఐటెల్ ఎస్42, ఎ44లను, ఎ44 ప్రో మోడళ్ళను విడుదల చేసింది. ఈ మూడు కూడా ఫింగర్ ప్రింట్ సెన్సర్‌లతో అందుబాటులో తెచ్చినట్లు ట్రాన్సిషన్ ఇండియా ఎమ్‌డి మార్కో మా తెలిపారు. ఎస్42, ఎ44ల ధరలను వరుసగా రూ. 8,499, రూ.5,799గా నిర్ణయించారు.

కాళేశ్వరం పరిధిలోకి అప్పర్ మానేర్ ప్రాజెక్ట్

- **గడువులోగా పనులు పూర్తి చేయాలి: మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఆదేశం**



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సిరిసిల్ల జిల్లాలోని అప్పర్ మానేరు ప్రాజెక్టును కాళేశ్వరం పరిధిలోకి తీసుకు రావాలని గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. 2.2 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన అప్పర్ మానేరు ప్రాజెక్టు చాలా కాలంగా పూడుకు పోయిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులో పూడిక తీయటానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు అధికారయంత్రయంగాన్ని ఆదేశించారు. నర్మాలకు వెళ్లే కాలువలను 38 కోట్ల తో మరమ్మతులు చేయనున్నట్టు హరీశ్ రావు చెప్పారు. అలాగే నర్మాల ప్రాజెక్టు గెస్ట్ హౌజ్ ను ఆధునీకరించాలని కూడా ఆయన ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ 9 పనులను వచ్చే దసరా నాటికి పూర్తి చేయాలని మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఆదేశించారు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 9,10,11,12 ప్యాకేజీల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గురువారం అసెంబ్లీ కమిటీ హాలులో నాలుగు ప్యాకేజీలకు చెందిన టన్నెల్స్,పంప్ హౌజ్‌లు, సర్జ్‌పూల్, ప్రధాన కాల్వలు డిస్ట్రిబ్యూటరీలు ఇతర పనులను వారు సమీక్షించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్‌లు, పంప్‌హౌస్ పనులు జరుగుతున్నట్టుగానే మిగతా ప్యాకేజీల పనులు కూడా అదే వేగంతో జరగాలని, గడువులోగా వాటిని పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. పనులు జరిగినంత మేరకు నిధులు అప్పటికప్పుడు ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. 9,10,11,12 ప్యాకేజీల పరిధిలో సిరిసిల్ల జిల్లాలో 253 చెరువులు నింపనునట్టు అధికారులు చెప్పారు. తమ జిల్లాలో మొత్తం 625 చిన్న తరహా నీటి వనరులున్నాయని వీటైనన్ని ఎక్కువ చెరువులను నింపడం ద్వారా జిల్లాను మోడల్ గా మార్చాలని సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కష్ణభాస్కర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులను మంత్రి కేటీఆర్ కోరారు.

జూన్ నాటికి కాళేశ్వరం పంపుల వెట్‌రన్

జూన్ కల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పంపుల వెట్ రన్ నిర్వహించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీ లతో పాటు మూడు పంప్‌హౌజ్‌ల పనులను మంత్రి గురువారం అసెంబ్లీ కమిటీ హాలులో సమీక్షించారు. ముఖ్యముగా పంపులు, మోటార్లు, ఇతర పరికరాలను సరఫరా చేసే సంస్థలు ఇందుకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని కోరారు. బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులతో పాటు, వివిధ దేశాల పంపులు, మోటార్ల కంపెనీల ప్రతినిధులతో హరీశ్ రావు సమీక్షించారు. షిప్పింగ్ వల్ల ఆలస్యం అయ్యే పక్షంలో ఆయా యంత్రాలను ఎయిర్ కార్గో ద్వారా దిగుమతి చేయాలని మంత్రి ఆదేశించారు.

'సోలార్' పరిహారంలో దళారుల మోసం

నవతెలంగాణ - పెద్దమందడి



సోలార్ కంపెనీ నిర్మాణానికి తమ భూములు తీసుకుని పరిహారం విషయంలో మోసం చేశారని బాధిత రైతులు గురువారం కంపెనీ ఎదుట ధర్నా చేశారు. వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బాధిత రైతులు మాట్లాడుతూ.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల, అమ్మపల్లి గ్రామ శివారులో 200 ఎకరాల్లో సోలార్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కొంత మంది దళారులు కంపెనీతో ఎకరాకు రూ.6.25లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, రైతులకు రూ.50వేల నుంచి మూడు లక్షలు మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. సోలార్ కంపెనీ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి కాకుండా ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడారు. ఈనెల 25న దళారులను పిలిపించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అప్పటి వరకు నిర్మాణ పనులు చేపట్టొద్దని సూచించారు. తమకు న్యాయం చేయాలని కంపెనీ ప్రతినిధికి రైతులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో మాజీ జెడ్పీటీసీ వెంకట స్వామి, కొల్లాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు శివసేనారెడ్డి, అల్వాల రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలే ప్రధాన ఎజెండా

ఏప్రిల్ రెండవ వారంలోగా కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం

రాష్ట్రంలో మరో రాజకీయ పార్టీ ఆవిర్భవించబోతున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో జేఏసీ చైర్మెన్‌గా పనిచేసిన ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో పురుడుపోసుకుంటున్న ఈ కొత్త పార్టీకి తెలంగాణ ప్రజల ఆకాంక్షలే ప్రధాన ఎజెండాగా ఉంటాయని కోదండరామ్ తెలిపారు. అధికార టీఆర్ఎస్ కొందరు వ్యక్తుల స్వంత పార్టీగా మారిందని, ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చక పోగా ఉద్యమాలను అణచి వేయటానికి నిర్బంధకాండ అమలు చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్‌తో తనకు ఎటువంటి సంబంధాలు లేవని, పొత్తులపై ఇప్పుడు ఆలోచించటం లేదని ఆయన స్పష్టం చేశారు. 'నవతెలంగాణ' ప్రత్యేక ప్రతినిధి కొండూరి రమేశ్‌బాబుకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు.

- ముందుగానే అభ్యర్థుల ఎంపిక
- వ్యక్తుల ప్రయోజనాల కోసమే టీఆర్ఎస్
- కాంగ్రెస్‌తో ఎటువంటి సంబంధాలు లేవు
- పొత్తుల గురించి ఆలోచించటం లేదు



'నవతెలంగాణ' ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ కోదండరాం

ప్రశ్న: కొత్త రాజకీయ పార్టీ ఎప్పుడు ప్రకటించబోతున్నారు? దీని జెండా ఎజెండా ఏవిధంగా ఉండబోతున్నాయి?

జః ఏప్రిల్ రెండవ వారంలోగా కొత్త పార్టీ ప్రకటించబోతున్నాం. దీని జెండా ఎజెండా తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారు. భావవ్యాప్తి, ఆందోళన తర్వాత రాజకీయ ప్రక్రియ ప్రారంభమయింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, ప్రజాస్వామిక విలువలు, జవాబుదారీతనం, వ్యక్తుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే వ్యవస్థల ఏర్పాటు ఎజెండాగా ఉండబోతున్నాయి.

ప్రశ్న : రాజకీయ పార్టీ పెట్టాలనే నిర్ణయం ఎందుకు తీసుకున్నారు?

జ : తెలంగాణ ఏర్పడిన తర్వాతే రాజకీయ పార్టీ పెట్టాలనే ప్రతిపాదన వచ్చింది. ఒక పోరువేదికగా ప్రజల పక్కన నిలబడి పనిచేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా క్రియాశీల పాత్ర పోషించాలని మొదట అనుకున్నాం. అధికార టీఆర్ఎస్ పార్టీ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చక పోగా జేఏసీ వంటి ప్రజాసంఘాలపై ఎదురుదాడికి దిగింది. ఆందోళనలపై ఆంక్షలు విధించటం, నిర్బంధకాండ కొనసాగించటం జరిగింది. అయినప్పటికీ మా ప్రయత్నం కొనసాగింది. ఇలాగే ప్రయాణం కొనసాగించటం కష్టమని, ఉద్యమ ఆకాంక్ష కోసం రాజకీయ వేదికగా అవతరించాలని వివిధ వర్గాల నుంచి ఒత్తిడి పెరిగింది. రాజకీయ పార్టీ ఏర్పాటు తర్వాత కూడా జేఏసీ ఉంటుంది. ఎవరికి ఏది ఇష్టమైతే దానిలో పనిచేసే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: తెలంగాణలో మరో రాజకీయ పార్టీ అవసరం లేదని కేసీఆర్ అంటున్నారు కదా?

జః టీఆర్ఎస్ కొందరి స్వప్రయోజనాల కోసం పనిచేస్తున్నది. సమిష్టి ప్రయోజనాల కోసం పనిచేయటం లేదు. విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, నిర్వాసితుల ఆకాంక్షలు నెరవేరటం లేదు. ప్రజల మీద నిర్బంధం కొనసాగుతున్నది. తెలంగాణ అంతటా పోలీసు చట్టం సెక్షన్ 30, సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. ప్రశ్నించిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారు. అందుకే కొత్త రాజకీయ పార్టీ అవసరమని ప్రజలు భావిస్తున్నారు.

ప్రశ్న: వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామంటున్నారు కదా.. అభ్యర్థుల ఎంపిక ఎప్పుడు చేస్తారు?

జః రాజకీయ పార్టీ ప్రకటించిన తర్వాత ఎన్నికల వరకూ వేచి చూడకుండా ముందుగానే అభ్యర్థులను ఎంపిక చేస్తాము. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత టిక్కెట్ల గురించి ఆలోచించటం సరైనది కాదు. పార్టీ ఎప్పుడు ప్రకటించినా ముందుగానే ఆ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాం. ప్రజల్లో ఇప్పటికే పనిచేస్తున్నందువల్ల పార్టీ నిర్మాణం కూడా కష్టతరం కాదు. రాజకీయ పార్టీగా ఎన్నికలు కీలకమైనవే అయినప్పటికీ కేవలం ఎన్నికల కోణంలోనే మా పార్టీని చూడటం అంత మంచిది కాదు.

ప్రశ్న: రాజకీయ పార్టీ నడపటం ఖర్చుతో కూడిన పని కదా.. ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టటానికి ప్రధాన పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. మీరెట్లా తట్టుకుంటారు?

జః డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టి మీడియాను చేతిలో పెట్టుకుంటే ఎన్నికల్లో విజయం సాధించవచ్చని కొన్ని పార్టీలు అనుకుంటున్నాయి. మేము రాజకీయాన్ని ఆ కోణంలో చూడటం లేదు. తెలంగాణ ఉద్యమ కాలంలో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ కంటే మిగిలిన పార్టీలు ఎక్కువగా ఖర్చు పెట్టాయి. అయినా టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. రాజకీయ విధానాలతో గెలవాలి కానీ పైసలతో గెలవలేరు. బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ వంటి పార్టీలు దీనిని రుజువు చేశాయి. రాజకీయ పార్టీగా మేం ప్రజల వద్ద నుంచి విరాళాలు సేకరిస్తాం. కానీ కార్పొరేట్ సంస్థల వద్దకు చందాల కోసం వెళ్లేది లేదు.

ప్రశ్న: కాంగ్రెస్ పార్టీ వెనక ఉండి మిమ్మల్ని నడిపిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బు కూడా వారి వద్ద నుంచే అందుతున్నదని కొందరు అంటున్నారు. దీనికి మీ సమాధానం?

జః ఇది నిజం కాదు. వారి పార్టీ వారిది. ఎన్నికల కోసం వారు ఖర్చుపెట్టుకుంటారు. మాకెందుకు డబ్బు అటువంటి అవసరం ఏ రాజకీయ పార్టీకి ఉండదు. ఉమ్మడి కార్యక్రమం కోసం కాంగ్రెస్‌తోనూ, ఇతర పార్టీలతోనూ కలిసి పనిచేశాం. టీఆర్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా ఇప్పటికీ పనిచేస్తాం.

ప్రశ్న: బీఎల్ఎఫ్‌పై మీ అభిప్రాయం ఏమిటి?

జః ఒక రాజకీయ పార్టీ పెడుతున్న సందర్భంలో బీఎల్ఎఫ్ గురించి ఎక్కువగా మాట్లాడలేను. సామాజిక మార్పు, సామాజిక న్యాయం కోసం పనిచేయాల్సిన అవసరం ఉన్నది. రాజకీయాల్ని ఎన్నికల కోణంలో కాకుండా మార్పు కోసం చూడాలి. అన్ని వర్గాలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. వనరుల్నీ ప్రయివేటు రంగంలోకి వెళ్లి పోవటం, బ్యాంకులు సంక్షోభంలో చిక్కుకోవటం చూస్తున్నాం. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

ప్రశ్న: కేసీఆర్ థర్డ్ ఫ్రంట్‌పై మీ అభిప్రాయం?

జః అది ఫ్రంట్ కాదు. ఒక స్టంట్. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాదు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా ప్రజా ఉద్యమాలను అణచివేస్తూ కేంద్రంలో ఫ్రంట్ పెడతామనడం హాస్యాస్పదం. ప్రజల దృష్టిని మళ్లించటానికే కేసీఆర్ ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారు.

రక్ష
నవతెలంగాణ



ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో టీబీ ఒకటి. మూడవవంతు ప్రపంచ జనాభా ఏదో ఒక రకమైన టీబీ బ్యాక్టీరియాతో ఇన్ఫెక్ట్ అయి ఉన్నారు. 90 లక్షల ప్రపంచ జనాబా టీబీ సంబంధిత జబ్బులకు గురికాగా వీరిలో దాదాపుగా 22 లక్షల మంది చనిపోతున్నారు. సెకనుకు ఒకరు క్షయ వ్యాధి బారినపడుతున్నారు. ఎక్కువ మొత్తం మరణాలు మన దేశం లోనే సంభవించడం బాధాకరం. వైద్యరంగం ఇంతగా అభివృద్ధి చెందుతున్నా క్షయ వ్యాధి ప్రపంచాన్ని ఇప్పటికీ వణికిస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా గత సంవత్సరం 94 లక్షల మంది దీని బారిన పడగా.. 17 లక్షల మంది మరణించటమే దీనికి నిదర్శనం. మొత్తం క్షయ కేసుల్లో మూడింట ఒకవంతు మనదేశంలోనే వెలుగు చూస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2009లో ప్రతి రెండు నిమిషాలకు ఒక కేసు నమోదు కావటం గమనార్హం. క్షయ ఒక్క భారత్‌లోనే ఏటా 5 లక్షల మందిని కబళిస్తోంది. వీరిలో 15-45 ఏళ్లలోపు వాళ్లే ఎక్కువగా ఉంటుండటంతో ఆర్థికంగా ఏడాదికి సుమారు రూ.13,500 కోట్ల నష్టమూ సంభవిస్తోంది. కలుషిత వాతావరణం, అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు ఇందుకు కారణం.

'ప్రపంచ టీబీ డే' సందర్భంగా టీబీ గురించిన వాస్తవాలు..

ప్రాణాంతక మహమ్మారి నుంచి పారాహుషార్

బ్యాక్టీరియా సోకిన వారందరికీ టీబీ వస్తుందా? అన్న అనుమానం చాలామందిలో వస్తుంది. బ్యాక్టీరియా సోకిన వారందరికీ టీబీ రాదు. వీరిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి మాత్రమే టీబీ వస్తుంది. కొన్ని ఇతరత్ర వ్యాధులతో బాధ పడుతున్న వారికీ చాల సులభంగా సోకే అవకాశం ఉంది.
HIVఉన్నవారికి, ఆల్కహాల్, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు ఎక్కువగా సేవించేవారికి సులభంగా వచ్చే ప్రమాదం ఉంది.

నిర్ధారించడం ఎలా?

టీబీని గుర్తించడం చాల సులభం. స్కిన్ టెస్ట్ ద్వారా లేదా బ్లడ్ టెస్ట్ ద్వారా సులభం గానే టీబీ వ్యాధిని నిర్ధారించవచ్చు. అయితే వ్యాధిని గుర్తించడంలో ఆలస్యమైనా, సరిగ్గా మందులు వేసుకోకపోయినా ఈ జబ్బు మరింత పెరిగి ప్రాణాలను హారిస్తుంది.
టీబీ అనేది మైక్రో బాక్టీరియా ట్యూబరిక్యులోసిన్ అనే బాక్టీరియా తో వచ్చే అంటువ్యాధి. ఈ క్షయ క్రిములు ముఖ్యంగా ఊపిరితిత్తులలో ప్రవేశించి శ్వాసకోశ క్షయవ్యాధిని కలుగచేస్తాయి. ఇది చాలా తీవ్రమైన అంటువ్యాధి. క్షయ వ్యాధి గ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడి నప్పుడు, క్షయ సూక్ష్మ జీవులు గాలిలో వ్యాపిస్తాయి. ఇవి ఇతరులకు గాలి ద్వారా సోకుతాయి. ఈ వ్యాదిని సకాలంలో గుర్తిఇచి.. చికిత్స చేయకపోతే ఆ వ్యక్తి ద్వారా మరింత మందికి క్షయ సోకుతుంది. రోగనిరోధక శక్తి బలహీనమైతే క్షయ వ్యాధి వచ్చే అవకాశాలెక్కువ. శరీరంలోని ఇతర భాగాలకి కూడా క్షయ వ్యాధి రావచ్చు. అనగా శ్వాసకోశేతర భాగాలు 1.ఎముకలు, 2.కీళ్ళు, 3.లింపు గ్రంధులు, 4.మెదడు పొరలు, 5.మూత్ర పిండాలు, 6.గర్భ సంచి మొదలైనవి.

వ్యాధి లక్షణాలు :

1. మూడు వారాలకి పైగా దగ్గు, కఫం
2. సాయంత్రం, రాత్రి సమయాలలో జ్వరం
3. బరువు తగ్గుట, ఆకలి తగ్గుట
4. దగ్గు కఫంతోపాటు రక్తంపడుతుంది

100 నిమిషాల్లో

క్షయ ఎంత సర్వసాధారణమైన వ్యాధో.. దాని నిర్ధారణ అంత కష్టమవుతుంది ఒక్కోసారి. ఊపిరితిత్తుల్లో తలెత్తే క్షయను ఛాతీ ఎక్స్‌రే, కళ్లె పరీక్ష, మాంటో పరీక్ష వంటివాటితో ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నా.. దాన్ని చాలాసార్లు కచ్చితంగా నిర్ధారించటం కష్టమవుతోంది. మరికొన్ని సందర్భాల్లో అనుమానంగా ఉన్న అవయవం నుంచి బయాప్సీ తీసి కూడా పరీక్షించాల్సి వస్తుంటుంది. అయినా రోగ నిర్ధారణకు రావటానికి చాలా సమయం పడుతుంది. మొత్తానికి క్షయ నిర్ధారణ తరచుగా గందరగోళంగా తయారవుతోందన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ కచ్చితమైన ఒక సరికొత్త విధానాన్ని తెరపైకి తెస్తోంది. కేవలం 100 నిమిషాల్లోనే క్షయను గుర్తించే కొత్త పరీక్షకు ఆమోదం తెలిపింది. దీనిని ప్రయోగశాలల్లోనే కాకుండా బయట కూడా చేసే వీలుండటమూ విశేషం. తాజా పరీక్షను డీఎన్ఏ పరిజ్ఞానం ఆధారంగా రూపొందించారు. ఎన్ఏఏటీ (న్యూక్లియక్ యాసిడ్ ఆంప్లికేషన్ టెస్ట్) అని పిలుచుకునే ఇది క్షయను తొలిదశలోనే కాదు.. మందులకు లొంగని మొండి క్షయను, హెచ్ఐవీతో కూడిన సంక్లిష్టమైన క్షయనూ కచ్చితంగా గుర్తిస్తుంది.



క్షయ- ఎయిడ్స్

మూడు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి లేమి, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం – ఉంటే క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. ఎయిడ్స్ వ్యాధి గల వారిలో క్షయ వ్యాధి ఎక్కువగా వస్తుంది. క్షయ వ్యాధికి 'డాట్స్' చికిత్స ఉంది. డాట్ ప్రొవైడర్ స్వయంగా మందులు మింగిస్తారు. క్షయ వ్యాధికి బిసిజి టీకా ఉంది. పిల్లలకు వీలున్నంత తొందరలో ఈ టీకా ఇప్పించాలి.

వ్యాపించే విధానం

క్షయ సోకిన వారు దగ్గినపుడు, వారి ఊపిరితిత్తుల నుండి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతమైన మనిషి పీల్చే గాలితోపాటు అతని ఊపిరితిత్తుల లోనికి ప్రవేశించి జబ్బుకి పునాది వేస్తుంది.

నిరోధక చర్యలు :

- క్షయరోగి దగ్గినప్పుడు నోటికి అడ్డు పెట్టుకోవాలి.
- ఎక్కడ పడితే అక్కడ ఉమ్మకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నిరోధక చర్యగా చిన్న పిల్లలకి బి.సి.జి. టీకా ఇప్పించాలి.



వైద్య పరీక్షలు :

రక్త పరీక్షలు – Tc ,Dc , ESR , Hb Blood sugar , HIV test , HBsAg test , etc .

చికిత్స..

క్షయ లక్షణాలు కలిగిన వ్యక్తికి వెంటనే కఫం పరీక్ష చేసి చికిత్స ప్రారంభించాలి. మందులు వేసుకోవడం మధ్యలో ఆపవద్దు. డాక్టరు సూచన మేరకు 3,6, 9 నెలల పాటు మందులు వాడాలి.
శరీరంలో క్షయ వ్యాధి ఏ భాగంలో ఉన్నప్పటికీ చికిత్సా విధానం మాత్రం ఒకటే. మందులు వాడటం మొదలుపెట్టిన నెల రోజుల్లో రోగికి చాలా వరకూ ఉపశమనం వస్తుంది. కానీ ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు తప్పనిసరిగా మందులు వాడాలి. కొంత మంది ఉపశమనం లభించిందని మందులు వాడటం మానేస్తుంటారు. మందులు మధ్యలో మానేస్తే జబ్బు తిరిగి వస్తుంది.

నివారణ చర్యలు..

వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రతతోపాటు ఇళ్లలో గాలి, వెలుతురు మొదలైనవి బాగా ఉండేలా చూసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి. ఎక్కడపడితే అక్కడ కళ్లె ఉమ్మేయకూడదు. పోషకాహారం తీసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింపచేసుకోవాలి.

క్షయ విశ్వరూపం

- మన దేశంలో ప్రతి రోజు 1000 మంది క్షయతో మృత్యువాత పడుతున్నారు.
- మన రాష్ట్రంలో ఏటా కొత్త కేసుల్లో 1.8శాతం మందులకు లొంగని క్షయ కేసులు నమోదవుతున్నాయి.
- పాత కేసుల్లో 11.8శాతం మందు లకు లొంగని క్షయ కేసులు ఉన్నాయి.
- జైళ్లలోఉన్న రిమాండ్ ఖైదీల్లో క్షయ వ్యాధి ఎక్కువగా ఉంది. సాధారణ ప్రజలతో పోలిస్తే 10– 20 రెట్లు ఎక్కువ కేసులు జైళ్లలో నమోదవుతున్నాయి.
- అనంతపురం, కర్నూలు, నెల్లూరు, వరంగల్, కరీంనగర్, మెదక్, ఆదిలా బాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది.
- క్షయ వ్యాధిని నిర్మూలించే ఉద్దేశం తో భారత ప్రభుత్వం, వైద్య, ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ TB FREE WORLD అనే విజన్‌తో END TB SUMMIT ను march 13, 2018, విజ్ఞాన్ భవన్, NEW DELHIతో నిర్వహించింది. భారత్‌లో క్షయ వ్యాధిని 2025 వరకు నిర్మూలించాలని పిలుపునిచ్చారు.
- ప్రపంచంలో అత్యధిక క్షయవ్యాధిగ్రస్తులు, భారత్‌లో నమోదైనట్టు Global TB Report - 2017 ప్రపంచ ఆరోగ్య సంస్థకు అందించింది.
- క్షయ వ్యాధి వల్ల ఏటా 4లక్షల ప్రజలు చనిపోతున్నారని పేర్కొంది. రోజు వారీగా చూసుకుంటే 1400 మంది మృతిచెందుతున్నారు.
- ప్రతి యేటా 29 లక్షల మంది కొత్తగా క్షయ వ్యాధి గ్రస్తులవుతున్నారు.
- "క్షయ వ్యాధి నిర్మూలన" అనేది భారత ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది
- ఏటా క్షయ వ్యాధి వల్ల రూ.20,000 కోట్లు నష్టం వాటిల్లుతోంది.
- వైద్యులు, ఫార్మసిస్టులు టీబీ పేషెంట్లను గుర్తించి వారికి ట్రీట్‌మెంట్ చేసి, క్షయ వ్యాధి గ్రస్తుల రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. భారత ప్రభుత్వం ప్రోత్సాహకంగా ప్రతి టీబీ పేషెంటుకు చికిత్స చేసిన వైద్యునికి రూ.500, ఫార్మసిస్టుకు రూ.1000 చొప్పున అందిస్తోంది.



డాక్టర్ ఆకుల సంజయ్‌రెడ్డి
ఫార్మకాలజిస్ట్
అధ్యక్షులు, తెలంగాణ ఫార్మ సొసైటీ

తాగాల్సిందే..!



భూమి మీద మూడోవంతు నీరు ఉంటుంది. అలాగే మన శరీరంలో కూడా మూడోవంతు నీరు ఉంటుంది. భూమి మీద జీవనం సాగించడానికి నీరు కీలకపాత్ర పోషిస్తుంది. భూమి మీద నీరు ప్రవహిస్తుంది. అలాగే మన శరీరంలో నీరు అన్ని భాగాలకు ప్రసరిస్తుంది. స్రావాలు, కణజాలం, కణాలు, లింప్, రక్తం, స్రావాలు క్రమపద్ధతిలో విధులు నిర్వహించాలంటే నీటి ఆవశ్యకత ఎంతైనా ఉంది.
జీర్ణక్రియ, శ్వాసక్రియ, శరీర ఉష్ణోగ్రతను సమస్థితిలో ఉంచడానికి, శరీర ఆకారం ఏర్పడటానికి నీటి వినియోగం ఎంతైనా ఉంది. మన శరీరం సగటున 42 లీటర్ల నీటిని సంగ్రహిస్తుంది. కేవలం 2.7 లీటర్ల నీటిని మాత్రమే నీటిని విసర్జిస్తున్నాం. అతిసార వ్యాధి, చికాకు, అలసట, మగతగా ఉండటం, బలహీనత, తలనొప్పివంటి లక్షణాలు కలగడానికి నీటి పాత్ర కీలకంగా ఉంది.

శరీరానికి అవసరమైన నీరు

శరీర క్రియలు జరగాలంటే నీరు అత్యంత ముఖ్యం. మన శరీరం ప్రతిరోజు రెండు నుంచి మూడు లీటర్ల నీటిని విసర్జిస్తుంది. మూత్రం ద్వారా చెమట ద్వారా, వ్యాయామం ద్వారా, శ్వాసక్రియ ద్వారా, అనారోగ్యానికి గురయినప్పుడు, కోలుకునే సమయంలో, ఎక్కువగా పనిచేసినప్పుడు, గర్భిణీగా ఉన్న సమయంలో నీరు ఎక్కువగా విసర్జింపబడే అవకాశాలున్నాయి. ద్రవపదార్థాలే కదా అని చాలామంది కాఫీలు, టీలు, శీతలపానీయాలు, చక్కెరశాతం అధికంగా ద్రావాలను తీసుకుంటారు. దీనివల్ల శరీరానికి ఎటువంటి ఆరోగ్య ప్రయోజనం చేకూరదు. పైగాఅనారోగ్యానికి గురవుతారు. శరీరంలో ఉన్న నీటిని కోల్పోయే స్థితి నెలకొంటుంది. శరీరంలో నీటిశాతం పెరగాలంటే స్వచ్ఛమైన మంచినీటిని తీసుకోవాలి. శరీరం నీటిని కోల్పోతే అతిసార వ్యాధి రావొచ్చు.

అతి సార లక్షణాలు

మలబద్ధకం, తలనొప్పి, అజీర్తి, బరువు పెరగడం, మూత్రం ఆగిపోవడం, పసుపు పచ్చ లేదా ఎరుపు వర్ణంలో మూత్రం విసర్జించడం, కిడ్నీల్లో రాళ్లు, మూత్రాశయ, మూత్రనాళ ఇన్ఫెక్షన్ కూడా అతిసార లక్షణాలుగా పరిగణించాలి.

నీటి ప్రయోజనాలు

నీటి వల్ల శరీరంలోని స్రావాలు సమస్థితిలో ఉంటాయి. కండరాలకు శక్త కలుగుతుంది. చర్మం పాలిపోకుండా ఉంటుంది. కిడ్నీల ఆరోగ్యానికి దోహదపడుతుంది. మలబద్ధకం నివారిస్తుంది.



డాక్టర్ జీనత్ ఫాతిమా
సీనియర్ డైటీషియన్
కాంటినెంటల్ హాస్పిటల్స్

ఔషధాల టీ



రోజూ ఉదయమే టీ తాగి దినచర్య ప్రారంభించేవారు వారు ఎందరో ఉన్నారు. టీ ఎక్కువగా తాగడం వల్ల వచ్చే అనార్థాలు ఎక్కువగానే ఉన్నా టీ తాగకుండా ఉండలేరు. అలాంటివారు రోటిన్‌గా తాగే టీ కాకుండా వెరైటీగా చేసుకునే టీతో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో తులసి టీ వల్ల కలిగే లాభాలు తెలుసుకుందాం..

- కొద్ది కాలం పాటూ రోజు తులసి టీ తాగటం వలన వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మంలో ఉండే నిర్జీవ కణాలను తొలగించి, నూతన కణాల ఉత్పత్తికి తోడ్పడతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారుతుంది. దీంతో ముసలితనం వల్ల వచ్చే ముడతలను నివారించవచ్చు.
- మధుమేహంతో బాధపడేవారికి తులసి టీ చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండే అన్–శాచ్యురేటేడ్ ఫాటీ ఆసిడ్‌లు రక్తంలో ఉండే అధిక చక్కెర స్థాయిలను తగ్గిస్తాయి. బ్లడ్ షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నవారు రోజుకు ఒకసారి తులసి టీ తాగటం చాలా మంచిది.
- అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణసంబంధమైన సమస్యలతో బాధపడేవారికి తులసి టీ మంచి ఉపశమనం కలిగిస్తుంది. యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉండే తులసి టీ అన్ని రకాల జీర్ణక్రియ సమస్యలను తగ్గిస్తుంది.
- శరీరాన్ని డిటాక్సిఫై చేసి.. శరీరంలో మలినాలు పేరుకు పోకుండా కాపాడుతుంది. మూత్రపిండాలలో రాళ్లతో బాధపడుతున్న వారు ఈ టీని తాగితే కిడ్నీస్టోన్స్ త్వరగా కరిగిపోయే అవకాశం ఉంది.

గుండె పనితీరు మెరుగుపరిచేలా..!

మనం తీసుకునే ఆహారాల పదార్థాలన్నీ రసాయనాలు, క్రిమిసంహారక మందులతో పూర్తిగా నిండి ఉన్నాయి. ఇవి అధిక బరువు, మధుమేహం, గుండెపోటు, కాలేయం, మూత్ర పిండాల సమస్యల వంటి వ్యాధుల పెరుగుదలకు దారితీస్తాయి. అంతేకాదు మరణానికి ప్రధాన కారణాలైన గుండె జబ్బులు, స్ట్రోక్ వంటివాటికి మనం తీసుకునే ఆహారమే కారణం అవుతుంది. అందుకే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం బరువును తరచూ చెక్ చేసుకోవడంతో పాటు మనం తీసుకునే ఆహారం గురించి జాగ్రత్త తీసుకోవాలి. ధూమ పానానికి దూరంగా ఉండటం, టెన్షన్ తగ్గించుకోవడం వంటివి చాలా ముఖ్యం. మీ గుండె పనితీరు సక్రమంగా ఉండటానికి, పరి శుభ్రమైన ఆహారాన్ని తప్పక తీసు కోవాలి. తాజా ఆహార పదార్థాలు తింటే గుండె పనితీరు మెరుగు పడుతుంది.



- రోజూవారిగా తీసుకునే ఆహారంలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటే గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని 25 శాతం మేర తగ్గుతాయి. ఇవి ఎక్కువగా అవిసె గింజలు, మిల్‌మేకర్, సాల్మోన్ ఫిష్‌లో ఉంటాయి.
- ప్రోటీన్లను ఎక్కువగా ఉండే పప్పు ధాన్యాలు, ఎండిన బీన్స్, బఠానీలు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో చాలా బాగా పనిచేస్తాయి. వీటిలో పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి అధికంగా ఉండి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి.
- నట్స్, గింజలు వంటివాటిలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. వీటిలో గుండె ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు అవసరమైన విటమిన్లు, మినరల్స్ ఎక్కువగా లభిస్తాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. గుండె పనితీరును వేగవంతం చేసే రక్త సరఫరాను నియంత్రించ డానికి సహాయపడే మెగ్నీషియం నట్స్ లో ఎక్కువగా ఉంటుంది. గుమ్మడికాయ గింజలు, బాదం, పొద్దుతిరుగుడు గింజలు, జీడిపప్పు వంటి ఆహారంలో తప్పక చేర్చాలి.
- యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్లను అందించడంలో త ఐధాన్యాలు చాలా ఉత్తమమైనవి. ఎక్కువ పోషక విలువను కలిగి ఉన్న చిరుధాన్యాలతో చేసిన రొట్టెలను ఆహారంగా తీసుకుంటే గుండెను ఆరోగ్యంగా ంచడంలో సహాయపడుతాయి.
- హార్ట్ అండ్ స్ట్రోక్ ఫౌండేషన్ ప్రకారం చక్కెరను ఎక్కువగా తినడం వల్ల గుండె జబ్బులు, డయాబెటిస్, రక్తంలో అధికంగా కొలెస్ట్రాల్ స్థాయి పెరు గుతుంది. చక్కెర వాడకాన్ని దానికి బదులుగా సహజమైన తేనే,నీరును (లేదా) కొబ్బరినీరును తాగటం మంచిది.
- ప్రతిరోజూ కూరగాయలను తినడం వల్ల గుండే ఆరోగ్యంగా ఉంటుంది.
- రోజూ రెండు రకాల కూర గాయలు తప్పక తినాలి. సలాడ్స్‌గా కూడా తీసుకోవాలి.
- గుండె ఆరోగ్యంగా ఉండాలంటే మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు,
- త ఐధాన్యాలు, పప్పు ధాన్యాలు ఆహారంలో చేర్చాలి. వారంలో రెండు సార్లు మాంసాహారాం తినవచ్చు.
- పోషకాలను ఎక్కువగా కలిగి ఉన్న ఆహారానికి అధిక ప్రాధాన్యత ఇస్తే.. గుండె పనితీరు బాగుంటుంది.



నిద్ర పట్టకపోతే...

గర్భిణికి నెలలు నిండేకొద్దీ ఓ పట్టాన నిద్రపట్టదు. అలాగని ఎక్కువసేపు మెలకువగా ఉండలేని పరిస్థితి. దీని నుంచి అధిగమించాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. పడుకునే సమయాన్ని నిర్దిష్టంగా పెట్టుకోవాలి. దానికి తగినట్టు దినచర్యను రూపొందించుకోవాలి. ఒకవేళ నిద్ర రాకపోయినా విశ్రాంతి కోసం కనీసం నడుము వాల్చాలి.

- నిద్రపోయేందుకు కనీసం గంట ముందు సెల్‌ఫోను, కంప్యూటరు, టీవీ లాంటివాటిని దూరం పెట్టేయాలి. కుదిరితే ఏదైనా పుస్తకం చదవడం మొదలెట్టాలి. దీంతో హాయిగా నిద్రపడుతుంది.
- గర్భం దాల్చినప్పుడు కాస్త భారంగా అనిపిస్తుంది. అయినప్పటికీ భోజనం చేసిన తర్వాత కాసేపు నడవాలి. కుదిరితే నిపుణుల పర్యవేక్షణలో చిన్న చిన్న వ్యాయామాలూ, యోగాసనాలు వేస్తే మంచిది. దీంతో రాత్రిళ్లు హాయిగా నిద్రపడుతుంది. ఈ రోజుల్లో కేవలం గర్భిణులకు వ్యాయామాలూ, ఆసనాలూ చెప్పే నిపుణులూ ఉన్నారు. వారి సేవల్ని ఉపయోగించుకోవచ్చు.
- వెల్లకిలా పడుకుంటే గర్భిణులకు సౌకర్యంగా అనిపిస్తుంది. కానీ దానివల్ల బిడ్డకు అందే ప్రాణవాయువుకు ఆటంకం ఏర్పడుతుంది. దాంతో తల్లి వెన్నెముకపై భారం పడుతుంది. అందుకే కాస్త కష్టంగా అనిపించినా ఒక పక్కకు తిరిగి పడుకునేలా చూసుకోవాలి. అది అసౌకర్యంగా అనిపిస్తే గనుక పొట్టకు ఆసరాగా దిండ్లు పెట్టుకోవచ్చు.
- పడుకున్నప్పుడు శ్వాస తీసుకోవడం అసౌకర్యంగా అనిపిస్తుంటే.. తలను కాస్త ఎత్తుగా పెట్టి పడుకోవాలి. అలాగే కాళ్ల అడుగున కూడా ఆసరాగా ఒక దిండు ఏర్పాటు చేసుకుంటే ఇబ్బంది కాస్త తగ్గుతుంది.


ఎలవెనిల్ వలరివన్

వలరివన్ పసిడి గురి

- వ్యక్తిగత, జట్టు విభాగాల్లో స్వర్ణాలు సొంతం
- జూనియర్ ప్రపంచకప్ షూటింగ్

సిడ్నీ : షూటింగ్‌లో భారత పతకాల పంట పండుతోంది. మొన్న సీనియర్ ప్రపంచకప్‌లో మనోళ్లు రెచ్చిపోగా, తాజాగా జూనియర్ ప్రపంచకప్‌లోనూ అదే జోరు కొనసాగుతోంది. భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ రెండు స్వర్ణాలు సాధించింది. 10 మీటర్ల మహిళల ఎయిర్ రైఫిల్ విభాగంలో వలరివన్ పసిడి గురి కొట్టింది. 249.8తో ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన వలరివన్ వ్యక్తిగత విభాగం స్వర్ణం సొంతం చేసుకున్నది. శ్రేయాష్ అగర్వాల్, జీనా ఖిట్టాలతో కలిసి జట్టు విభాగంలో వలరివన్ మరో పసిడి షూట్ చేసింది. బాయ్స్ విభాగంలో అర్జున్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో రెండో ప్రపంచకప్ కాంస్యం కైవసం చేసుకున్నాడు.



కోచి కాదు త్రివేండ్రం

- విండీస్‌తో వన్డే వేదిక మార్పు
- కేరళ క్రీడా మంత్రి ప్రత్యేక చొరవ

ముంబయి : నవంబర్ 1న కొచిలో జరగాల్సిన భారత్, వెస్టిండీస్ వన్డే మ్యాచ్ వేదిక వివాదం రాజకీయ మలుపు తీసుకోవటంతో కేరళ క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం మార్చుకున్నది. ఈ వన్డే వేదికను కోచి నుంచి రాజధాని తిరువనంతపురంకు మార్పు చేస్తున్నట్టు తెలిపింది. కేరళ బ్లాస్టర్ సహ యజమాని సచిన్, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్‌లు విండీస్‌తో వన్డే వేదికపై పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్‌తో ఫిర్యాదు చేయగా.. ఆయన కేరళ క్రికెట్ ఆఫీస్ బేరర్లతో మాట్లాడాడు. కోచిలో 2017 అండర్-17 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు ఆతిథ్యం వహించింది. ప్రపంచ స్థాయి సాకర్ టర్ఫ్ అక్కడ ఏర్పాటు చేశారు. క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తే.. పిచ్ తయారీ కోసం టర్ఫ్‌ను తవ్వాల్సి ఉంటుంది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కేరళ క్రికెట్ సంఘం ఉన్నతాధికారులతో కేరళ క్రీడాశాఖ మంత్రి సమావేశమై.. సమస్యను పరిష్కరించారు. కోచి, త్రివేండ్రంలోని రెండు స్టేడియాలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నవే, కానీ ఈ రెండింటితోనూ క్రికెట్ సంఘం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఫుట్‌బాల్ కోసం కోచి నుంచి తిరువనంతపురానికి వన్డే వేదికను మార్చాలని మంత్రి సూచించగా.. క్రికెట్ అసోసియేషన్ అందుకు అంగీకరించింది.


మహ్మద్ షమి

కుటుంబ కలహంలో భాగంలో చెలరేగిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో కొంత కాలంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న భారత క్రికెటర్ మహ్మద్ షమికి ఎట్టకేలకు స్వాంతన లభించింది. భార్య హసిన్ జహన్ చేసిన ఆరోపణలపై దర్యాప్తు చేసిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం మహ్మద్ షమికి క్లీన్‌చిట్ ఇచ్చింది. దీంతో కేంద్ర కాంట్రాక్టుల్లో గ్రేడ్-బిని బీసీసీఐ అందజేసింది. దీంతో ఏప్రిల్ 7 నుంచి ఆరంభమయ్యే ఐపీఎల్ ఆడేందుకు సైతం షమికి లైన్ క్లియర్ అయినట్టే!.

షమికి స్వాంతన

- ఫిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ క్లీన్‌చిట్
- ఐపీఎల్‌లో ఆడేందుకు లైన్‌క్లియర్
- గ్రేడ్-బి కాంట్రాక్టు జాబితాలో చోటు
- వెల్లడించిన భారత క్రికెట్ బోర్డు

నవతెలంగాణ-ముంబయి

భారత క్రికెటర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసిన్ జహన్ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం కొట్టిపారేసింది. పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్ ఆదేశాలకు మేరకు ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ నేతృత్వంలోని అనినీతి నిరోధక విభాగం దర్యాప్తు చేపట్టింది. వారం రోజుల విచారణ అనంతరం నీరజ్ కుమార్ గురువారం పాలకుల కమిటీకి దర్యాప్తు నివేదికను అందజేశారు. నివేదికలో మహ్మద్ షమిపై వచ్చిన ఫిక్సింగ్ ఆరోపణలను కొట్టివేయగా.. అతడిపై ఎటువంటి చర్యలు అవసరం లేదని సూచించినట్టు తెలుస్తోంది. నీరజ్ కుమార్ నివేదికను బీసీసీఐ అంతర్గత వ్యవహారంలో భాగంగా రహస్యంగా ఉంచింది. మహ్మద్ షమికి క్లీన్‌చిట్ లభించటంతో.. కేంద్ర కాంట్రాక్టులోకి అతడిని తిరిగి తీసుకున్నారు. గ్రేడ్-బి విభాగంలో చోటుచేసుకున్న మహ్మద్ షమికి ఏడాదికి రూ. 3 కోట్లు లభించనున్నాయి. ఈ కాంట్రాక్టు 2016 సెప్టెంబర్ నుంచి వర్తించనున్నది. అయితే, షమిపై ఆమె భార్య చేసిన ఇతర ఆరోపణల విషయంలో బీసీసీఐకి ఎటువంటి సంబంధం లేదని.. కేవలం మ్యాచ్ ఫిక్సింగ్ కోణంలోనే బోర్డు షమిపై విచారణ చేస్తుందని గతంలోనే బోర్డు పెద్దలు స్పష్టీకరించిన సంగతి తెలిసిందే. భార్య వివాహేతర సంబంధాలపై ఆమె భార్య కోల్‌కత పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి క్రైం బ్రాంచ్ దర్యాప్తు చేపడుతోంది.

ఐపీఎల్‌లో ఆడేందుకు లైన్ క్లియర్



దేశం పట్ల, క్రికెట్ పట్ల మహ్మద్ షమి నిజాయితీ, అంకిత భావం ప్రశ్నించలేనిదని మాజీ కెప్టెన్ ఎం.ఎస్ ధోని బాసటగా నిలువగా, రాష్ట్ర క్రికెట్ జట్ల కెప్టెన్లు, కోచ్‌లు సైతం షమికి మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో కుటుంబ కలహాల విషయంలో బీసీసీఐ తన వైఖరిని మార్చుకున్నది. కేవలం మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణల్లోనే షమిపై విచారణ చేపట్టింది. బీసీసీఐ క్లీన్‌చిట్‌తో మహ్మద్ షమి ఐపీఎల్ ఆడటం ఖాయమైంది. ఈ ఏడాది ఆటగాళ్ల వేలంలో షమిని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 3 కోట్లకు కొనుగోలు చేయగా.. రైట్ టూ మ్యాచ్ కార్డ్‌తో ఢిల్లీ డెర్‌డెవిల్స్ షమిని సొంతం చేసుకున్నది. మహ్మద్ షమి ఐపీఎల్ ప్రాతినిథ్యంపై బీసీసీఐ వర్గాలతో సంప్రదింపులు జరిపిన డెర్‌డెవిల్స్ యాజమాన్యం.. తాజా నీరజ్ కుమార్ నివేదికతో షమిని జట్టులోకి తీసుకోనున్నది.

ఆమెకు రూ. లక్ష ఇచ్చాను : మహ్మద్ షమి

భార్య హసిన్ జహన్‌తో మహ్మద్ షమి వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. హసిన్ జహన్ ఎల్లప్పుడూ డబ్బుపైనే మమకారం పెంచుకున్నదని, రూ. లక్షలు పెట్టి నెలకోసారి షాపింగ్ చేసేదని మహ్మద్ షమి మామ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఇక తాజాగా మార్చి 20, 2018న హసిన్ జహన్ ఖాతాలో రూ. లక్ష రూపాయల చెక్ జమ చేసినట్టు మహ్మద్ షమి తన బ్యాంకు ఖాతా వివరాలను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. జహన్ స్వభావం ఇదేనని, ఆమె చేసే రచ్చ అంతా డబ్బు కోసమేనని షమి పరోక్షంగా సంకేతాలు ఇచ్చాడు. తక్షణమే జహన్ పేరు మీద ఆస్తులు కొనుగోలు చేయాలని ఆమె ఒత్తిడి తీసుకొచ్చిందని, ఈ విషయమై కుటుంబంలో మాట్లాడుకుందామని చెప్పినా ఆమె వినలేదని షమి మామ పేర్కొన్నాడు.


మీడియాతో మాట్లాడుతున్న హసిన్ జహన్

భార్య హోదా లేదు : హసిన్ జహన్

మరోవైపు షమి భార్య హసిన్ జహన్ తన ఆరోపణలను కొనసాగిస్తూనే ఉన్నది. మహ్మద్ షమితో ఇతర మహిళలతో చేసినట్టుగా చెబుతున్న సందేశాల స్కీన్ షాట్స్‌ను కొన్నింటిని ఆమె గురువారం సోషల్ మీడియాలో ఉంచింది. 'మహ్మద్ షమి నాకు భార్య హోదా ఇవ్వలేదు, సతీమణిగా నాకు ఉండాల్సిన హక్కులను అనుమతించలేదు. తను ఎంత సంపాదిస్తున్నాడు, ఏం చేస్తున్నాడనే విషయాల్లో నాతో గోప్యత పాటించాడు. కేవలం కుటుంబ ఖర్చులకు మాత్రమే నాకు డబ్బులు ఇచ్చాడు' అని హసిన్ జహన్ తెలిపింది. ఇక నేడు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీను జహన్ కలువనున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరుతూ ఇటీవల జహన్ లేఖను సీఎం ఇంటి దగ్గర అందజేసింది. శుక్రవారం సీఎంను కలిసే అవకాశం కనిపిస్తోంది. 'ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలువాలని అనుకుంటున్నాను. ఆమెకు నా బాధలు చెప్పి, సహాయం చేయమని కోరతాను' అని జహన్ మీడియాతో పేర్కొన్నది.


అలిస్టర్ కుక్ (5)ను అవుట్ చేసిన ఆనందంలో ట్రెంట్ బౌల్ట్ (6/32)

ఇంగ్లాండ్ 58 ఆలౌట్

- నిప్పులు చెరిగిన బౌల్ట్, సౌథి
- రాణించిన విలియమ్సన్
- కివీస్‌తో ఇంగ్లాండ్ తొలి టెస్టు

ఆక్లాండ్ : డేనైట్ టెస్టులో ఇంగ్లాండ్‌కు పీడకలి మిగిల్చింది కివీస్. ఓ వైపు ట్రెంట్ బౌల్ట్, మరో వైపు టిమ్ సౌథిలు నిప్పులు చెరగటంతో ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్ తోకముడిచారు. ఓ దశలో 28/9తో అత్యల్ప స్కోరుకే కుప్పకూలేలా కనిపించిన ఇంగ్లాండ్.. మరో 30 పరుగులు జోడించి 58 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ట్రెంట్ బౌల్ట్ (6/32), టిమ్ సౌథి (4/25) ఇద్దరే ఇంగ్లాండ్ భరతం పట్టారు. అలిస్టర్ కుక్ (5), జో రూట్ (0)లను వెన్వెంటనే అవుట్ చేసిన బౌల్ట్ ఇంగ్లాండ్‌కు గట్టి ఝలక్ ఇచ్చాడు. కానీ కొద్దిసేపటికే మలన్ (2), స్టోన్‌మన్ (11), స్టోక్స్ (0), బెయిరిస్టో (0)లు సైతం వికెట్లు కోల్పోయారు. దీంతో 18 పరుగులకే ఇంగ్లాండ్ ప్రధాన బ్యాట్స్‌మెన్‌ను కోల్పోయింది. మోయిన్ అలీ (0), క్రిస్ వోక్స్ (5)లు అదే దారి పట్టారు. ఆఖరి వికెట్‌కు కోవర్టన్ (33) రాణించటంతో ఇంగ్లాండ్ 50 పరుగుల మార్క్ చేరుకున్నది. లేదంటే 30 లోపే చాపచుట్టేసేదే!. 20.4 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు శుభం కార్డు పడింది. కివీస్ తరపున బౌల్ట్, సౌథిలు మినహా మరొకరు బంతి పట్టాల్సిన అవసరం రాలేదు. ఇక కెప్టెన్ కేన్ విలియమ్సన్ (91 నాటౌట్, 177 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) అజేయ ఇన్నింగ్స్‌తో రాణించటంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 175/3తో కొనసాగుతోంది. నికోలస్ (24) కెప్టెన్‌కు తోడుగా క్రీజులో ఉన్నాడు. ఓపెనర్ రావెల్ (3) ఆరంభంలోనే అవుట్ కాగా.. మరో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ పునరావృతం కానున్నదా? అనిపించింది. కానీ టామ్ లాథమ్ (26)తో కలిసి విలియమ్సన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 117 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఎల్గార్ అజేయ శతకం

కేప్‌టౌన్ : ఆస్ట్రేలియాతో మూడో టెస్టులో డీన్ ఎల్గార్ (121) అజేయ సెంచరీతో చెలరేగాడు. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఓపెనర్ మార్క్‌రం (0)ను ఆరంభంలోనే కోల్పోయింది. ఆమ్లా (31) సైతం నిరాశపరిచాడు. కానీ డివిలియర్స్ (64), ఎల్గార్ జోడీ రాణించటంతో దక్షిణాఫ్రికా ఓ దశలో 220/2తో పటిష్టంగా కనిపించింది. కానీ కమిన్స్ (4/64) ప్రదర్శన ఆసీస్‌కు ఊరటనిచ్చింది. డుప్లెసిస్ (5), బవుమా (1), డికాక్ (3), ఫిలాండర్ (8), కేశవ్ (3)లు స్వల్ప విరామంలో వికెట్లు కోల్పోయారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 266/8తో కొనసాగుతోంది.


దినేశ్ కార్తీక్

చెన్నైకి ఆడలేనేమో!

న్యూఢిల్లీ : ఒక్క సూపర్ ఇన్నింగ్స్‌తో సూపర్ స్టార్‌డమ్ సొంతం చేసుకున్న ఆటగాడు దినేశ్ కార్తీక్. బంగ్లాదేశ్‌పై 8 బంతుల్లోనే 29 పరుగులు బాదిన కార్తీక్ ఫైనల్లో భారత్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. తాజా ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్‌కు సారథ్యం వహించబోతున్న కార్తీక్.. సొంత రాష్ట్ర ఫ్రాంచైజీ తరఫున ఆడాలనే బలీయమైన కోరికను బయటపెట్టాడు. 'మనసులో మాట.. తొలి సీజన్ నుంచే చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడాలని, ఆ జట్టుకు సారథ్యం వహించాలని స్వప్నించాను. పది సీజన్లు ముగిశాయి. కానీ కల నెరవేరలేదు. ఇప్పుడు కోల్‌కతకు నాయకత్వం వహించటం సంతోషంగా ఉంది. కానీ ఐపీఎల్‌లో చెన్నై తరఫున ఇక ఆడలేనేమోనని అనిపిస్తోంది!. నేను చెన్నైలో పుట్టి, పెరిగాను. కాబట్టి చెన్నై తరఫున ఆడాలనే కోరిక ఉండటం సహజమే. కానీ భవిష్యత్‌లో అటువంటి అవకాశం కనిపించటం లేదు' అని దినేశ్ కార్తీక్ అన్నాడు.



సైనా, సింధు కుటుంబ సభ్యులను అనుమతించండి

- భారత ఒలింపిక్ సంఘం డిమాండ్

న్యూఢిల్లీ : రియో ఒలింపిక్స్ మాదిరిగానే గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడలకూ అవసరం లేని అధికార గణంతో వెళ్లేందుకు ఒలింపిక్ సంఘం రంగం సిద్ధం చేసిన నేపథ్యంలో ఐఓఏ అధ్యక్షుడు నరెందర్ బాత్రా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అర్హత లేని 41 మంది అధికారులకు క్రీడా మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే. అథ్లెట్లకు వీడ్కోలు పలుకుతూ ఈ అంశంపై బాత్రా స్పందించాడు. 'సింధు, సైనా కుటుంబసభ్యులు గోల్డ్‌కోస్ట్‌కు వెళ్లకుండా క్రీడా శాఖ ఎందుకు అడ్డుకుంటుందో అర్థం కావటం లేదు. ప్రభుత్వం వారి ఖర్చులు భరించనప్పుడు వారికెందుకు అభ్యంతరం. సచిన్, విరాట్ విషయంలో క్రీడా శాఖ ఇలాగే చేస్తుందా? మరి సింధు, సైనా విషయంలో ఎందుకు ఈ వైఖరి?' అని బాత్రా అన్నాడు. ఇక అధికార బృందంలో భాగంగా కామన్‌వెల్త్ గేమ్స్‌కు వెళ్తున్నామనే వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని సింధు, సైనా తల్లిదండ్రులు వివరణ ఇచ్చారు. రియో ఒలింపిక్స్ అయినా, మరే ఇతర టోర్నీ అయినా సొంత ఖర్చులతోనే వెళ్తున్నామని సింధు తండ్రి రమణ, సైనా నాన్న హర్వీర్ సింగ్ తెలిపారు. సింధు తల్లి విజయ, సైనా తండ్రి హర్వీర్‌లు అధికారుల బృందంలో భాగంగా వెళ్తున్నారనే వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.

పొట్టి పోరులోనూ పరాభవమే

- భారత్‌పై ఆసీస్ గెలుపు
- మహిళల ముక్కోణపు టీ20



ముంబయి : లయ తప్పిన టీమ్ ఇండియా అమ్మాయిలు.. మళ్లీ గెలుపు ట్రాక్ పైకి వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు!. ఫార్మాట్ మారినా ఫలితంలో మార్పు కనిపించటం లేదు. 0-3తో వన్డే సిరీస్‌ను కోల్పోయిన అమ్మాయిల జట్టు తాజాగా ముక్కోణపు టీ20 టోర్నీ తొలి మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలయ్యారు. ఓపెనర్ స్మృతి మంధాన (67, 41 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్) అర్థ సెంచరీతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 152/5 పరుగులు చేసింది. ఛేదనలో మూనీ (45), విలనీ (39), లానింగ్ (35) రాణించటంతో 18.1 ఓవర్లలోనే ఆస్ట్రేలియా పని పూర్తి చేసింది. నేడు జరిగే మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లు తలపడనున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.